ఆంధ్రభూమి

THAILAND PACKAGE
With 1N SRILANKA FREE
GROUP DEPARTURE ON 25FEB'18
INR 28,999* Per Person.
4Nights / 5Days
Above cost includes :
Airfare ex Hyderabad on Srilankan Airlines / Airport Taxes.
Airport transfers / 2N Pattaya - 1N Bangkok - 1N Negambo
Stay in 3* Hotel with Breakfast / Coral island tour with lunch
City tour of Bangkok / City tour of Colombo.
*Terms and conditions apply:
Booking First come basis only / Govt Taxes extra.
Visa charges extra / Rates are subject to change.
Contact us @ Hyd office :
040 23311495 / 9553304546. SriLankan Holidays

సంపుటి: 29 . సంచిక: 263 | విజయవాడ సిటీ | హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, రాజమహేంద్రవరం, అనంతపురం, కరీంనగర్, నెల్లూరు | www.andhrabhoomi.net | గురువారం 22 ఫిబ్రవరి, 2018 | 20 పేజీలు | ధర: రూ.3.00

శుభోదయం

కలియుగం - 5119

శాలివాహన శకం - 1939

శ్రీ చాంద్రమాన హేవలంబి నామ సంవత్సరం
ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణమాసం,
శుక్లపక్షం; తిథి: శుద్ధ సప్తమి రా.11.53;
నక్షత్రం: భరణి ఉ.11.28
వర్జ్యం: రా.10.55 నుండి 12.26 వరకు
దుర్ముహూర్తం: ఉ.10.00 నుండి 10.48 వరకు,
తిరిగి మ.02.48 నుండి 03.36 వరకు
రాహుకాలం: మ.1.30 నుండి 3.00 వరకు



ప్రమాద స్థలిలో చెల్లాచెదురుగా పడివున్న మృతదేహాలు.

రక్తమోడిన రహదారి

44వ ఎన్‌హెచ్‌పై ప్రమాదం

తొమ్మిది మంది దుర్మరణం

వనపర్తి/ కొత్తకోట, ఫిబ్రవరి 21: వనపర్తి జిల్లా కొత్తకోట మండలం కనిమెట్టగ్రామ శివారులో గల 44వ జాతీయ రహదారిపై బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో తొమ్మిదిమంది మృతిచెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదంతో ఒక్కసారిగా జాతీయ రహదారి శ్మశానాన్ని తలపించింది. చెల్లాచెదురై పడ్డ మృతదేహాలు, కార్లలో ఇరుక్కపోయిన మరికొన్ని మృతదేహాలు అక్కడి వాతావరణాన్ని భయానకంగా మార్చేశాయి. హైద్రాబాద్ - మిగతా 6వ పేజీలో

ఈపీఎఫ్ వడ్డీ 8.55 శాతమే

తగ్గించిన ఈపీఎఫ్ఓ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: ఉద్యోగుల భవిష్య నిధి (ఈపీఎఫ్) వడ్డీ రేటు 2017-18 ఆర్థిక సంవత్సరానికి 8.55 శాతానికి తగ్గింది. ఆరు కోట్ల మందికి పైగా ఉన్న ఈపీఎఫ్ చందాదారులకు గత ఆర్థిక సంవత్సరం చెల్లించిన 8.65 శాతం వడ్డీని ఈ ఆర్థిక సంవత్సరం 8.55 శాతానికి తగ్గించాలని ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్ఓ) బుధవారం నిర్ణయించింది. ఈపీఎఫ్ఓ ట్రస్టీల సమావేశంలో తీసుకున్న ఈ నిర్ణయాన్ని అనంతరం కేంద్ర కార్మిక శాఖ మంత్రి సంతోశ్ గంగ్వార్ విలేఖరులకు వెల్లడించారు. గత ఆర్థిక సంవత్సరం 8.65 శాతం వడ్డీని చెల్లించడం ద్వారా రూ. 695 కోట్ల మిగులు ఉందని, ఈ ఆర్థిక సంవత్సరం వడ్డీ రేటును 8.55 శాతానికి తగ్గించాలని నిర్ణయించినందున, రూ. 586 కోట్ల మిగులు ఉంటుందని అంచనా వేసినట్లు మంత్రి వివరించారు. ప్రస్తుత ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకుంటే భవిష్యత్తును అంచనా వేయడం జటిలంగా ఉందని ఆయన పేర్కొన్నారు.

ఫన్‌గామా



మనది డిజిటల్ ఇండియా..
ఇట్టే పట్టేస్తాం, కంగారు పడకు!!

కుంగుబాటు అంటువ్యాధి

- సామాజిక చైతన్యంతోనే పరిష్కారం
- టెక్నాలజీ అందుకు సహాయపడాలి
- ఐటీ కాంగ్రెస్ వేదికపై మెరిసిన దీపిక
- ముగిసిన ప్రపంచ ఐటీ కాంగ్రెస్
- తదుపరి సమావేశాలు అర్మేనియాలో నిర్వహణకు నిర్ణయం

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 21: కుంగుబాటు ప్రపంచానికి అంటువ్యాధిలా తయారైందని ప్రపంచ ఐటీ కాంగ్రెస్ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బాలీవుడ్ నటి దీపికా పదుకొనె వ్యాఖ్యానించారు. మానసిక ధృడత్వంపై పలువురు అడిగిన ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. సామాజిక చైతన్యంతోనే కుంగుబాటుకు పరిష్కారం లభిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ తాను ఒంటరిననే భావనను దరిచేయనీయకుండా చూసుకోవాలన్నారు. నిత్యం మనతో కలిసి ఉండేవారు ఏం చెబుతున్నారో, వాళ్లలో వస్తున్న మార్పులేమిటో గమనిస్తూ ఉండాలని, వారిలోని కుంగుబాటు లక్షణాలను గుర్తించి అండగా నిలవాలన్నారు. క్లిష్ట సమయాల్లో తనకు అమ్మ అండగా నిలిచారని ఈ సందర్భంగా దీపిక గుర్తుచేసుకున్నారు. ప్రపంచ ఐటి కాంగ్రెస్, నాస్కామ్ ఐఎల్ఎఫ్ -2018 సదస్సులు ఎంతో వేడుకగా బుధవారం సాయంత్రం ముగిశాయి. మూడు రోజుల పాటు జరిగిన ఐటీ కాంగ్రెస్‌లో హేమాహేమీలైన ఐటీ దిగ్గజాలు, పారిశ్రామిక వేత్తలు, నిపుణులు పాల్గొన్నారు. తొలి రోజు భారత ప్రధాని నరేంద్రమోదీ వీడియోకాన్ఫరెన్సింగ్ ద్వారా - మిగతా 6వ పేజీలో



ప్రపంచ ఐటీ కాంగ్రెస్ వేదిక నుంచి మానసిక ధృఢత్వంపై ప్రశ్నలకు సమాధానాలిస్తున్న బాలీవుడ్ నటి దీపికా పదుకొనె



ఉత్తరప్రదేశ్‌లో బుధవారం నిర్వహించిన ఇన్వెస్టర్స్ మీట్‌లో ప్రధాని మోదీకి రాష్ట్రం తరపున మెమెంటో అందచేస్తున్న సీఎం ఆదిత్యనాథ్

బుందేల్‌ఖండ్‌కు వరం

రూ.20 వేల కోట్లతో డిఫెన్స్ కారిడార్ • యూపీలో ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడి

లక్నో, ఫిబ్రవరి 21: బడ్జెట్‌లో ఉత్తరప్రదేశ్‌కు ఇచ్చిన వాగ్దానాన్ని కేంద్రం నెరవేర్చింది. యూపీలో బాగా వెనకబడిన బుందేల్‌ఖండ్ ప్రాంతంలో డిఫెన్స్ ఇండస్ట్రియల్ కారిడార్ (డీఈసీ) ఏర్పాటు చేయనున్నట్టు ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం ఇక్కడ వెల్లడించారు. రాజధాని లక్నోలో 'యూపీ ఇన్వెస్టర్స్ సమ్మిట్- 2018'ను ప్రధాని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డిఫెన్స్ కారిడార్‌కు 20 వేల కోట్ల రూపాయలు ప్రకటించారు. యోగీ ఆదిత్యనాథ్ ప్రభుత్వం రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తోందని ప్రధాని ప్రశంసించారు. 'యోగీ సారథ్యంలో నవీన ఉత్తర ప్రదేశ్ ఆవిర్భవిస్తోంది. దేశానికి యూపీనే చోదక శక్తి అవుతుంది' అని ఉద్ఘాటించారు. కేంద్ర బడ్జెట్‌లో రెండు డిఫెన్స్ కారిడార్‌లు ప్రకటించినట్టు తెలిపారు. అందులో ఒకటి బాగావెనకబడిన ప్రాంతమైన బుందేల్‌ఖండ్‌లో ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. 22వేల కోట్లతో ఏర్పాటు చేసే కారిడార్ వల్ల రెండున్నర లక్షల మందికి ఉపాధి లభిస్తుందని మోదీ పేర్కొన్నారు. బుందేల్‌ఖండ్ అభివృద్ధి చెందితే ఉత్తరప్రదేశ్ రూపురేఖలే మారిపోతాయన్నారు. ఈ డిఫెన్స్ కారిడార్‌ను ఆగ్రా, అలహాబాద్, లక్నో, కాన్పూర్, ఝాన్సీ, చిత్రకూట్ వరకూ విస్తరించనున్నట్టు ప్రధాని ప్రకటించారు. దేశంలో రెండు డిఫెన్స్ ఇండస్ట్రియల్ కారిడార్లు ఏర్పాటు చేయనున్నట్టు 2018 బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ పార్లమెంటులో తెలిపారు. ఒక కారిడార్‌ను చెన్నై- బెంగళూరు మధ్య ఏర్పాటు చేయనున్నట్టు కేంద్రం మొన్నీమధ్యే ప్రకటించిన సంగతి తెలిసింది. రెండోదాన్ని బుందేల్‌ఖండ్‌లో ఏర్పాటు చేస్తామని లక్నో వచ్చిన ప్రధాని ప్రకటించారు. చెన్నై కారిడార్ - మిగతా 6వ పేజీలో

సిబ్బందికి శుభవార్త

ప్రభుత్వోద్యోగులకు 2.09 శాతం డిఏ పెంపు

- 2017 జనవరి నుంచి వర్తింపు
- నవయుగకు రూ.1244 కోట్ల కాంక్రీట్ పనుల అప్పగింత
- ఏపీఈడీబీ, ఎస్ఐపీబీలకు స్వయం ప్రతిపత్తి
- విశాఖ, తిరుపతిలో ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్ సెంటర్లు
- రూ.4188 కోట్ల ఈఏపీలకు పాలనా ఆమోదం
- ఏసీబీలో 350 ఖాళీల భర్తీకి ఓకే
- కేబినెట్ నిర్ణయాలు వెల్లడించిన మంత్రి కాలువ

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, ఫిబ్రవరి 21: ఉగాదికి ముందే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ప్రభుత్వం తీపి కబురందించింది. 2.09 శాతంమేర డీఏను పెంచేందుకు నిర్ణయించింది. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి రూ.1244 కోట్ల రూపాయల కాంక్రీట్ పనులను నవయుగ సంస్థకు అప్పగించేందుకు నిర్ణయించింది. విశాఖ, తిరుపతిలలో ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్ సెంటర్లను ఏర్పాటు చేయనుంది. వెలగపూడి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన మంత్రిమండలి సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా తీసుకున్న నిర్ణయాలను మంత్రి కాలవ శ్రీనివాసులు మీడియాకు వివరించారు.

- 2015 వేతన సవరణ మేరకు డీఏను 22.008 నుంచి 24.104 శాతం మేరకు పెంపు.



వెలగపూడి సచివాలయంలో నిర్వహించిన కేబినెట్ సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

పెంచిన కరవుభత్యం 2017 జనవరి 1నుంచి చెల్లిస్తారు. నగదు రూపంలో మాత్రం ఈ ఏడాది ఏప్రిల్ 1న తీసుకునే మార్చి నెల జీతంతో చెల్లిస్తారు. పాత బకాయిలను ఉద్యోగుల జీపీఎఫ్ ఖాతాలో జమచేస్తారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు, సీపీఎస్ ఉద్యోగులకు మార్చి నెల నుండి పెంపు వర్తిస్తుంది. గ్రామ రెవెన్యూ సహాయకులకు ఇస్తున్న మొత్తానికి - మిగతా 6వ పేజీలో




రామేశ్వరంలో అభిమానులతో నిర్వహించిన సభలో మాట్లాడుతున్న జాతీయ నటుడు కమల్

మక్కళ్ నీది మయ్యమ్

ఎట్టకేలకు కమల్ హాసన్ కొత్త పార్టీ ప్రకటన

మదురై, ఫిబ్రవరి 21: తమిళ విలక్షణ నటుడు కమల్‌హాసన్ ఎట్టకేలకు రాజకీయ పార్టీని ప్రకటించారు. అసంఖ్యాక అభిమానుల సమక్షంలో బుధవారం ఇక్కడ కొత్త రాజకీయ పార్టీని ప్రకటించారు. 'మక్కళ్ నీదు మయ్యమ్' (ప్రజలందరికీ న్యాయం) పేరుతో కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేశారు. ఎంఎన్ఎం అంటే సెంటర్ ఫర్ పీపుల్స్ జస్టిస్ అని అర్థం. తెలుపురంగు జెండాపై ఎరుపు, నలుపు రంగులు మిళితమైన పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించారు. చేయిచేయి కలిపి ఉన్న గుర్తును జెండాపై ముద్రించారు. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ పార్టీ ఆవిర్భవ కార్యక్రమానికి హాజరయ్యారు. కొత్త రాజకీయ పార్టీని ప్రకటించిన కమల్‌హాసన్ అభిమానులను ఉద్దేశించి ప్రసంగించారు. 'నేను నాయకుణ్ని కాదు.. మీ చేతిలో ఆయుధాన్ని' అని ప్రకటించారు. తెలుపుచొక్కా, నలుపురంగు ఫ్యాంట్ ధరించిన కమల్ వేదికపై ఉల్లాసంగా కనిపించారు. తరలివచ్చిన వేలాది మంది అభిమానుల కరతాళ ధ్వనుల మధ్య కొత్త పార్టీని ప్రకటించారు. ఆయన చిత్రాల్లో పాపులర్ డైలాగులతో కూడిన బ్యానర్లు, ఫ్లెక్సీలు సభా ప్రాంగణమంతా కనిపించాయి. 'నమ్మవారెయే' - మిగతా 6వ పేజీలో



కియా కంపెనీ కోసం నిర్మించిన షెడ్డు

అనంతలో కియా

- నేడు సీఎం చంద్రబాబు భూమి పూజ
- ఉపాధిపై యువతలో చిగురిస్తున్న ఆశలు

ఆంధ్రభూమి బ్యూరో


అనంతపురం/ విజయవాడ, ఫిబ్రవరి 21: దక్షిణ కొరియాలోని సియోల్‌కు చెందిన ప్రపంచ శ్రేణి కార్ల దిగ్గజ సంస్థ కియా భారతదేశంలో తొలిసారిగా రాష్ట్రంలోని అనంతపురం జిల్లాలో ఏర్పాటు చేస్తున్న కార్ల తయారీ కేంద్రం ప్రస్థానానికి తొలి అడుగు పడుతోంది. అనంతపురం జిల్లా పెనుకొండ మండలం ఎర్రమంచి (అమ్మవారిపల్లి) గ్రామంలో 44వ జాతీయ రహదారి పక్కన నెలకొల్పుతున్న కియా కంపెనీకి సంబంధించిన పనులకు సీఎం చంద్రబాబు బుధవారం భూమిపూజ చేయనున్నారు. ఈ సందర్భంగా కియా కంపెనీ ఫ్రేమ్ ఇన్‌స్టలేషన్ పనులకు శ్రీకారం చుట్టనున్నారు. సుమారు రూ.13వేల కోట్ల వ్యయంతో 600 ఎకరాల విస్తీర్ణంలో హూండయ్ సంస్థ అనుబంధంతో ఏర్పాటు చేస్తున్న కియా కార్ల ఉత్పత్తి కేంద్రం ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 13 వేల మందికిపైగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలగనున్నాయి. 2017 జూన్‌లో కియా కంపెనీకి అవసరమైన భూమి పనులు మొదలయ్యాయి. 2019 ద్వితీయార్థంలో కార్ల ఉత్పత్తి ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆ ఏడాది సెప్టెంబర్ నాటికి తొలి కారు ఉత్పత్తి చేయడానికి - మిగతా 6వ పేజీలో

ప్యాకేజీపై యూ టర్న్?

- పునరాలోచనలో చంద్రబాబు
- మార్చి 5 వరకు ఎదురు చూపు
- నిధులివ్వకుంటే మళ్లీ హోదాకు డిమాండ్

ఆంధ్రభూమి బ్యూరో

కర్నూలు, ఫిబ్రవరి 21: రాష్ట్ర విభజన సమయంలో చట్టంలో పొందుపర్చలేకపోయినా నాటి ప్రతిపక్ష, నేటి అధికారపక్ష బీజేపీ ఒత్తిడితో నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ రాజ్యసభలో ప్రకటించినట్లుగా రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించినట్లు తెలుస్తోంది. గతంలో ప్రకటించిన విధంగా ప్యాకేజీ నిధులు, రాయితీలపై మార్చి 5న పార్లమెంటు సమావేశాలు పునఃప్రారంభం రోజున కేంద్రం నుంచి అధికారిక ప్రకటన వెలువడని పక్షంలో ప్రత్యేక హోదాకు డిమాండ్ చేయాలని పార్టీ నేతలతో పేర్కొన్నట్లు తెలుస్తోంది. స్నేహ ధర్మం పాటించి కేంద్ర ప్రభుత్వం హోదా ప్రకటనకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని అర్థం చేసుకుని ప్యాకేజీకి అంగీకరిస్తే అది కూడా ఇవ్వకపోవడం, కనీసం ప్రతి ఏటా నిధులు కేటాయించడానికి వీలుగా చట్టబద్ధత కల్పించకపోవడంపై టీడీపీ ఆగ్రహం వ్యక్తం చేస్తున్న విషయం విధితమే. బీజేపీ వ్యవహరిస్తున్న తీరుపై చంద్రబాబు నిత్యం పార్టీ సీనియర్లతో సంప్రదింపులు జరుపుతున్నారు. ఇదే సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెబుతున్న అంశాల్లో వాస్తవాలు ఏమిటో తెలుసుకోవడం కోసం జనసేన అధినేత పవన్ కల్యాణ్ త్రిసభ్య కమిటీని నియమించారు. ఈ కమిటీకి రాష్ట్ర ప్రభుత్వం తరపున నివేదికను చంద్రబాబు పంపించారు. కేంద్రం చట్టప్రకారం రాష్ట్రానికి లబ్ది చేకూర్చిందా? లేదా? అన్న అంశాలను నిగ్గుతేల్చడంతోపాటు ప్యాకేజీ అంగీకరించకుండా హోదాకే పట్టుపట్టాలని పవన్ కల్యాణ్ నిర్ణయించడంతో ప్యాకేజీకి అంగీకరించిన టీడీపీ ఏకాకిగా మారే ప్రమాదముంది. అయితే ఇప్పటికే ప్యాకేజీకి అంగీకరించి ఇపుడు మళ్లీ ప్రత్యేకహోదా అంటే రాజకీయ ఇబ్బందులు ఉంటాయన్న ఉద్దేశంతో మార్చి 5న పార్లమెంటులో కేంద్రం ప్రకటన చూశాక తుది నిర్ణయం తీసుకోవాలని చంద్రబాబు ఆలోచిస్తున్నారని పార్టీ సీనియర్లు చెబుతున్నారు.



విభజన చట్టం ఆమోదం కొరకు లోక్‌సభలో బిల్లును సులభంగా గట్టెక్కించిన కాంగ్రెస్‌కు ఆ తరువాత రాజ్యసభలో బీజేపీ మద్దతు అనివార్యమైంది. దాంతో నాడు ప్రతిపక్షపార్టీ నేత హోదాలో చంద్రబాబు బీజేపీ నేతలతో సంప్రదించి ప్రత్యేక హోదా చట్టంలో పొందుపర్చలేదని ఆ పని చేశాకే బిల్లు పెట్టాలని పట్టుపట్టి ఒప్పించారు. దాంతో మన్మోహన్‌సింగ్ రాజ్యసభలో నేరుగా బీజేపీ నేతలు వెంకయ్యనాయుడు, రాజ్‌నాథ్‌సింగ్, అరుణ్‌జైట్లీలతో సంప్రదింపులు జరిపారు. చట్టంలో చేర్చడానికి సాంకేతిక ఇబ్బందులు ఉన్నాయని ప్రధాని హోదాలో రాజ్యసభలో ప్రత్యేక హోదా ఐదు సంవత్సరాలు ఇస్తున్నట్లు ప్రకటిస్తానని వారికి చెప్పారు. అందుకు అంగీకరించిన బీజేపీ నేతలు 10 సంవత్సరాలు హోదా ప్రకటన చేయాలని సూచించారు. అయితే మన్మోహన్ రాజ్యసభలో ఐదు సంవత్సరాలు మాత్రమే హోదా ఇస్తున్నట్లు స్పష్టం చేశారు. బీజేపీ పక్ష నేత వెంకయ్యనాయుడు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో విజయం - మిగతా 6వ పేజీలో

ఏప్రిల్ నుండి 'ఆదరణ'

బీసీలకు చేయూతకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం

ఆంధ్రభూమి బ్యూరో

కాకినాడ, ఫిబ్రవరి 21: వెనుకబడిన వర్గాల సంక్షేమానికి, వారి ఆర్థిక పరిపుష్టికి గతంలో తెలుగుదేశం ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లో అమలుచేసిన ఆదరణ పథకాన్ని పునరుద్ధచడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. ఏప్రిల్ నుండి ఆదరణ పథకాన్ని బీసీలకు అమలుచేయడానికి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం అన్ని జిల్లాల అధికారులను ఆదేశించింది. ఈ మేరకు తూర్పుగోదావరి జిల్లాలో ఆదరణ పథకంపై ఇటీవల ప్రత్యేక సదస్సులు నిర్వహించారు. డివిజన్ స్థాయిలో నిర్వహించిన సదస్సుల్లో వెనుకబడిన వర్గాలకు ఆదరణ పథకం కింద ఏ విధమైన లబ్ధి చేకూర్చాలి? ప్రత్యేక ప్రాధాన్యత అంశాలు, రుణాల మంజూరు, యూనిట్ల ఏర్పాటు తదితర అంశాలపై సంబంధిత వర్గాల నుండి అభిప్రాయాలు స్వీకరించారు. ఆదరణను 2018-19 సంవత్సరం నుండి అమలుచేసి, తొలి సంవత్సరంలోనే అధిక సంఖ్యలో బీసీలకు లబ్ధి చేకూర్చేందుకు వీలుగా కార్యాచరణ ప్రణాళికలు సిద్ధంచేస్తున్నట్టు అధికారులు చెప్పారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వం ఆదరణ పథకాన్ని వెనుకబడిన వర్గాల కోసం రాష్ట్రంలో అమలుచేసింది. గీత, నేత కార్మికులు, స్వర్ణకార, వడ్రంగి, కమ్మరి, కుమ్మరి, మత్స్యకారులు, గొర్రెల కాపరులు తదితర వర్గాలకు ఆదరణ పథకాన్ని సమర్ధవంతంగా అమలుచేశారు. రాష్ట్ర విభజనానంతరం 2014లో తెలుగుదేశం తిరిగి అధికారంలోకి రావడంతో రాష్ట్రంలో ఆదరణను పునరుద్ధరించాలని వెనుకబడిన వర్గాలు కోరుతూ వచ్చాయి. చేతి వృత్తులపై ఆధారపడిన అనేక కుటుంబాలు ఆదరణ వంటి పథకాల అమలుతో తమను ఆర్థికంగా ఆదుకునే అవకాశం ఉందని ప్రభుత్వానికి విన్నవించుకున్నాయి. ప్రపంచీకరణ నేపథ్యంలో కుల వృత్తులకు ఆదరణ తగ్గి, పనుల్లేక పస్తులుంటున్న దుస్థితి నెలకొందని, ఇటువంటి పరిస్థితుల్లో కుల వృత్తులను ప్రోత్సహించాల్సి ఉందని విన్నవించుకున్నారు. వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలంటే ఆధునిక పనిముట్లు అవసరమని, గతంలో అమలుచేసిన విధంగా ఆయా కులాలకు వాహన సౌకర్యం, కుల వృత్తులకు ప్రత్యేక కిట్లు అందజేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కాగా త్వరలో అమలుచేయనున్న ఆదరణ పథకం కింద వివిధ యూనిట్లు మంజూరుచేసే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలిసింది. కుల వృత్తులకు చేయూతనిచ్చేందుకు వీలుగా ఈ యూనిట్లను ప్రోత్సహించాలని, లబ్ధిదారుల ఎంపికను పూర్తి పారదర్శకంగా నిర్వహించి, అర్హులకే ఆదరణ పథకాలు చేరే విధంగా రంగం సిద్ధం చేస్తోంది.

రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట వేయండి

• సమీక్షలో అధికారులకు సీఎస్ దినేష్‌కుమార్ ఆదేశం



అధికారులతో సమీక్షిస్తున్న సీఎస్ దినేష్‌కుమార్

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, ఫిబ్రవరి 21: రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) దినేష్‌కుమార్ ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపే వారి నుంచి భారీగా అపరాధ రుసుము వసూలు చేయాలని ఆదేశించారు. హోం, ఆర్ అండ్ బి, వైద్య, ఆరోగ్య, పంచాయతీ రాజ్ శాఖల అధికారులతో బుధవారం వెలగపూడి సచివాలయంలోని సీఎస్ కార్యాలయంలో ఉన్నతస్థాయి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో జిల్లాల వారీగా చోటు చేసుకుంటున్న రోడ్డు ప్రమాదాలపై ఆయన ఆరా తీశారు. శ్రీకాకుళం, విజయనగరం, కడప జిల్లాల్లో అధికంగా రోడ్డు ప్రమాదాలు జరిగినట్లు అధికారులు తెలిపారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ప్రజల్లో చైతన్యం కల్పించాలన్నారు.

ఎక్కువ ప్రమాదాలు వాహనాల వేగం వల్లే జరుగుతున్నాయన్నారు. ప్రమాదాలు జరిగిన ఫొటోలను అందరికీ కనిపించేలా ఏర్పాటు చేయాలన్నారు. ఫొటోల ప్రదర్శనతో రోడ్డు ప్రమాదాల వల్ల కలిగే నష్టాలపై ప్రజల్లో అవగాహన కలుగుతుందన్నారు. అదే సమయంలో హెల్మెట్లు, సీట్ బెల్టులు ధరించని వారితో పాటు మద్యం తాగి వాహనం నడిపే వారి నుంచి భారీ అపరాధ రుసుములు వసూలు చేయాలని సీఎస్ ఆదేశించారు. అతి వేగం నివారణకు స్పీడ్ గన్‌లు ఏర్పాటు చేయాలన్నారు. అంతకు ముందు రాష్ట్రంలో రోడ్డు సేఫ్టీ ఫండ్ కోసం రూ.10 కోట్లు కేటాయింపునకు సమావేశం ఆమోదం తెలిపింది.

ఆ మొత్తంలో రూ.2.11 కోట్లను కలెక్టర్ల అధ్యక్షతన ఉన్న జిల్లా స్థాయి రోడ్డు సేఫ్టీ కమిటీలకు కేటాయిస్తు నిర్ణయం తీసుకున్నారు. మరో రూ.8 కోట్లను రోడ్డు ప్రమాదాల నివారణకు అవసరమైన పరికరాల కొనుగోలుకు వినియోగించనున్నారు.



కువైట్‌లో భారత రాయబారి జీవసాగర్‌తో భేటీ అయిన మంత్రి కొల్లు రవీంద్ర

కువైట్‌లోని ఆంధ్రులందరినీ రాష్ట్రానికి తీసుకువస్తాం

● ఏపీ ఎన్ఆర్ఐ శాఖ మంత్రి కొల్లు స్పష్టీకరణ

● ఆ దేశంలో భారత రాయబారి జీవసాగర్‌తో చర్చలు

ఆంధ్రభూమి బ్యూరో

మచిలీపట్నం, ఫిబ్రవరి 21: కువైట్ దేశంలో అనధికారంగా ఉంటున్న ఆంధ్రులను త్వరలోనే స్వరాష్ట్రానికి తీసుకువస్తామని రాష్ట్ర న్యాయ, క్రీడ, యువజన, ప్రవాసాంధ్రుల సాధికారత మరియు సంబంధాల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. కువైట్‌లో ఉంటున్న తెలుగు వారిని అమ్నెస్టీ (క్షమాభిక్ష) ద్వారా రాష్ట్రానికి తీసుకువచ్చేందుకు గాను కువైట్ వెళ్లిన మంత్రి రవీంద్రకు బుధవారం అక్కడ ఘన స్వాగతం లభించింది. అక్కడి భారత ఎంబసీలో మన దేశ రాయబారి జీవసాగర్‌తో మంత్రి రవీంద్ర చర్చలు జరిపారు. తెలుగువారిని వారి వారి స్వస్థలాలకు తరలించేందుకు అవసరమైన అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి రవీంద్ర ఆంధ్రభూమి ప్రతినిధితో ఫోన్‌లో మాట్లాడుతూ కడప, చిత్తూరు, ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన సుమారు 5వేల మంది జీవనోపాధి కోసం కువైట్ వెళ్లి చిన్నపాటి ఉద్యోగాలు చేసుకుంటున్నారన్నారు. అక్కడి చట్టాలు తెలియక అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అటువంటి వారిని గుర్తించి స్వదేశానికి తీసుకువచ్చేందుకు కృషి చేస్తోందని రవీంద్ర తెలిపారు. చర్చల్లో పాల్గొన్న వారిలో మంత్రి రవీంద్రతో పాటు ఏపీ ఎన్ఆర్‌టీ అధ్యక్షుడు వేమూరి రవికుమార్, డైరెక్టర్ చప్పిడి రాజశేఖర్ ఉన్నారు.

ఏపీలో వ్యవసాయాభివృద్ధి కేంద్రం

• ఏర్పాటుకు ముందుకు వచ్చిన ఫ్లోరిడా వర్సిటీ



ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశమైన ఫ్లోరిడా యూనివర్శిటీ ప్రతినిధులు

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, ఫిబ్రవరి 21: సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత క్షేత్ర స్థాయికి తీసుకువెళ్లడం ద్వారా వ్యవసాయ, ఉద్యాన రంగాల్లో సుస్థిర వృద్ధి సాధించేందుకు ఆంధ్రప్రదేశ్‌లో ఒక కేంద్రాన్ని ప్రారంభిస్తామని అమెరికాలోని ఫ్లోరిడా విశ్వవిద్యాలయం సీనియర్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ జాక్ పేనే చెప్పారు. అమరావతి సందర్శనకు వచ్చిన డాక్టర్ జాక్ బుధవారం వెలగపూడి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసి ఈ ప్రతిపాదన చేశారు. ఫ్లోరిడా వర్సిటీలో వ్యవసాయ రంగంలో ఒక ఇంటిగ్రేటెడ్ కోర్సు నిర్వహిస్తున్నామని ఆయన చెప్పారు. ఈ కోర్సు ద్వారా అమెరికాలోని 300 పంటలను అధ్యయనం చేస్తున్నామని చెప్పారు. అమెరికాలో 140 బిలియన్ డాలర్ల విలువైన ఉద్యాన పంటల సాగు జరుగుతోందని జాక్ చెప్పారు. తీర ప్రాంత, ఆక్వా, పంట అనంతర, జన్యు సాంకేతికత వంటి అంశాలలో ఆంధ్రప్రదేశ్‌తో కలిసి పని చేయడానికి ఎంతో ఆసక్తిగా ఉన్నామని డాక్టర్ జాక్ ముఖ్యమంత్రికి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తక్కువ వర్షపాతం నమోదైనా వ్యవసాయ రంగంలో 25.6 శాతం వృద్ధి సాధించామని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా డాక్టర్ జాక్‌కు వివరించారు. అయోవా యూనివర్శిటీ, బిల్ అండ్ మెలిండా గేట్స్ ఫౌండేషన్‌ల సహకారంతో వ్యవసాయాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను ముఖ్యమంత్రి వివరించారు. రాష్ట్రంలో నాలెడ్జ్, ఐఓటి అనుసంధానం పెద్ద ఎత్తున జరుగుతోందని అన్నారు. సాంకేతికతను క్షేత్ర స్థాయికి తీసుకువెళ్లి మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని ప్రయత్నిస్తున్నామని ముఖ్యమంత్రి చెప్పారు. ఫ్లోరిడా విశ్వవిద్యాలయం ప్రతిపాదనకు అనుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి ఒక ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసి ఒప్పందం చేసుకుందామని చెప్పారు. ఏఏ అంశాల్లో కలిసి పని చేయాలనే అంశంపై చర్చించేందుకు రాష్ట్ర ప్రభుత్వం, ఫ్లోరిడా విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులతో ఉన్నత స్థాయి బృందాన్ని ఏర్పాటు చేద్దామని ప్రతిపాదించారు.

బాలుడి చికిత్స కోసం బాబు రూ.15 లక్షల సాయం

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, ఫిబ్రవరి 21: ఒక బాలుడికి కాలేయ మార్పిడి చికిత్స కోసం 15 లక్షల రూపాయల మేర ఆర్థిక సాయం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించి తన పెద్ద మనసును చాటుకున్నారు. వెలగపూడి సచివాలయంలో తూర్పు గోదావరి జిల్లా సీతానగరం మండలం రఘుదేవపురానికి చెందిన సత్యనారాయణ తన ఐదేళ్ల కుమారుడి కాలేయ మార్పిడి చికిత్సకు సాయం చేయాలని సీఎంను కలిసి బుధవారం కోరారు. బాలుడి పరిస్థితి చూసి చలించిన చంద్రబాబు ఈ సాయం ప్రకటించారు.

అంతిమ పోరాటానికి కలిసి రండి

• టీడీపీ, బీజేపీ, వైకాపా సహా పలు పార్టీల నేతలకు రఘువీరారెడ్డి లేఖ

విజయవాడ (కార్పొరేషన్), ఫిబ్రవరి 21: విభజన చట్టం అమలు, ప్రత్యేక హోదా, రాష్ట్ర ప్రయోజనాల సాధన సమష్టి ఉద్యమాలతోనే సాధ్యమని, అంతిమ పోరాటంగా చేపడుతున్న పోరాటానికి రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీల నేతలు కలిసి రావాలని పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా బీజేపీ అధ్యక్షుడు కే హరిబాబు, వైకాపా అధ్యక్షుడు వైఎస్ జగన్మోహనరెడ్డి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి మధు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్, తెలుగుదేశంపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కె కళావెంకట్రావుకు లేఖలు రాసి ఉద్యమ కార్యాచరణలో పాల్గొనాలని ఆహ్వానిస్తున్నట్టు బుధవారం ఒక ప్రకటనలో రఘువీరా తెలిపారు. నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ రాజ్యసభలో ప్రకటించిన హామీలు, ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం 2014లోని అంశాలన్నీ రాజీ లేకుండా అమలు కావాల్సిందేనని పేర్కొన్నారు. ఇటీవల కేంద్రం ప్రకటించిన చివరి బడ్జెట్‌లో కూడా రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిన నేపథ్యంలో రాష్ట్ర ప్రజలు తీవ్ర ఆవేదన చెందుతున్నారని తెలిపారు. 5కోట్ల ఆంధ్రులకు జరిగిన అన్యాయంపై రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు ఐక్యంగా పోరాడాల్సిన చారిత్రక సందర్భం వచ్చిందన్నారు. మార్చి నెలలో జరిగే పార్లమెంటు సమావేశాల్లోనే అంతిమ పోరాటం చేసి మన హక్కులు సాధించుకుందామని, రాజకీయ పక్షాలు, ప్రజా పక్షాలు పార్లమెంటు లోపల బయట సంఘటితంగా ఉద్యమించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. మార్చి5వ తేదీ నుంచి ప్రారంభమైయ్యే తదుపరి పార్లమెంటు సమావేశాల సందర్భంగా కేంద్రంపైన వత్తిడి పెంచేందుకు ఛలో పార్లమెంటు పేరిట ఏపీ కాంగ్రెస్ కమిటీ మార్చి 6,7,8వ తేదీలలో దేశ రాజధాని ఢిల్లీలో ఉద్యమ కార్యాచరణ చేపడుతుందన్నారు. ఛలో పార్లమెంటు ఉద్యమంలో పాల్గొనాలని ఆహ్వానిస్తున్నట్టు ఆయా పార్టీల అధ్యక్షులకు లేఖలు రాసినట్టు తెలిపారు.

నేడు చిత్తూరులో ఆంధ్రుల ఆత్మగౌరవ దీక్ష

రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధనలో భాగంగా జరుగుతున్న ఉద్యమ, ఆందోళనలో భాగంగా గురువారం చిత్తూరులో ఆంధ్రుల ఆత్మగౌరవ దీక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు రఘువీరారెడ్డి పేర్కొన్నారు. చిత్తూరు ఆర్‌డీవో కార్యాలయం వద్ద మధ్యాహ్నం 3 గంటలకు జరిగే ఈదీక్షలో పార్టీ సీనియర్ నేతలు పాల్గొంటారన్నారు.

విజయసాయిరెడ్డిపై ఐఏఎస్‌ల సంఘం ఆగ్రహం

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, ఫిబ్రవరి 21: సీఎం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సతీష్ చంద్రపై ఎంపీ విజయసాయి రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడంపై ఐఏఎస్ అధికారుల సంఘం ఆగ్రహం వ్యక్తం చేసింది. అధికారులపై రాజకీయ పార్టీలు అసత్య ఆరోపణలు చేయడం, రాజకీయాలు అంటగట్టడం తగదని హితవుపలికింది. పరిపాలన సజావుగా సాగేందుకు అధికారులు కృషి చేస్తున్నారని, వారికి రాజకీయాలు ఆపాదించడం సరికాదని బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది.

కాపు కార్పొరేషన్ ద్వారా ఉపాధి శిక్షణ

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, ఫిబ్రవరి 21: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాలకు చెందిన నిరుద్యోగ యువతకు కాపు కార్పొరేషన్ ద్వారా నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు జరిగాయని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కోట్ల శివశంకరరావు తెలిపారు. అభ్యర్థులు కచ్చితంగా కాపు, తెలగ, బలిజ, ఒంటరి సామాజిక వర్గానికి చెందిన వారై ఉండాలని బుధవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు, వారి తల్లిదండ్రులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నివాసితులై ఉండాలన్నారు. వార్షిక కుటుంబ ఆదాయం రూ. 6 లక్షల మించరాదన్నారు. తెల్లరేషన్ కార్డు కలిగి ఉన్న వారు కూడా అర్హులన్నారన్నారు. ఈ ప్లేస్‌మెంట్ హామీ శిక్షణ కార్యక్రమానికి దరఖాస్తు చేసుకునేటప్పటికీ ఎలాంటి ఉద్యోగ అవకాశాలు లేని వారు అర్హులన్నారు. అభ్యర్థులు ఇదే ప్రయోజనం కోసం గతంలో ఏదైనా ప్రభుత్వ పథకంలో లబ్ధి పొంది ఉండకూడదన్నారు. ఇతర వివరాల కోసం వాట్సాప్ నెంబర్ 7331174453ల ద్వారా, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బీసీ కార్పొరేషన్‌ల ద్వారా వివరాలను తెలుసుకోవచ్చని అన్నారు.

సీఎంను కలిసిన సంగీత దర్శకుడు కోటి

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, ఫిబ్రవరి 21: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ప్రముఖ సినీ సంగీత దర్శకుడు కోటి బుధవారం కలిశారు. వెలగపూడి సచివాలయంలో సీఎంను కలిసి తన కుమారుడి వివాహానికి రావాలని ఆహ్వానించారు. ఈ మేరకు పెండ్లి శుభలేఖ అందచేశారు.

రెండో రోజుకు చేరిన విద్యుత్ కార్మికుల సమ్మె

- ప్రత్యామ్నాయ చర్యలపై అధికార యంత్రాంగం అప్రమత్తం
- విద్యుత్ శాఖలో సిబ్బందికి సెలవులు రద్దు
- పోలీస్ సహకారం తీసుకోవాలని ఆదేశాలు
- సమ్మెలు నిషేధం అన్న విషయం గుర్తించాలి
- టెలీ కాన్ఫరెన్స్‌లో ట్రాన్స్‌కో జేఎండీలు దినేష్, ఉమాపతి

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, ఫిబ్రవరి 21: సమాన పనికి సమాన వేతనం, రెగ్యులరైజేషన్ వంటి డిమాండ్లపై విద్యుత్ శాఖ జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కంలలో రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న 24 వేల మంది కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం రెండో రోజుకు చేరింది. దాంతో విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం లేకుండా చూసేందుకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారు. విద్యుత్ వ్యవస్థలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ సిబ్బంది సమ్మె నేపథ్యంలో ఏపీ ట్రాన్స్‌కో సీఎండీ కే.విజయానంద్ ఆధ్వర్యంలో బుధవారం విద్యుత్ సౌధ నుండి రాష్ట్రంలోని అందరు సీఈలు, ఎస్ఈలతో ట్రాన్స్‌కో జేఎండీలు దినేష్ పరుచూరి, పి.ఉమాపతి విద్యుత్ సరఫరాకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. సమ్మె కారణంగా అవుట్ సోర్సింగ్ సిబ్బంది విధులకు గైర్హాజరైన చోట్ల అవసరమైన సిబ్బందిని ఏజెన్సీల ద్వారా తక్షణం నియమించుకోవాలని, సమ్మె కారణంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూడాలన్నారు. అవుట్ సోర్సింగ్ సిబ్బంది సమ్మెకు పిలుపు ఇచ్చిన నేపథ్యంలో పవర్ జాయింట్ యాక్షన్ కమిటీ గుర్తింపు పొందిన యూనియన్ల ప్రతినిధులు, అవుట్ సోర్సింగ్ ప్రతినిధులతో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి కిమిడి కళా వెంకట్రావ్ చర్చలు జరిపి, సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుటామని హామీ ఇచ్చారన్నారు. రాబోయే నూతన ఆర్థిక సంవత్సరంలో అవుట్ సోర్సింగ్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి సానుకూల చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం చెప్పినప్పటికీ, సిబ్బంది సమ్మెకు దిగడం పట్ల బాధ కలిగిందని పేర్కొన్నారు. సమ్మె నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు వేసుకోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రిటైర్డు ఇంజనీర్లు, రిటైర్డు సిబ్బంది సేవలను వినియోగించుకోవాలని, అత్యవసర పరిస్థితి ఎదురైతే తగు చర్యలు తీసుకునే విధంగా బృందాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. విద్యుత్ శాఖలో సమ్మెలు నిషేధం అనే విషయం అవుట్ సోర్సింగ్ సిబ్బందికి, అవుట్ సోర్సింగ్ సిబ్బందిని సరఫరా చేసే ఏజెన్సీలకు కూడా తెలుసని, అవసరమైన చోట ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సీఈలు, ఎస్ఈలకు జేఎండీ సూచించారు. అవుట్ సోర్సింగ్ సిబ్బందిని అందించే కాంట్రాక్టర్ అత్యవసర పరిస్థితుల్లో ప్రత్యామ్నాయంగా సిబ్బందిని ఏర్పాటు చేయకపోతే ఆ కాంట్రాక్టర్‌ను కూడా తొలగించాలన్నారు.

టెట్ తొలిరోజు పరీక్షకు 92.56 శాతం హాజరు

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, ఫిబ్రవరి 21: నిరుద్యోగ అభ్యర్థులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న టెట్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఉదయం, మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 48,937 మంది హాజరుకావాల్సి ఉండగా 45,298 మంది (92.56 శాతం) హాజరయ్యారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు ఎప్పటికప్పుడు పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు.

జటాయువుకు రామయ్య సేవలు

భద్రాచలం టౌన్, ఫిబ్రవరి 21: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం తరుపున జటాయువుకు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విలీనమైన యటపాక గ్రామంలో ఉన్న జటాయువుకు ఫాల్గుణ శుద్ధ షష్టిని పురస్కరించుకొని ఈ సేవను నిర్వహించారు. వనవాస కాలంలో సీతమ్మను అపహరించుకుపోతున్న రావణాసురుడితో పోరాడిన ఘట్టంలో జటాయువుకు రామయ్య ఈ ప్రాంతంలోనే మోక్షం కలిగించాడని ప్రతీతి. ఇక్కడ ప్రతి ఏటా భద్రాచలం దేవస్థానం తరుపున విశిష్ట సేవ నిర్వహిస్తూ వస్తున్నారు. ఇందులో భాగంగా భద్రాచలం దేవస్థానం అర్చకులు, పరిపాలన సిబ్బంధి శోభాయాత్రగా యటపాక గ్రామానికి తరలివెళ్లారు. ముందుగా భద్రాచలం దేవస్థానంలోని అంతరాలయంలో స్వామి వారి అనుజ్ఞ తీసుకొని జటాయువుకు పంచామృతాలతో అభిషేకం గావించారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం చేసి అభిషేకాన్ని కనుల పండువగా జరిపారు. అనంతరం సీతారాముల కల్యాణాన్ని ఘనంగా జరిపించారు. భద్రాచలం దేవస్థానం తరుపున ఈఓ ప్రభాకర శ్రీనివాస్ జటాయువుకు పట్టువస్త్రాలు సమర్పించారు.

ప్రధాని ప్రకటన కవ్వింపు చర్యలా ఉంది

● బుందేల్‌ఖండ్‌కు ప్యాకేజీపై మంత్రి అచ్చెన్న



ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, ఫిబ్రవరి 21: బుందేల్‌ఖండ్‌కు ప్రధాని ప్యాకేజీ ప్రకటించడం కేంద్ర ప్రభుత్వ కవ్వింపు చర్యలా ఉందన్న అభిప్రాయం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి అచ్చెన్నాయుడు వ్యక్తం చేశారు. విజయవాడలో ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ ఏపీ ప్రజలు వీధుల్లోకి వచ్చి పోరాడుతున్నా కేంద్రంలో చలనం లేకపోగా, మరింత రెచ్చగొట్టే తీరులో బుందేల్‌ఖండ్‌కు ప్రధాని 20 వేల కోట్ల రూపాయల ప్యాకేజీ ప్రకటించారని, దీనిని చూస్తుంటే, దేశంలో ఏపీ భాగం కాదా అన్న అనుమానం కలుగుతోందని వ్యాఖ్యానించారు. ఏపీ ప్యాకేజీ ఊసెత్తని సమయంలో బుందేల్‌ఖండ్ ఆ ప్యాకేజీ ప్రకటించడం పుండు మీద కారం జల్లినట్లు ఉందని ఆరోపించారు. హోదా లేదంటూనే ఇతర రాష్ట్రాలకు ఇస్తున్నారని, ప్యాకేజీలను ఇతర రాష్ట్రాలకు ఇస్తున్నారన్నారు. ఏపీ కూడా దేశంలో భాగమేనని గుర్తించాలని హితవు పలికారు. ప్రధాని ప్రకటనతో ప్రజలు ఆగ్రహంగా ఉన్నారని, అన్ని సమస్యలను రాజకీయ కోణంలోనే చూస్తున్నారన్నారు. ఏపీ సమస్యలపై జాతీయ పార్టీలన్నీ సానుకూలంగా ఉన్నాయని, హోదాకు సమానమైన ప్యాకేజీ ఇస్తామంటేనే గతంలో అంగీకరించామని గుర్తు చేశారు. ప్రత్యేక హోదా ఇతర రాష్ట్రాలకు ఇస్తే, ఏపీకీ ఇవ్వాల్సిందేనని, రాష్ట్రంలోని బీజేపీ నేతలు ఇకనైనా మేల్కొనాలని పిలుపునిచ్చారు.

సింగరేణిలో 'ప్రైవేటీకరణ' భయం!

కార్మిక సంఘాల్లో ఆందోళన

కొత్తగూడెం, ఫిబ్రవరి 21: బొగ్గు గనులను ప్రైవేటీకరించేందుకు కేంద్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకోవటంతో సింగరేణి సంస్థలో ఆందోళన ప్రారంభమయింది. బొగ్గు గనులను ప్రైవేటు సంస్థలకు కేటాయించేలా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం తాలూకసెగలు సింగరేణిలో వేడి పుట్టిస్తున్నాయి. ఇప్పటికే సింగరేణి సంస్థలో కీలకమైన సెక్యూరిటీ, రవాణా, శానిటేషన్, ఫారెస్టలతోపాటు పలు విభాగాల్లో కాంట్రాక్టు పద్ధతిలో పరిపాలన సాగుతోంది. బొగ్గు ఉత్పత్తిలో కీలకపాత్ర పోషించే ఓపెన్‌కాస్టలలో ఓవర్‌బర్డన్ (ఓబి) పనులను ప్రైవేటీకరించిన సింగరేణి యాజమాన్యం ప్రైవేటు సంస్థలచే పనులు చేయిస్తోంది. భవిష్యత్‌లో బొగ్గుకు వస్తున్న డిమాండ్‌కు అనుగుణంగా సింగరేణి సంస్థ రానున్న పదేళ్లలో 25 భూగర్భభావులు, 11 ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టును ప్రారంభించే దిశగా పయనిస్తున్న తరుణంలో కేంద్రం నిర్ణయం తీవ్ర ప్రభావాన్ని చూపుతూ సంస్థ భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతుందని కార్మిక సంఘాలు ఆందోళన చెందుతున్నాయి. కేంద్రం నిర్ణయాన్ని సింగరేణి జాతీయ కార్మిక సంఘాలతోపాటు విప్లవ కార్మిక సంఘాలు వ్యతిరేకిస్తూ భవిష్యత్ పోరాటాలకు సిద్ధం అవుతున్నట్లు ప్రచారం సాగుతోంది. 2000లోనే సింగరేణిలో ప్రైవేటీకరణకు ఆనాటి తెలుగుదేశం పార్టీ ప్రయత్నించింది. ఇల్లందు ఏరియాలోని కోయగూడెం ఓపెన్‌కాస్ట్‌లో సర్ఫేస్ మైనర్ ద్వారా బొగ్గును వెలికి తీసేందుకు ప్రయత్నించటంతో కార్మిక సంఘాలు ప్రతిఘటించి సుమారు 40రోజులు ఆందోళన చేయటంతో యాజమాన్యం నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. ఇటీవల సింగరేణి సంస్థలో ప్రైవేటు జోక్యం పెరిగిపోయింది. కీలక విభాగాల్లో కాంట్రాక్టు కార్మికులతో పనులు చేయిస్తున్నారు. ఇప్పుడు బొగ్గు బ్లాకుల ప్రైవేటీకరణ వలన సింగరేణి ప్రాధాన్యత తగ్గిపోయి కార్మికుల ఉద్యోగ భద్రత ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందని కార్మిక సంఘాలు ఆందోళన చెందుతున్నాయి.

'వడగాలులపై మరింత అధ్యయనం అవసరం'

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, ఫిబ్రవరి 21: ప్రపంచ వ్యాప్తంగా సంభవించే వడగాలులు, ముందస్తు ఉపశమన చర్యలపై తీసుకోవాల్సిన చర్యలపై మరింత అధ్యయనం అవసరమని జాతీయ విపత్తుల నివారణ సంస్థ సభ్యుడు ఆర్‌కె జైన్ తెలిపారు. స్థానిక బందరు రోడ్డులోని ప్రైవేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన రెండు రోజుల వర్క్‌షాపులో తొలిరోజు బుధవారం ముఖ్య అతిథిగా పాల్గొని సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడగాలులపై తొలిసారి 2015లో జపాన్‌లోని పెండాయ్‌లో నిర్వహించిన సదస్సుకు 175 దేశాల సభ్యులు హాజరై చర్చించారన్నారు. ఈ సదస్సులో భారతదేశ ప్రతినిధులు కూడా పాల్గొని జాతీయ ప్రణాళికను ఇందులో ప్రవేశపెట్టారన్నారు. అందులో భాగంగా ప్రపంచ దేశాలలో వడగాలులపై అవలంబిస్తున్న విధానాలను పరిశీలించి మన దేశంలో అమలుచేసేందుకు కార్యాచరణ రూపొందించాలన్న ఉద్దేశ్యంతో ఈ రెండు రోజుల సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా దేశంలో వడగాలుల తీవ్రత ఏ విధంగా ఉంది. దానికి ముందస్తుగా అవలంబించాల్సిన విధానాలు, సాంకేతిక అంశాలు, తీసుకోవలసిన చర్యలపై దృష్టి పెడుతున్నట్లు చెప్పారు. జాతీయ విపత్తుల నిర్వహణ శాఖ సంయుక్త కార్యదర్శి డా.వి.తిరుప్పగ మాట్లాడుతూ వాతావరణంలో వచ్చే మార్పులపై వడగాలుల తీవ్రత ఆధారపడి ఉంటుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ మేనేజింగ్ డైరెక్టర్ ఎంవి శేషగిరిబాబు మాట్లాడుతూ వాతావరణంలో చోటు చేసుకునే మార్పుల వల్ల ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయన్నారు. ఉష్ణోగ్రతల్లో మార్పులు, వడగాలులపై సంసిద్ధత, ఉపశమన చర్యలపై రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ హీట్ వేవ్ యాక్షన్ ప్లాన్‌ను రూపొందించిందన్నారు. శాఖల వారీగా అమలు చేయాల్సిన ప్రణాళికలు ఈ ప్లాన్‌లో ఉన్నట్లు తెలిపారు.

సాయం చేసేదాకా పోరాటమే

నాకు పెద్ద సైన్యం సాధికార మిత్రలే ■ ముఖాముఖిలో చంద్రబాబు

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, ఫిబ్రవరి 21: కేంద్రం సహాయం చేసేదాకా వదిలిపెట్టం అని, పోరాడతానని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరోసారి స్పష్టం చేశారు. తనకు ఇప్పుడు పెద్ద సైన్యంగా సాధికార మిత్రలు మారారని, అదొక సంఘటిత శక్తిగా అభివర్ణించారు. ఉండవల్లిలోని గ్రీవెన్స్ హాలులో సాధికార మిత్రలతో బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిధుల కోసం కేంద్రం మీద పోరాడతానని స్పష్టం చేశారు. విభజన చట్టంలో ఉన్నది అమలు చేయాలని, ఐదు కోట్ల ఆంధ్రులది ఒకే మాట అని తెలిపారు. కేంద్రం న్యాయం చేయాలని, విభజన చట్టంలోని అంశాలను అమలు చేయాలన్నారు. చారిత్రక తప్పిదాలు చేసిన కాంగ్రెస్‌ను చిత్తుచిత్తుగా ఓడించిన చరిత్ర రాష్ట్ర ప్రజలకు ఉందన్నారు. జపాన్‌లో నిరసనను ఎక్కువ పనిచేసి తెలియజేస్తారని, ఆంధ్రుల కసి తనకు తెలుసునని వ్యాఖ్యానించారు. కేంద్రం సహకరించకున్నా అభివృద్ధి చేశానంటే అందుకు ప్రజల సహకారమే కారణమన్నారు. విభజన చట్టంలో ఎన్నో చేస్తామన్నారని, ప్రభుత్వం మారినా మూడున్నర ఏళ్లుగా వారు కూడా సహకరించలేదని విమర్శించారు. విభజన తర్వాత అధికారంలోకి వచ్చి గత ప్రభుత్వ దుష్పరిపాలన వాస్తవిక స్థితిపై శ్వేతపత్రాన్ని విడుదల చేశామని గుర్తు చేశారు. పాలకుల తప్పులకు ప్రజలను దయచేసి బలిచేయవద్దని హితవు పలికారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాల్సిన అవసరం ఉందని, హోదా గురించి మాట్లాడుతూ ఇతర అనేక విషయాలను మరుగుపరుస్తున్నారన్నారు. సాధికార మిత్రలు గ్రామాలలో ఉండి ఒక్కొక్కరు 35 కుటుంబాల పరిస్థితిని పర్యవేక్షించాలని పిలుపునిచ్చారు. వారి సమస్యలను పరిష్కరించడంలో సహకరించాలని కోరారు. సేవాభావంతో సహకారం అందించాలని, ఒక్క పైసా అవినీతి కూడా జరగకుండా పేద వారికి అండగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. నీటి భద్రత కల్పిస్తున్నామని, పట్టిసీమతో చరిత్ర సృష్టించామని తెలిపారు. రాయలసీమలో కోస్తా ఆంధ్ర కంటే భూగర్భ జలాలు పెరిగాయని, కరవు లేని రాయలసీమను తీర్చిదిద్దుతామన్నారు. భవిష్యత్తులో రాయలసీమను రతనాల సీమగా మారుస్తామన్నారు. ఇళ్లు లేని వారికి ఇళ్లు నిర్మించే బాధ్యతను తాను తీసుకుంటున్నానని, మరుగుదొడ్ల నిర్మాణంలో డ్వాక్రా మహిళలు, సర్పంచ్‌లు బాధ్యత తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీల ద్వారా పేదలకు పౌష్టికాహారం అందజేస్తున్నామని, కొంత భూమిని తీసుకుని కాయగూరలు పండించి గర్భిణులకు ఇద్దామన్నారు. పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు పిల్లలకు పెట్టగలిగితే వారు ఆరోగ్యంగా ఉంటారన్నారు. మీ గ్రామాలలో పౌష్టికాహార లోపాలను అరికట్టాలని, మూఢ నమ్మకాలతో వెళ్లవద్దని హితవు పలికారు. శారీరక కష్టం అవసరమే కాని, ఆలోచన కూడా అవసరమన్నారు. పొలం దగ్గరకు వెళ్లి పంటను చూసుకుంటే ఆరోగ్యం కూడా ఉంటుందన్నారు. రాబోయే రోజుల్లో శారీరక కష్టం కోసం వ్యాయామం చేయాలన్నారు. తప్పుడు ఆలోచనలు చేస్తే సమస్యలు వస్తాయని, వ్యసనాలకు అలవాటు పడతారని హెచ్చరించారు. నిరంతరం కొత్త విషయాలను నేర్చుకోవాలని డ్వాక్రా సంఘాలకు సూచించారు. కుటుంబాన్ని ఏ విధంగా నడపాలి అనే విషయంపై ఆలోచించాలన్నారు. తాను లేచింది మొదలు నిద్రపోయేంతవరకు కొత్త విషయాలు నేర్చుకుని ప్రజలకోసం ఉపయోగిస్తానన్నారు. భూకబ్జాలు, సైబర్ నేరాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆడపిల్లలు ధైర్యంగా తిరగాలని, రౌడీషీటర్ల ఫొటోలన్నీ ఆన్‌లైన్‌లో పెట్టే వ్యవస్థకు శ్రీకారం చుడుతున్నామన్నారు. తమ సమయాన్ని సద్వినియోగం చేసుకుని గ్రామాలలో ఉన్న వనరులతో వస్తువులు తయారు చేయాలన్నారు. వీటి మార్కెటింగ్‌కు, బ్రాండింగ్‌కు సహకరిస్తామని, ప్రతి స్వయం సహాయక మహిళ ఎంటర్‌ప్రెన్యూర్ కావాలన్నారు. నెల రోజుల తర్వాత మరోసారి సమావేశమై సాధికార మిత్రలపై సమీక్షిస్తామన్నారు. కొంతమంది తనకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారని అన్నారు.



సాధికార మిత్రల సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

ఓటుకు నోటు కేసులో చంద్రబాబు తప్పు లేదు

- మంత్రి సోమిరెడ్డి వ్యాఖ్య -

ఆంధ్రభూమి బ్యూరో



విజయవాడ, ఫిబ్రవరి 21: ఓటుకు నోటు కేసులో సీఎం చంద్రబాబు తప్పేమీ లేదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రతిపక్ష నేత జగన్ కారణంగా ఐఏఎస్‌లు ఇబ్బందుల పాలైయ్యారని ధ్వజమెత్తారు. వెలగపూడి సచివాలయంలో ఆయన మీడియాతో బుధవారం మాట్లాడుతూ ఆడియో టేపుల్లోనిది సీఎం వాయిస్ అయినప్పటికీ, నిస్సాక్షికంగా ఓటు వేయమని మాత్రమే చెప్పారని హైకోర్టు జడ్జి వ్యాఖ్యానించడాన్ని మంత్రి గుర్తు చేశారు. దేశ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా 8 సంవత్సరాల్లో ప్రతిపక్ష నేత జగన్ 12 చార్జిషీటులు ఎదుర్కొంటుండగా, మరో రెండు కేసులు ఈడీ దాఖలు చేసిందని విమర్శించారు. అటువంటి వ్యక్తికి తమ నేత గురించి మాట్లాడే నైతిక అర్హత లేదని స్పష్టం చేశారు. వైకాపా ఎంపీ విజయసాయి రెడ్డి రెచ్చిపోయి మాట్లాడుతున్నారన్నారు. ఐఏఎస్, ఐపీఎస్‌ల గురించి దారుణంగా మాట్లాడటం సరికాదన్నారు. జగన్ కారణంగా ఒక మహిళా ఐఏఎస్ అధికారి జైలు పాలైందని గుర్తు చేశారు. ఇప్పటి వరకూ 12 మంది ఐఏఎస్ అధికారులు జగన్ దురాశ వల్ల నష్టపోయారన్నారు. గతంలో నీతి ఆయోగ్ చెప్పిందనే సాకుతో రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వడం కుదరదని కేంద్రం చెప్పడంతో ప్యాకేజీకి అంగీకరించామన్నారు. అయితే 11 రాష్ట్రాలకు ప్రత్యేక హోదా పొడిగించినప్పుడు, ఏపీకి మాత్రం ప్రత్యేక హోదా ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. హోదా ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. కేంద్ర బడ్జెట్‌ను భగవద్గీతతో పోల్చిన వ్యక్తి ఇప్పుడు తాము తప్పు చేశామని విమర్శిస్తున్నారన్నారు. నిధులు రాకపోతే నిలదీయాల్సింది కేంద్రాన్నా? లేక టీడీపీనా? అని ప్రశ్నించారు. ప్యాకేజీపై స్పష్టత వచ్చే వరకూ పోరాడుతామని, హోదా ఇస్తే సంతోషిస్తామన్నారు.

మట్టిలో మాణిక్యం ఆకుల

- గ్రూప్-1లో రాష్ట్రంలోనే ప్రథమ ర్యాంకు -



మార్కాపురం, ఫిబ్రవరి 21: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసించి ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన ఎపిపిఎస్‌సి గ్రూప్-1లో రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానం పొందిన ఆకుల వెంకటరమణ మట్టిలో మాణిక్యంలా అందరి మన్ననలు పొందుతున్నాడు. ప్రభుత్వం విడుదల చేసిన ఎపిపిఎస్‌సి గ్రూప్-1 పరీక్షల్లో మార్కాపురం పట్టణానికి చెందిన ఆకుల వెంకటరమణ రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానం సంపాదించారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన ఆకుల శ్రీరాములు, లక్ష్మీనరసమ్మల కుమారుడు వెంకటరమణ 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు స్థానిక మున్సిపల్ పాఠశాలలో, 6 నుంచి 10వ తరగతి వరకు బాలుర ఉన్నత పాఠశాలలో, ఇంటర్మీడియట్ స్థానిక జార్జి జూనియర్ కళాశాలలో విద్యను అభ్యసించారు. అనంతరం విజయవాడలోని కెఎల్ ఇంజనీరింగ్ కళాశాలలో బిటెక్ పూర్తిచేశారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని క్వాల్‌కోర్ లాజిగ్ కంపెనీలో ఎలక్ట్రానిక్ ఇంజనీర్‌గా పని చేస్తున్నారు. పోటీ పరీక్షలపై దృష్టి సారించి ప్రభుత్వం నిర్వహించిన ఎపిపిఎస్‌సి గ్రూపు-1లో రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానం సంపాదించారు.

గ్రూప్-1 ఫలితాల్లో హేమలతకు రెండో ర్యాంక్

- భవానీ శంకర్‌కు మూడో ర్యాంక్ -



హేమలత

పార్వతీపురం, ఫిబ్రవరి 21: విజయనగరం జిల్లా పార్వతీపురం డివిజన్‌కు చెందిన ఇద్దరు ఇటీవల ప్రకటించిన గ్రూప్-1 ఫలితాల్లో రెండు, మూడు ర్యాంకులు సాధించారు. పార్వతీపురంలోని పంచాయతీరాజ్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయంలో డివిజనల్ అకౌంట్స్ అధికారిగా పనిచేస్తున్న కనుగుల హేమలత మంగళవారం విడుదలైన గ్రూప్-1 ఫలితాల్లో రాష్ట్రసాయిలో రెండవ ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా బుధవారం తనను కలిసిన విలేఖరులతో హేమలత మాట్లాడుతూ ప్రస్తుతం చేస్తున్న ఉద్యోగాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తూనే గ్రూప్స్‌కు సిద్ధమయ్యానని, శ్రమకు తగ్గ ఫలితం దక్కిందన్నారు.హేమలత భర్త కాళ్ల తవిటినాయుడు విశాఖ జిల్లా నర్సీపట్నం డివిజనల్ ఫారెస్ట్ అధికారి కార్యాలయం పరిధిలోని ఆర్వీనగర్‌లో ఫారెస్ట్ రేంజి అధికారిగా పనిచేస్తున్నారు. అదేవిధంగా పార్వతీపురంలోని వివేక్ కాలనీకి చెందిన బవురిపూడి భవానీ శంకర్ రాష్ట్రస్థాయిలో మూడోర్యాంకు సాధించాడు. బుధవారం తనను కలిసిన విలేఖరులతో అతను మాట్లాడుతూ తన తండ్రి అప్పలనాయుడు తోటపల్లి బ్యారేజి ప్రాజెక్టు యూనిట్ 1, ఎస్‌డిసి కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దారుగా పనిచేస్తున్నారన్నారు. గ్రూప్-1పై ఆసక్తితో ఇంటివద్దే రోజుకు 13 గంటల పాటు కష్టపడి చదివి రాసి రాష్ట్రస్థాయి మూడోర్యాంకు సాధించానన్నారు.



భవానీ శంకర్

కౌంట్ డౌన్ మొదలైంది

- టీడీపీ, బీజేపీ ప్రభుత్వాలపై సీపీఐ నారాయణ -

ఆంధ్రభూమి బ్యూరో



చిత్తూరు, ఫిబ్రవరి 21: ప్రజా సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా వైఫల్యం చెందాయని సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ దుయ్యబట్టారు. బుధవారం చిత్తూరు నగరంలో 22వ సిపిఐ జిల్లా మహాసభలు ఘనంగా ప్రారంభమైయ్యాయి. ఈకార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ అన్ని విధాలుగా నష్టపోయిందన్నారు. రాష్ట్ర విభజన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వమే రాష్ట్ర రాజధాని నిర్మాణంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రం నుంచి నిధులు తెప్పించుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం చెందిందన్నారు. గతంలో ప్రత్యేక ప్యాకేజీ పట్ల మక్కువ చూపిన టిడిపి ప్రభుత్వం నేడు కేంద్ర ప్రభుత్వం తీరు పట్ల విసిగిపోయి ప్రత్యేక హోదా కావాలని పాకులాడడం విడ్డూరంగా ఉందన్నారు. అధికారంలోకి వచ్చిన టిడిపి, బిజెపి ప్రభుత్వాలు ఈ నాలుగు సంవత్సరాల్లో ప్రజలకు చేసిందేమి లేదని దుయ్యబట్టారు. ఈ ప్రజావ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్న ఈ పార్టీలకు కౌంట్ డౌన్ ప్రారంభమైందన్నారు. ప్రత్యేక హోదాను ప్రతిపాదిస్తే సిపి ఐ కూడా కలసి వస్తుందన్నారు.

అధిష్ఠానం ఆదేశిస్తే ఏ క్షణాన్నైనా రాజీనామా



మంత్రి కామినేని

మంగళగిరి, ఫిబ్రవరి 21: బీజేపీ అధిష్ఠానం ఆదేశిస్తే మంత్రి పదవికి ఎప్పుడైనా రాజీనామా చేయడానికి సిద్ధమేనని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖామంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. బుధవారం గుంటూరు జిల్లా మంగళగిరి మార్కెట్‌యార్డు పాలకవర్గ అభినందన కార్యక్రమానికి విచ్చేసిన ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ ఇప్పుడు తానున్న స్థితికి బీజేపీ, వెంకయ్యనాయుడు కారణమని, వెంకయ్యనాయుడు ఇప్పుడు రాజకీయాల్లో లేనందున బీజేపీ కేంద్ర నాయకత్వ ఆదేశాల మేరకు నడుచుకుంటానన్నారు. పదవులు శాశ్వతం కాదని, విలువలు కాపాడుకోవటం ముఖ్యమన్నారు. బీజేపీ, టీడీపీల మధ్య గత కొంతకాలంగా జరుగుతున్న పరిణామాలను దృష్టిలో పెట్టుకుని మంత్రి పదవికి రాజీనామా లేఖను సిద్ధం చేసి తన పీఏస్ వద్ద ఉంచానని, రాజీనామా చేయాలని లేదుగానీ పార్టీ ఆదేశాలు వస్తే లేఖ ఇచ్చేందుకు సిద్ధం చేశానని మంత్రి కామినేని అన్నారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు హరిబాబు చెప్పిన దాంట్లో అబద్ధాలు లేవని, అన్నీ నిజాలేనని ఆయనన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఎంతో చేసిందని, ఇంకా చేయాల్సి ఉందని, ప్రతి వాళ్లూ ఏదో ఒకటి మాట్లాడి రెండు పార్టీల మధ్య దూరం మరింత పెంచొద్దనేది తన భావన అని అన్నారు. మంగళగిరిలో నిర్మాణంలో ఉన్న ఎయిమ్స్ సంస్థకు 300 కోట్ల రూపాయలు ఇప్పటికే కేటాయించారన్నారు. యుద్ధ ప్రాతిపదికన పనులు జరుగుతున్నాయన్నారు. ప్రపంచంలో అత్యధిక సభ్యత్వం ఉన్న బలమైన పార్టీ బీజేపీయేనని, అటువంటి పార్టీని వెంట్రుక, గుండులతో పోల్చటం సరికాదన్నారు. మంత్రి మాణిక్యాలరావు తనకు మంచి మిత్రుడని, ఆయన చిట్‌చాట్‌లో మాట్లాడిన మాటలు సీరియస్‌గా తీసుకోవటం తగదన్నారు. రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు అహర్నిశలు పని చేస్తున్నారన్నారు. అభివృద్ధి కోసమే ప్రజలు చంద్రబాబు, నరేంద్రమోదీలకు అవకాశం ఇచ్చారని కామినేని అన్నారు. భవిష్యత్తులో బీజేపీ, వైసీపీ కలిసే ప్రసక్తి ఉండబోదని, ప్రజల్లో కూడా ఇదే భావన ఉందని, 16 నెలలు జైల్లో ఉండి 11 కేసుల్లో ముద్దాయిగా ఉన్న జగన్‌తో నిజాయితీ గురించి ఏ విధంగా మాట్లాడగలమని ఆయన న్నారు. టీడీపీతో ప్రస్తుతం బీజేపీ కలిసే ఉందని, భవిష్యత్తులోనూ కలిసి ఉండి దేశాన్ని, రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలన్నదే తమ ఉద్దేశ్యమని మంత్రి కామినేని అన్నారు.

కిడ్నీ రోగులకు నెలకు 10వేల పెన్షన్

వైకాపా అధినేత జగన్ హామీ

ఆంధ్రభూమి బ్యూరో

ఒంగోలు, ఫిబ్రవరి 21:తమపార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే కిడ్నీ బాధితులను అన్నివిధాల ఆదుకుంటామని, వారికి నెలకు పదివేల రూపాయల పెన్షన్ ఇచ్చి, అత్యంత మెరుగైన వైద్య సదుపాయాలు కల్పిస్తామని వైకాపా అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కిడ్నీబాధితులకు హామీ ఇచ్చారు. జగన్ ప్రజాసంకల్ప యాత్ర 94వరోజు బుధవారం ప్రకాశం జిల్లాలోని పొన్నలూరు మండలం తిమ్మపాలెం శివారు శిబిరంనుండి ప్రారంభమై చెరువుకొమ్ముపాలెం, కె అగ్రహారం, పర్చూరువారిపాలెం, వెంగళాపురం క్రాస్‌రోడ్డుమీదుగా పెదఅలవలపాడు వరకుసాగింది.

పర్చూరు వారిపాలెం పార్టీ పతాకాన్ని ఆవిష్కరించిన జగన్ వెంగళాపురం క్రాస్‌రోడ్డు వద్ద కనిగిరి నియోజకవర్గంలోకి ప్రవేశించారు. ఈసందర్భంగా కిడ్నీ వ్యాధిగ్రస్తులు తమ సమస్యలను విన్నవించుకోగా ఆయన పై విధంగా హామీలు ఇచ్చారు. ఎన్నికల ముందు నిరుద్యోగులకు ఎన్నో హామీలు ఇచ్చిన చంద్రబాబు తమను మోసంచేశారని పాదయాత్రలో బిపిఇడి, ఎంపిఇడి విద్యార్థులు జగన్‌కు వివరించారు.

వైకాపా అధికారంలోకి వస్తేనే తమకు న్యాయం జరుగుతుందని వారు పేర్కొన్నారు. మరోవైపు అక్షయ గోల్డ్ బాధితులు జగన్‌ను కలిసి సమస్యలపై వినతిపత్రాన్ని సమర్పించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 10.11లక్షల మంది ఆసంస్థ బాధితులు ఉన్నారని, సంస్థకు చెందిన 450కోట్లరూపాయల విలువైన ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని తమకు న్యాయం చేసేలా చూడాలని కోరారు. పార్టీ అధికారంలోకి వచ్చాక తప్పనిసరిగా న్యాయం చేస్తామని జగన్ వారికి హామీ ఇచ్చారు. పలువురు రైతులు,మహిళలు తమ గోడును జగన్‌కు విన్నవించారు. పాలేటి గంగవద్ద బొల్లావులతో నృత్యాలు చేసిన యాదవులు జగన్‌కు ఘనస్వాగతం పలికారు. వాటిని ఎత్తుకున్న జగన్ కొద్దిసేపు నడిచారు. ఆయన వెంట మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, ఒంగోలు పార్లమెంటుసభ్యులు వైవి సుబ్బారెడ్డి, కనిగిరి పార్టీ ఇన్‌చార్జీ బుర్రా మధుసూదన్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.




పాలేటిగంగ వద్ద బొల్లావులతో నడుస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి

రాజకీయ లబ్ధికోసమే మోదీపై వ్యతిరేక ప్రచారం

బాబుపై మాజీ ఎమ్మెల్సీ రామచంద్రయ్య విమర్శ

ఆంధ్రభూమి బ్యూరో

తిరుపతి, ఫిబ్రవరి 21: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇష్టానుసారం నిర్ణయాలు తీసుకుని రాష్ట్ర ప్రజల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్సీ రామచంద్రయ్య మండిపడ్డారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆయన మాట్లాడుతూ ఎపికి ప్రత్యేక హోదా వద్దని ప్యాకేజీయే ముద్దు అని ప్రకటించిన చంద్రబాబు ప్రజలనుంచి వ్యతికరేకత రావడంతో ఇప్పుడు ప్రత్యేక హోదా గురించి మాట్లాడుతున్నారన్నారు. రాష్ట్రానికి వస్తున్న నిధులన్నీ అమరావతిలో పోస్తూ మిగతా ప్రాంతాలను విస్మరిస్తున్నారని మండిపడ్డారు. ప్రధాని మోదీని చంద్రబాబు అవమానిస్తున్నందుకు నిరసగా బాబు కేబినెట్‌లో బిజెపి మంత్రులు తమ పదవులకు రాజీనామా చేయాలని రామచంద్రయ్య సూచించారు. 2019 ఎన్నికల్లో రాజకీయ లబ్ధి పొందడానికి మోదీని ప్రజల్లో విలన్‌గా చిత్రీకరించే ప్రయత్నం బాబు చేస్తున్నారని ఆయన విమర్శించారు. ఎన్నికల సమయానికి బాబు బీజేపీతో దోస్తీకి ముగింపు పలుకుతాడని జోస్యం చెప్పారు.



కొంపముంచుతున్న వెబ్‌ల్యాండ్ నంబర్లు

తారుమారవుతున్న భూమి రికార్డులు ■ సర్వే కోసం కుప్పలుగా దరఖాస్తులు

ఆంధ్రభూమి బ్యూరో

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 21: సర్వే శాఖలో సంస్కరణలు కొత్త సమస్యలకు దారితీస్తున్నాయి. కొత్త విధానంలో ఆటోమేటిక్‌గా సబ్- డివిజన్ నంబర్లు ఇవ్వడంతో రైతులకు భూ సమస్యలు అధికమవుతున్నాయి. ఈ నేపథ్యంలో సర్వేకోసం దరఖాస్తులు పెరిగిపోయి, ఏళ్ల తరబడి పెండింగ్‌లో పడుతున్నాయి. ఈక్రమంలో భూ వివాదాలు పెరుగుతున్నాయి. సమస్యలు చుట్టుముడుతున్నాయి. రాష్ట్రంలో సర్వే దరఖాస్తులు ఏళ్ళ తరబడి పెండింగ్‌లో పడుతున్నాయి. రైతులు ఈ సేవా కేంద్రాల ద్వారా చేసుకునే ఈ దరఖాస్తులు దొంతర్లుగా తహసీల్దార్ కార్యాలయాల్లో పెండింగ్‌లో పడుతున్నాయి. సర్వే సమస్యలు పరిష్కారం కాకపోవడం వల్ల భూమి సరిహద్దులు సమస్యాత్మకంగా తయారవుతున్నాయి. సర్వే రికార్డులు సక్రమంగా లేకపోవడంతో నగరాలు, మున్సిపాలిటీల్లోనూ ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతమవుతున్నాయి. సర్వే పనుల ద్వారా ఆదాయం సమకూరకపోగా రూ.కోట్ల విలువైన భూములు అన్యాక్రాంతమవుతున్నాయని తెలుస్తోంది. సరిపడా సర్వేయర్ వ్యవస్థ వుంటే భూ ఆక్రమణ జరగకుండా నిరోధించవచ్చు. రెవెన్యూకు వెన్నుముక వంటి సర్వే శాఖను పునర్వవస్థీకరించి రెవెన్యూ శాఖతో అనుసంధానంచేసి, మరింత పటిష్టవంతం చేయాల్సివుంది. ప్రస్తుతం ఎఫ్ఎంబీ రికార్డులను డిజిటలైజేషన్ చేస్తున్నారు. ప్రైవేటు వ్యక్తులు ప్రభుత్వం నుంచి కాంట్రాక్టు తీసుకుని విలువైన భూమి రికార్డులు ప్రైవేటు చేతిలో పెట్టారు. వాస్తవానికి కాంట్రాక్టు ఒప్పందం ప్రకారం ఈ పనంతా ప్రైవేటు కాంట్రాక్టరు మాత్రమే నిర్వహించాల్సివుంది. కానీ ఈ డిజిటలైజేషన్ విధులకు కూడా మండల స్థాయిలో సర్వే సిబ్బందిని వినియోగిస్తున్నారు. ప్రైవేటు కాంట్రాక్టర్‌కు ప్రభుత్వ సిబ్బందిని వినియోగిస్తున్నారు. ఒక ఎఫ్ఎంబి రూపొందించడానికి రూ.32 చొప్పున ప్రైవేటుకు కాంట్రాక్టు ఇచ్చారు. గత ఏడాది కాలంగా డిజిటలైజేషన్ ప్రక్రియ జరుగుతోంది. ప్రస్తుతం 1920 నాటి రికార్డుల మేరకు ఎఫ్ఎంబిలను డిజిటలైజేషన్ చేస్తున్నారు. ఆధునిక సాంకేతిక విధానాల వల్ల పూర్వపు సమస్యలు అధిగమించాల్సి వుంది కానీ అందుకు విరుద్ధంగా ప్రస్తుతం భూ సమస్యలు పెరిగిపోతున్నాయి. కంప్యూటర్ ఆఫ్ ల్యాండ్ రికార్డుల్లో 2013 వరకు రైతుల పేర్లు మార్పుచేసినపుడు రెవెన్యూ, సర్వే శాఖలకు ఏ విధమైన సమస్యలు ఎదురు కాలేదు. వెబ్‌ల్యాండ్ సాఫ్ట్‌వేర్ ద్వారా ల్యాండ్ రికార్డుల్లో రైతుల పేర్లకు ఆటోమేటిక్ సబ్ డివిజన్స్ ఇవ్వడం, డిజిటల్ సైన్ చేయడం వల్ల సంబంధం లేని సబ్ డివిజన్స్‌పై మరో సబ్ డివిజన్లు ఏర్పడి భూమి రికార్డులు తప్పుల తడకలుగా మారుతున్నాయి. సాఫ్ట్‌వేర్‌లో సమస్యలు వస్తున్నాయని చెప్పి ఆటోమేటిక్ సబ్ డివిజన్ పద్ధతి తొలగించినప్పటికీ ముందుగా ఇచ్చిన సబ్ డివిజన్ల వల్ల ల్యాండ్ రికార్డులు 100 శాతం నాశనం అవుతున్నాయి. దీనివల్ల గ్రామ రికార్డులు, అడంగళ్లు, ఆర్ఎస్ఆర్, (ఎ రిజిస్టర్), దస్తావేజులు, పాస్‌బుక్‌లో ఒక సర్వే నెంబర్ వుంటే ఆన్‌లైన్‌లో వేరొక సబ్ డివిజన్ నంబర్ కన్పిస్తోంది. కంప్యూటర్ ద్వారా కొత్త సబ్ డివిజన్లను ఇస్తున్నారు. సంబంధం లేని సబ్ డివిజన్ నంబర్లు రావడంవల్ల ప్రభుత్వ రికార్డు నాశనం అవుతోంది. ఈ నేపథ్యంలో ప్రతీ రైతును సర్వేకు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా రెవెన్యూ శాఖ చెబుతోంది. అయితే ప్రస్తుతం కంప్యూటర్ ద్వారా ఇచ్చే సబ్ డివిజన్లవల్ల రానున్న సంవత్సరాల్లో భూ వివాదాలు మరింతగా తలెత్తే అవకాశం వుంది.

ఈ నేపథ్యంలో వెబ్‌ల్యాండ్‌లో సబ్ డివిజన్ ఇచ్చే విధానం తొలగిస్తే రైతులకు సర్వే సమస్యలు పరిష్కారమవుతాయంటున్నారు. ఈక్రమంలో ఏపీలో 2012-13 ల్యాండ్ రికార్డులు కంప్యూటరైజేషన్ చేసినట్టుగా వెబ్‌ల్యాండ్ సాఫ్ట్‌వేర్‌లో సబ్ డివిజన్ నంబర్లు రాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. దీని వల్ల శాశ్వత రికార్డు ఆర్ఎస్ఆర్ (ఎ రిజిస్టర్)లో గల సర్వే సబ్ డివిజన్ నెంబర్లు, విస్తీర్ణాలు సరిపోయేటట్టు చేయడంవల్ల రైతులు కోర్టులను ఆశ్రయించకుండా ఉంటారు. అలాగే సర్వే కోసం దరఖాస్తులు చాలా తగ్గుతాయి. మొత్తం మీద వెబ్‌ల్యాండ్ విధానంలో సబ్-డివిజన్ నెంబర్ ఇచ్చే విధానాన్ని తొలగించాల్సి వుంది.

ట్రావెల్స్ బస్సును ఢీకొన్న టిప్పర్

22 మందికి గాయాలు

విశాఖపట్నం (గోపాలపట్నం), ఫిబ్రవరి 21: విజయవాడ నుంచి శ్రీకాకుళం జిల్లా రాజాం వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు విశాఖ ఎన్ఏడీ కూడలి వద్ద బుధవారం తెల్లవారు జామున ప్రమాదానికి గురైంది. కూడలి వద్ద వేగంగా వచ్చిన టిప్పర్ బస్సును ఢీకొనడంతో బస్సు బోల్తా పడింది. ఈ ఘనటలో ప్రాణ నష్టం సంభవించనప్పటికీ 22 మంది ప్రయాణికులు గాయాలతో బయటపడ్డారు. వీరిలో నలుగురికి తీవ్ర గాయాలు కావడంతో ప్రత్యేక చికిత్స అందిస్తున్నారు. బుధవారం తెల్లవారు జామున 4.30 గంటల సమయంలో ప్రైవేటు బస్సు ఎన్ఏడీ కొత్తరోడ్ జంక్షన్ దాటుతున్న సమయంలో విశాఖ పోర్టు నుంచి కొత్తవలస వైపు వేగంగా వెళ్తున్న టిప్పర్ బలంగా ఢీ కొనడంతో బస్సు బోల్తా పడింది. అప్పటికి బస్సులో 40 మంది ప్రయాణికులున్నారు. దీంతో బస్సులో ఉన్న ప్రయాణికుల్లో 22 మందికి గాయాలయ్యాయి. తక్షణమే క్షతగాత్రులను విశాఖ కేజీహెచ్‌కు తరలించి చికిత్స అందించారు. వీరిలో బస్సు డ్రైవర్ కోట జయప్రకాష్ సహా ప్రయాణికులు కే.సరోజిని (రాజాం), ఆబోతుల సీతామహాలక్ష్మి (చీపురుపల్లి), సమ్మి సంతోష్ (ఆముదాల వలస) తీవ్రంగా గాయపడగా, వీరికి ప్రత్యేక చికిత్స అందిస్తున్నారు. అయితే వీరికి ప్రాణాపాయం లేదని కేజీహెచ్ వైద్యులు స్పష్టం చేశారు.



ప్రమాదంలో బోల్తాపడిన ట్రావెల్స్ బస్సు

ఆంధ్రభూమి

జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ

గురువారం, 22 ఫిబ్రవరి 2018

దూసుకొస్తున్న చైనా

చైనా ప్రభుత్వం కొనసాగిస్తున్న వ్యూహాత్మక దురాక్రమణ మరింతగా విస్తరిస్తోందనడానికి ఇది మరో ఉదాహరణ. హిందూ మహా సముద్ర జలాలలో చైనా యుద్ధ నౌకలు నెలకొనడం ఈసారి కొత్త విస్తరణ! మాల్ దీవులలో కొనసాగుతున్న రాజకీయ సంక్షోభం ఈ 'విస్తరణ'కు నేపథ్యం! హిందూ మహాసముద్రం మనదేశానికి దక్షిణంగా విస్తరించింది. మన దక్షిణ సరిహద్దునకు అత్యంత సమీపంలో నైరృతిగా మాల్‌దీవులు, ఆగ్నేయంగా శ్రీలంక హిందూ మహాసాగరంలో ఏర్పడి ఉన్నాయి. అందువల్ల హిందూ మహాసముద్ర జలాలలో చైనా యుద్ధ నౌకలు తిరుగుతుండడం మన భద్రతను భంగపరచడానికి పొంచి ఉన్న ఘోర ప్రమాదం. మాల్ దీవులలో నెలకొని ఉన్న సంక్షోభాన్ని తొలగించడానికి వీలుగా మన ప్రభుత్వం జోక్యం కల్పించుకోవడం అనివార్యం! కానీ మాల్‌దీవులలో మన మధ్యవర్తిత్వాన్ని చైనా వ్యతిరేకిస్తోంది. ఇలా వ్యతిరేకించడానికి తార్కికమైన, సమంజసమైన కారణం లేదు. మాల్‌దీవులు, శ్రీలంక మనదేశానికి అత్యంత సమీపంలో ఉన్నందున ఆ దేశాల భద్రతతో మనదేశం భద్రత దక్షిణాసియా ప్రాంత విస్తృత భద్రత ముడివడి ఉన్నాయి. అందువల్ల మాల్‌దీవుల అంతర్గత భద్రతను పరిరక్షించడం మన నైతిక విధి మాత్రమే కాదు, భౌగోళిక వాస్తవానికి, శతాబ్దుల చరిత్రకు అనుగుణమైన వ్యవహారం! ఈ చరిత్ర క్రీస్తునకు పూర్వం వేల సంవత్సరాలుగా కొనసాగుతోంది. క్రీస్తుశకం పుట్టిన తరువాత దాదాపు వెయ్యేళ్ల వరకు మాల్‌దీవులు అఖండ భారతదేశంలో భాగం, మాల్‌దీవుల సంస్కృతి భారత జాతీయ సంస్కృతిలో భాగం, వేదమతాలు ఆ తరువాత బౌద్ధ మతం మాల్‌దీవులలో పరిఢవిల్లాయి. సంస్కృత భాషలో లిఖితమై ఉన్న శిలాఫలకాలు, తామ్ర శాసనాలు, తాళపత్ర గ్రంథాలు, ఆలయాల అవశేషాలు మాల్‌దీవులలో జరిగిన తవ్వకాలలో బయటపడడం ఈ సాంస్కృతిక సమానత్వానికి సజీవ నిదర్శనాలు. క్రీస్తునకు పూర్వం వేల ఏళ్లుగాను, క్రీస్తుశకం ప్రారంభమైన తరువాత వందల ఏళ్ల వరకు కూడా భాతర సమీకృత రాజ్యాంగ వ్యవస్థలో కూడ మాల్‌దీవులు లేదా మాలా ద్వీపాలు భాగం కావడం చరిత్ర! ఇస్లాం జీహాదీ, ఐరోపా వాణిజ్య బీభత్సకారులు చొరబడిన తరువాత మాల్‌దీవులు భారత్ నుంచి క్రమంగా విడిపోయింది! బ్రిటన్ దురాక్రమణదారులు నిష్క్రమించిన తరువాత మాల్‌దీవులు స్వతంత్ర దేశంగా ఏర్పడినప్పటికీ మనకు, మాల్‌దీవులకూ మధ్య సాంస్కృతిక వారసత్వ సమానత్వం ఉభయ దేశాలను పరస్పరం సన్నిహితం చేయగలిగింది. మన లక్ష ద్వీపాలకు, మాల్‌దీవులకు మధ్య ఇరుకైన సముద్రం నెలకొని ఉండడం ఉభయ దేశాల భౌగోళిక సాన్నిహిత్యానికి నిదర్శనం. మాల్‌దీవులతో చైనాకు ఈ భౌగోళిక సాన్నిహిత్యం కాని, సాంస్కృతిక సమానత్వం కాని లేదు! అందువల్ల మాల్‌దీవులలో చైనా జోక్యం అక్రమ ప్రమేయం మాత్రమే!

ముప్పయి ఏళ్లక్రితం మాల్‌దీవుల ప్రభుత్వాన్ని కిరాయిగుండాలు కూలదోసినప్పుడు, ఆ ప్రభుత్వం మనదేశ సహాయాన్ని అర్థించడం ఈ చారిత్రక సమానత్వానికి అనుగుణమైన వ్యవహారం. మన నౌకాదళంవారు మాల్‌దీవులకు వెళ్లి కిరాయి మూకల నిర్బంధం నుంచి మాల్‌దీవుల ప్రభుత్వాన్ని విముక్తం చేశాయి. అది మాల్‌దీవులకు మరోసారి లభించిన స్వాతంత్ర్యం! అప్పటికి చైనాకు మాల్‌దీవులతో ఎలాంటి సంబంధం లేదు. దౌత్యసంబంధాలు లేవు, వాణిజ్య సంబంధాలు లేవు! కానీ దశాబ్దుల పాటు మన ప్రభుత్వాల నిర్లిప్తత, నిర్లక్ష్యం కారణంగా చైనా మాల్‌దీవులలోకి చొరబడగలిగింది. 2010లో మాల్‌దీవులలో చైనా దౌత్య కార్యాలయం నెలకొనడం ఈ చొరబాటుకు పరాకాష్ట! ఇలా చొరబడిన చైనా క్రమంగా మాల్‌దీవులతో మనదేశం కంటె సాన్నిహిత్యాన్ని సాధించడం గత ఏడేళ్ల చరిత్ర. ఇపుడు మాల్‌దీవులలో ప్రజాస్వామ్య వ్యవస్థను పునరుద్ధరించడానికి మళ్లీ మన ప్రమేయం అవసరమైంది. మన ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని మాల్‌దీవుల 'సుప్రీంకోర్టు' వారు అభ్యర్థించారు. మాజీ అధ్యక్షుడు, ప్రస్తుత దేశ బహిష్కృతుడు మొహమ్మద్ నషీద్ కోరాడు. పజాస్వామ్య వ్యవస్థలను కోరుతున్న అంతర్జాతీయ సమాజం కూడ మాల్‌దీవులలో మన ప్రమేయాన్ని అభిలషిస్తోంది... కానీ చైనా మాత్రం మన ప్రమేయాన్ని వ్యతిరేకిస్తోంది!

మాల్‌దీవులలోకి 1988లో వలె మళ్లీ మన నౌకాదళం ప్రవేశించి నట్టయితే ప్రజాస్వామ్య వ్యవస్థను పునరుద్ధరించడానికి యత్నించినట్టయితే తాము అడ్డుకోనున్నట్టు చైనా ప్రభుత్వం వారు చాటింపు వేస్తున్నారు. రెండు వారాలుగా సాగుతున్న ఈ 'చాటింపు'లో భాగంగానే హిందూ మహాసముద్రం తూర్పు భాగంలో ఆస్ట్రేలియా సమీపంలో వారం రోజులుగా నాలుగు చైనా యుద్ధ నౌకలు తిరుగుతున్నాయి. ఈ నౌకల ఉనికిని చైనా ప్రభుత్వం ప్రచార మాధ్యమాలు స్వయంగా వెల్లడించాయి. ఆఫ్రికా దక్షిణ ప్రాంతం నుంచి మరో రెండు యుద్ధ నౌకలు కూడా హిందూ మహాసాగర జలాలలో ప్రవేశించడం సమాంతర విపరిణామం! ఓడ దొంగలను అరికట్టే నెపంతో చైనా యుద్ధ నౌకలు ఇదివరకే అరేబియా సముద్రంలోను, హిందూ మహాసముద్రం పడమటి ప్రాంతంలోను గస్తీ తిరుగుతున్నాయి. తూర్పు ప్రాంతంలో సైతం చైనా యుద్ధ నౌకల సంచారం ఆరంభం కావడంతో మొత్తం పదకొండు చైనా యుద్ధ నౌకలు హిందూ సాగర జలాలలో తిష్ఠ వేసి ఉన్నాయి. మాల్ దీవులకు రెండు వేల ఐదువందల మైళ్ల పరిధిలో చైనా నౌకలు లేవని మన ప్రభుత్వం అంటోంది. అయినప్పటికీ తమకు ఏమాత్రం సంబంధం లేని హిందూ సాగర జలాలలో చైనా యుద్ధ నౌకలు నడయాడడమే అంతర్జాతీయంగా ఆసక్తిని కలిగిస్తున్న అంశం! డియోగో జార్సియా హిందూ మహాసముద్రంలోని చిన్నదీవి. బ్రిటన్ అధీనంలో శతాబ్దులపాటు ఉండిన ఈ దీవిని 1966 నుంచి అమెరికా తన వైమానిక దళ స్థావరంగా మార్చుకొంది. సుదూర ప్రాంతంలోని 'అమెరికా'- హిందూసాగర జలాలలో కూడా స్థావరాన్ని ఏర్పాటు చేసుకొనడం వల్ల ఈ ప్రాంతపు దేశాలు నిరసన తెలపడం చరిత్ర. ఈ చరిత్ర పునరావృతం అవుతోంది, పునరావృతం చేస్తున్నది చైనా!

గోటితో పోయే దానికి గొడ్డలి తీసుకున్నట్టుగా మాల్‌దీవుల పట్ల మన విధానం కొనసాగుతోంది. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికయిన మహమ్మద్ నషీద్‌ను 2012 ఫిబ్రవరిలో 'పోలీసులు' తిరుగుబాటు చేసి కూలదోశారు. 1988లో వలెనే మన ప్రభుత్వం మాల్‌దీవులకు సైన్యాన్ని పంపి ఉండాలి, ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడి ఉండాలి! కానీ సహాయ పడవలసిందిగా అప్పటి అధ్యక్షుడు 2012లో చేసిన అభ్యర్థనను మన ప్రభుత్వం పట్టించుకోలేదు. అందువల్ల నషీద్ పదవీచ్యుతుడయినాడు, ప్రజాస్వామ్య వ్యవస్థ భంగమైంది. మన ప్రభుత్వం నషీద్ ప్రభుత్వ అభ్యర్థన మేరకు సైనిక దళాలను మాల్‌దీవులకు పంపి ఉండినట్టయితే 2012 తరువాత మాల్‌దీవుల రాజకీయ చరిత్ర రాజ్యాంగ గతి మరో విధంగా ఉండేది. 1988నాటి విజ్ఞత 2012లో మన ప్రభుత్వానికి లేకపోవడం మాల్‌దీవులలో చైనా 'చొరబాటు'నకు కారణం.

'అందరి కలయిక' అందమైన ఊహే!

ఆంధ్రప్రదేశ్‌లో మళ్లీ కాలం చెల్లిన 'రాజీనామాల సిద్ధాంతాలు' తెరపైకి వస్తున్నాయి. రాజీనామాల వల్ల ప్రజలకు, రాష్ట్రానికి జరిగే మేలు ఉండదు. దీని వల్ల ఉపఎన్నికలు వస్తే ప్రజాధనం వృథా అవుతుంది. వచ్చే ఏడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో లోక్‌సభకు ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పుడు ఆంధ్రా ఎంపీలు రాజీనామా చేసినా ఉపఎన్నికలను కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహిస్తుందన్న నమ్మకం లేదు. 8, 9 నెలల వ్యవధిలో లోక్‌సభ కాలపరిమితి అయిపోతుంటే, ఉపఎన్నికలు నిర్వహించడం కష్టమే. లోక్‌సభ స్పీకర్‌కు రాజీనామా లేఖలను సమర్పించిన వెంటనే అవి అమలులోకి రావు. స్పీకర్ రాజీనామాలను ఆమోదించినప్పటి నుంచి ఆరు నెలల కంటే మించి ఆ నియోజకవర్గం ఖాళీగా ఉండకూడదు.ప్రత్యేక హోదా, విభజన చట్టంలో హామీలు, పార్లమెంటులో ఇచ్చిన వాగ్దానాలు కార్యరూపం దాల్చడానికి తన పార్టీ ఎంపీలు ఏప్రిల్ నెల 5 లేదా 6 తేదీల్లో రాజీనామా చేస్తారని వైకాపా అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రకటించారు. మరో ముందుడుగు వేసి, హామీల సాధనకు మోదీ ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానాన్ని ఎవరు ప్రవేశపెట్టినా మద్దతు ఇస్తామని ఆయన ప్రకటించారు.

ఏపీ ముఖ్యమంత్రి, టిడిపి జాతీయాధ్యక్షుడు చంద్రబాబు నాయుడు తనదైన శైలిలో కేంద్రంపై వత్తిడి పెంచుతున్నారు. రాష్ట్ర ప్రయోజనాలకు ఎటువంటి నిర్ణయం తీసుకునేందుకైనా సిద్ధమంటున్నారు. మంత్రులు, పార్టీ సీనియర్లతో చర్చిస్తూ వ్యూహాలను ఖరారు చేస్తున్నారు. 'ప్రత్యేక హోదా- ఆంధ్రుల హక్కు' నినాదంతో వామపక్ష పార్టీలు ఇచ్చిన పిలుపు మేరకు 'ఏపీ బంద్' ఇటీవల విజయవంతమైంది. అమరావతిలో ప్రత్యేక హోదా విభజన హామీ సాధన సమితి సమావేశమై ఉద్యమ కార్యాచరణను ప్రకటించింది. హైదరాబాద్‌లో జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ కూడా రంగంలోకి దిగారు. సంయుక్త నిజ నిర్ధారణ కమిటీని ఏర్పాటు చేసి విభజన హామీలు, అమలు, కేంద్రం విడుదల చేసిన నిధులు తదితర అంశాలపై కొన్ని రోజుల్లో నివేదిక వచ్చిన వెంటనే కార్యచరణ ప్రణాళికను ప్రకటిస్తామన్నారు.

టిడిపి మిత్రపక్షం బిజెపి త్వరలో కేంద్రమంత్రులను రాష్ట్రానికి తీసుకువచ్చి, 'మేము రాష్ట్రానికి చాలా చేశాం, మరింత చేస్తాం' అని చెప్పే కార్యక్రమాన్ని చేపట్టనుంది.

2014 జూన్ 2 నుంచి ఇంతవరకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రతపక్ష నేత జగన్మోహన్ రెడ్డి రాష్ట్రం ఎదుర్కొంటున్న సమస్యలు, విభజన హామీలపై పట్టుమని ఒక నిమిషం కూడా కలుసుకుని మాట్లాడుకోలేదు. మరే రాష్ట్రంలోలేని విచిత్రమైన పరిస్థితి ఆంధ్రప్రదేశ్‌లో ఆవిష్కృతమైంది. ఏపీకి కేంద్రంలో 2014 వరకు అధికారంలో ఉన్న కాంగ్రెస్, ఇప్పుడు బిజెపి అన్యాయం చేసిందని ప్రజలు విశ్వసిస్తున్నారు. శాసనసభ నాయకుడు, ప్రతిపక్ష నేత చేతులు కలపాల్సిన సమయం ఆసన్నమైంది. అప్పుడే రాష్ట్రానికి న్యాయం జరిగేందుకు అవకాశం ఉంటుంది. విస్తృతస్థాయి అఖిలపక్ష సమావేశం ఏర్పాటుకు చంద్రబాబు చొరవ తీసుకోవాలి. ఈ అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబు మరో మాటకు తావులేకుండా వైఎస్ జగన్‌ను సాదరపూర్వకంగా ఆహ్వానించి అమరావతిలోని సచివాలయంలోనే మాట్లాడితే బాగుంటుంది. అసెంబ్లీలో ప్రాతినిధ్యం లేకపోయినా వామపక్ష పార్టీలను చంద్రబాబు అఖిలపక్ష సమావేశానికి ఆహ్వానిస్తే హుందాగా ఉంటుంది. చంద్రబాబుకు సరిసమాన నేత మరొకరు రాష్ట్రంలో ఇప్పుడు లేరు. ఆయన పాలనను విమర్శించవచ్చు. కాని తూలనాడే ధోరణిని విపక్షాలు విడనాడాలి. అదే సమయంలో టిడిపి కూడా వైకాపా, ఇతర పక్షాలను వ్యక్తిగతంగా నిందించే పద్ధతికి స్వస్తి చెప్పాలి. జగన్ కూడా పంతాలు, పట్టింపులకు పోకుండా చంద్రబాబు నుంచి ఆహ్వానం వచ్చిన వెంటనే అమరావతికి వెళ్లి రాష్ట్ర సమస్యలపై ఢిల్లీకి వెళ్లి గళం విప్పేందుకు తన వంతు సహకారం ఉంటుందని చెప్పాలి. సీఎం చంద్రబాబు, విపక్ష నేత జగన్ అన్ని పార్టీలను కలుపుకుని రాష్ట్రప్రయోజనాలకు మేమంతా ఒక్కటే అనే సంకేతాన్ని బలంగా ఢిల్లీకి వినిపిస్తే ప్రధాని నరేంద్రమోదీ తప్పనిసరిగా దిగివస్తారు. 'మీ ముఖ్యమంత్రి, మీ ప్రతిపక్ష నేత ఒకరికొకరు కలుసుకోరు. కనీసం వారిద్దరి మధ్య మర్యాద కోసం కరచాలనాలు లేవు. పలుకరింపులు ఎక్కడ ఉంటాయి. ఒకరినొకరు తారసపడే సందర్భాలు ఉన్నా, అవి ఎదురుకాకుండా చూసుకుంటారు. ఎన్నికల్లోనే ఎవరి జెండాలు, అజెండాలు. సాధారణ సమయాల్లో కూడా రాష్ట్రానికి ఒక వైపు తీరని ద్రోహం జరుగుతుంటే ఇంకా భీష్మించుకుని కూర్చోవడం, ఎడముఖం పెడముఖంతో ఈ ఇద్దరు నేతలు వ్యవహరిస్తే ఢిల్లీలో ఎవరు పట్టించుకుంటారు' అని ఇతర దక్షిణాది రాష్ట్రాలు, ఉత్తరాది రాష్ట్రాల నేతలు, సీనియర్ రాజకీయనేతలను ఎవరినడిగినా పై మాటలే మాట్లాడుతున్నారు.

మార్చి నెల మొదటి వారంలో ఏపీ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమవుతున్నాయి. అదే సమయంలో పార్లమెంటు సమావేశాలు జరుగుతాయి. వచ్చే పార్లమెంటు సమావేశాల్లో కేంద్రం కచ్చితంగా ఆంధ్రకు విభజన చట్టంలో ఇచ్చిన హామీలపై ప్రకటన చేయాలి. దీని కోసం జన సేన, వామపక్ష పార్టీలు ఎవరికి వారు చేస్తున్న ఉద్యమాల వల్ల కేంద్రంలో కదలిక వస్తే మంచిదే. ప్రధాన పార్టీలు టిడిపి, వైకాపా చేతులు కలపాలి. ఎన్నికలకు ఇంకా ఏడాది వ్యవధి ఉంది. కేంద్రంపై వత్తిడి తెచ్చి కొన్ని హామీలైనా నెరవేర్చే ప్రయత్నం చేస్తే, ఆ క్రెడిట్ మాదంటే మాది అని రెండు పార్టీలు జనంలోకి వెళ్లి చెప్పుకోవచ్చు. ప్రజలు వచ్చే ఎన్నికల్లో వీరి భవిష్యత్తును నిర్ణయిస్తారు. రాష్ట్రప్రయోజనాలకు ఎవరికి వారు సొంత అజెండాలతో పోరాడడం వల్ల వచ్చే ప్రయోజనం ఏమీ ఉండదు. ఇదే కొనసాగితే చివరకు సమైక్య ఉద్యమంలో వచ్చిన జీరో ఫలితాలే మళ్లీ పునరావృతమవుతాయి.

ఉమ్మడి రాష్ట్రంలో రకరకాల కారణాలతో వరుస రాజీనామాలతో ప్రజలు విసుగు చెందారు. ప్రజాస్వామ్యంలో అత్యున్నత వేదిక పార్లమెంటు. పార్లమెంటు వేదికగా టిడిపి, వైకాపా పార్టీలు పోరాడాలి. పార్లమెంటులోపల అలజడి సృష్టించాలి. పార్లమెంటులో ఒక్క అంశంపై కూడా చర్చ జరగనివ్వకుండా చేయాలి. లోక్‌సభ సమావేశాల్లో గుంటూరు టిడిపి ఎంపి గల్లా జయదేవ్ తన శక్తిమేర ఆంగ్లంలో మాట్లాడి ప్రపంచానికి ఆంధ్రుల బాధలను చెప్పినందుకు అభినందించాలి. రాష్ట్ర సమస్యలపై ఈ తరహాలో మాట్లాడిన నేత ఇటీవల కాలంలో మరొకరులేరు. క్రీడాకారులు క్రీడామైదానంలోనే తమ ప్రతిభతో ఆడి మెప్పించాలి. అంతేకాని రోడ్డుపైకి వచ్చి ఆడితే విలువ ఉండదు. ఆంధ్ర ఎంపీలు పార్లమెంటులో తన పోరాటాన్ని ఉధృతం చేయాలి. పోరాడేందుకు పార్లమెంటుకు మించిన వేదిక మరొకటి ఉండదు. రాజీనామాల విషయమై తెలుగుదేశం పార్టీ తీరును విశ్లేషిస్తే సరైన హామీ రానిపక్షంలో కేంద్రమంత్రి పదవులకు టిడిపి ఎంపీలు గుడ్‌బై చెప్పడం మంచిది.

వచ్చే ఏడాది ఎన్నికలు కావడం వల్ల సహజంగానే రాజకీయ పార్టీ ఏ నిర్ణయం తీసుకున్నా, లాభ నష్టాలను బేరీజు వేసుకుంటుంది. వామపక్ష పార్టీలకు బలం లేకపోయినా అన్ని శక్తులను కూడదీసుకుని రాష్ట్రప్రయోజనాలకు పోరాడుతున్నాయి. ఏ ఉద్యమమైనా విద్యార్థి, యువజన సంఘాల పాత్ర లేకుండా తీవ్రరూపం దాల్చదు. 1972లో'జై ఆంధ్ర' ఉద్యమం తీవ్ర స్థాయికి చేరుకోవడానికి విద్యార్థి సంఘాలు గణనీయమైన పాత్ర పోషించగా, అప్పటి పార్టీ నేతలు స్వలాభానికి వాడుకుని ఉద్యమాన్ని నీరుకార్చాయి. వామపక్షపార్టీలు బలహీనపడడంతో, విద్యార్థి సంఘాల క్రియాశీల పాత్ర తగ్గుముఖం పట్టింది. రాజకీయ పార్టీల కార్యకర్తలు, పెద్దలతో కూడిన ఉద్యమాల వల్ల ఉద్యమ వాతావరణం ఉండదు. హింసాత్మక ఉద్యమాల వల్ల వచ్చే ప్రయోజనం లేదు. రాజ్యాంగ వ్యతిరేకమైన నిరసనలకు ప్రజల ఆమోదం ఉండదు. ఈ పరిస్థితుల్లో గాంధేయ మార్గం ఒక్కటే పరిష్కార మార్గం. ఒక వైపు పార్లమెంటు లోపల, వెలుపల రాజకీయాలకు అతీతంగా టిడిపి, వైకాపాలు చేతులు కలిపి నినదిస్తే, ఇక్కడ ఆంధ్రరాష్ట్రంలో అన్ని పార్టీలు ఒక వేదిక ద్వారా ప్రజలను భాగస్వామ్యం చేసి ప్రజాస్వామ్యయుతంగా గాంధేయ మార్గంలో ఉద్యమానికి శ్రీకారం చుడితే, కచ్చితంగా విభజన హామీలకు పరిష్కారం లభిస్తుంది.

> **వచ్చే ఏడాది ఎన్నికలు కావడం వల్ల సహజంగానే రాజకీయ పార్టీ ఏ నిర్ణయం తీసుకున్నా, లాభ నష్టాలను బేరీజు వేసుకుంటుంది. వామపక్ష పార్టీలకు బలం లేకపోయినా అన్ని శక్తులను కూడదీసుకుని రాష్ట్రప్రయోజనాలకు పోరాడుతున్నాయి. ఏ ఉద్యమమైనా విద్యార్థి, యువజన సంఘాల పాత్ర లేకుండా తీవ్రరూపం దాల్చదు. 1972లో 'జై ఆంధ్ర' ఉద్యమం తీవ్ర స్థాయికి చేరుకోవడానికి విద్యార్థి సంఘాలు గణనీయమైన పాత్ర పోషించగా, అప్పటి పార్టీ నేతలు స్వలాభానికి వాడుకుని ఉద్యమాన్ని నీరుకార్చాయి. వామపక్ష పార్టీలు బలహీనపడడంతో, విద్యార్థి సంఘాల క్రియాశీల పాత్ర తగ్గుముఖం పట్టింది.**

- కె. విజయశైలేంద్ర
98499 98097

అవును.. ప్రజలు చూస్తున్నారు..!

రాజకీయ నాయకులకు ఓటర్లంటే చచ్చేంత ప్రేమ. ఎన్నికలు దగ్గరికి వస్తున్నపుడు ఆ ప్రేమ మరింత పెరిగి ఉప్పెనలా పొంగి వరదలై పారుతూ ఉంటుంది. ఇంతకూ ఓటర్లంటే ఎవరు..? నేతల మాటల్లో చెప్పాలంటే- 'పాలకుల అధికారం కింద పడివుండే ప్రజలు.. ప్రతిపక్షాలకు- ఒకవేళ వాళ్లు గెలిచి పాలకులయితే 'తమ అధికారం కింద పడి ఉండబోయే ప్రజలు'. ప్రజలే తమ భవిష్యత్ ఆశాకిరణాలు. అందుకే ఎవరికి వాళ్లు ప్రజలను మాటలతో ఎలా మస్కాకొట్టాలా? తమవైపు ఎలా తిప్పుకోవాలా? అని చూస్తుంటారు. 'ప్రజలే దేవుళ్లు' అని, 'ఓటరు మహాశయులు' అంటారు. 'ప్రజాసేవే మా లక్ష్యం'.. 'రాష్ట్రాభివృద్ధే మా పార్టీ ఆశయం' అంటారు. వాళ్లు చేసే మోసాలను, అక్రమాలను, అరాచకాలను, స్కామ్‌లను కప్పిపుచ్చుకోవటం కోసం ఇలా ప్రజల నామ జపం చేస్తూ ఓటర్లను మభ్యపెట్టాలని చూస్తారు. సూర్యుడిని, చంద్రుడిని, సకల ప్రకృతినీ తమ పార్టీలో ఇష్టానుసారం చేర్చుకోగల అపర చాణక్యులలాంటి నేతలకు ప్రజలు ఒక లెక్కా! 'ఆఫ్టాల్ గొర్రెలు' అన్నది వాళ్ల నిశ్చితాభిప్రాయం.

ఈ ఉపోద్ఘాతం అంతా ఎందుకు చెప్పాల్సి వచ్చిందంటే- ప్రతిరోజూ టీవీ చానల్స్‌లో పొద్దునా, సాయంత్రం వీక్షకుల చెవులు బద్ధలయ్యే స్వరాలతో వచ్చే హోరాహోరీ చర్చోపచర్చలు వింటూ ఉండటం వల్ల! ఒక రాజకీయ పార్టీని మరో రాజకీయ పార్టీ నిలదీస్తూ, కడిగేస్తున్న సందర్భంలో ఆత్మరక్షణలో పడిన సదరు పార్టీనేత 'ప్రజలు చూస్తున్నారు.. వాస్తవాలు వాళ్లకు తెలుసు' అనేస్తాడు. 'కాగల కార్యం గంధర్వులే చేస్తారు..! అన్నట్టు సాక్ష్యంగా ప్రజలను నిలబెట్టేస్తే తక్కున ఒక పనైపోతుంది, 'డైలాగూ పవర్‌ఫుల్‌గా వస్తుంది' అన్నది తన అభిప్రాయం కావచ్చు. అవతలి పార్టీ వాళ్లేమయినా తక్కువ తిన్నారా? మరికొంతసేపు చర్చ ముందుకు నడిచాక.. తమమీద అభియోగాలు వచ్చినప్పుడు వాళ్లూ అదే డైలాగు- 'ప్రజలు చూస్తున్నారు.. వాళ్లే మీకు తగిన సమయంలో బుద్ధి చెబుతారు' అని!

'ప్రజలు' అంటే ఏ ఒక్కరో కాదు.. వెళ్లి అక్కడికక్కడ సమాధానం చెప్పటానికి.. అదొక సమూహం..! వాళ్లు మౌనమునులు పాపం..! నోరూవాయీ లేనివాళ్లు. అందుకే రాజకీయ నాయకులందరికీ ప్రజలంటే బోలెడు అలుసు..! వాళ్లను అడ్డం పెట్టుకుని ప్రస్తుతానికి తమ పబ్బం గడుపుకోవచ్చునని.. తాము చేసిన పాపాలను చస్తూ నిలబడుతూ వాళ్లే మోస్తారని వాళ్ల నమ్మకం. అందుకే చర్చల్లో పాల్గొనే నాయకులకు (విశ్లేషకులకు తప్ప) 'ప్రజలు చూస్తున్నారు..!' అన్నది ఓ రొటీన్ డైలాగుగా మారిపోయింది. 'దొందూ దొందే'.. 'అందరూ దొంగలే' అన్నట్టు రాజకీయాలు భ్రష్టుపట్టిపోయిన ఈ పరిస్థితుల్లో అందరూ అదే డైలాగు అంటే ఇక దానికేమయినా విలువ ఉంటుందా..? వీక్షకుల మధ్య ఓ జోక్ అయిపోదూ! 'ఈ చర్చలు వాళ్ల కంఠశోషకు, మన కర్ణశూలకు తప్ప ఎందుకు పనికి వస్తాయి.. వాటివల్ల ప్రయోజనం ఏమిటి?

ఈ పొలిటికల్ వార్‌లో ఇరు పార్టీల మధ్య చిక్కుకుని 'ఒకరు అటు, మరొకరు ఇటు' లాగుతుంటే దిక్కుతోచని స్థితిలో విలవిలలాడిపోతున్నారు పాపం ప్రజలు. ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాలలో పార్లమెంట్ సమావేశాలప్పుడు మొదలై ఇప్పుడు తీవ్ర రూపం దాల్చిన లడాయిని చూస్తున్నాం కదా! 'ఆంధ్రప్రదేశ్‌కు మేము కోట్లకు కోట్లు నిధులిచ్చాం.. ఆ విషయం టిడిపి వాళ్లు కాదన్నా ప్రజలకు తెలుసు'.. అంటారు బిజెపి వాళ్లు. 'మాకు కేంద్ర ప్రభుత్వం అన్యాయం చేసింది. మా రాష్ట్రాన్ని నిట్టనిలువునా ముంచి నమ్మకద్రోహం చేసింది. ఈ విషయాన్ని వాళ్లు అంగీకరించకపోయినా.. ప్రజలు చూస్తున్నారు. వాళ్లే రేపు ఆ పార్టీకి గట్టిగా బుద్ధి చెబుతారు' అంటారు తెలుగుదేశం వాళ్లు..! 'హతోస్మి' అని తలపట్టుకోవటం ప్రజల వంతు అవుతోంది. ఒక రొట్టె కోసం రెండు కోతులు పోట్లాడుకుంటుంటే.. మధ్యలో పంపకం నెపంతో వచ్చిన పిల్లి మొత్తం రొట్టెను కాజేసినట్లు 'ప్రత్యేకహోదా ఆంధ్రా ప్రజల హక్కు' నినాదంతో ప్రజల మెళ్లో గంటకట్టి పదవి కోసం అవతల కాచుకుని కూర్చున్నాడు ప్రతిపక్ష పార్టీ నేత.

ఇక తెలంగాణ రాష్ట్రానికి వస్తే నెంబర్‌వన్ సీఎంగా పేరు గడిస్తూ రాష్ట్రంలో బలంగా పాతుకుపోయిన కెసిఆర్ పార్టీ జెండాను ఎలా పీకి అవతల పారేసి అయనను గద్దె దించాలా? అని ఎదురు చూస్తున్న కాంగ్రెస్, బిజెపి పార్టీలు 'ఆయనవన్నీ ఆచరణ సాధ్యం కాని పథకాలు.. ఆ విషయం ప్రజలకు తెలుసు' అంటారు. 'ఏ రాష్ట్రంలో జరగని అభివృద్ధిని తెలంగాణలో సాధించాం. ఇది దేశంలోనే నెంబర్ వన్ స్టేట్. ఆ అభివృద్ధిని ప్రజలు చూస్తున్నారు' అంటారు టీఆర్‌ఎస్ వాళ్లు. 'ఇదెక్కడి గోల' అని తలపట్టుకోవటం ప్రజల వంతు అవుతోంది. అసలే టీవీ చానళ్ల రాజకీయ చర్చలతో విసిగి వేసారిపోయి.. వైరాగ్యంతో ఒకరకమైన ఫ్రస్టేషన్‌తో 'టీవీ సన్యాసం' తీసుకోవాలని ప్రజలు డిసైడైపోతున్న సమయంలో మమ్మల్నెందుకు మీ రాజకీయ కొట్లాటల మధ్యలోకి లాగుతారు? అని ప్రశ్నించే పరిస్థితిలో ఉన్నారు జనం.

ఇంతకూ నేనేమంటానంటే- 'అవును.. ప్రజలు చూస్తున్నారు' బుల్లితెరమీద రాజకీయ చర్చలు జరుగుతున్న విధానాన్ని మాత్రమే కాదు.. తెరవెనుక నడుస్తున్న బాగోతాలను కూడా చూస్తున్నారు. చూసి.. విని, రాబోయే ఎన్నికల్లో ఎవరికి ఓటేయాలో, ఎవరికి వెయ్యకూడదో అది కూడా డిసైడ్ అయిపోతున్నారు. ఎందుకంటే- వాళ్లలో మహామేధావులు, విశ్లేషకులు, రాజకీయ పండితులు ఉన్నారు. ఇప్పుడు అలా 'కామ్'గా ఉన్నారని వాళ్లని 'గొర్రెలు, అమాయక చక్రవర్తులు' అనుకుంటే అది నేతల తెలివితక్కువతనం. వాళ్లు పైకి అలా కనబడతారు గానీ సమయం వచ్చినప్పుడు 'ఓటు' అనే మంత్రదండంతో కుర్చీలు తారుమారు చేయగలరు. 'ఒకే' అనుకుంటే అధికార పక్షానికి స్థానభ్రంశం లేకుండా, చెక్కుచెదరనీయకుండా కాపాడగలరు. అదంతా వాళ్ల దయ.. నేతల ప్రాప్తం! అందుకే రాజకీయ నాయకులకు ఒక విన్నపం ఏమిటంటే మీ కుళ్లు రాజకీయాల కోసం.. ప్రజలను పావులుగా వాడుకోవటం కోసం 'ప్రజలు చూస్తున్నారు' అన్న మాటను వాడకండి. నిజమైన ప్రజాసేవ, రాష్ట్ర అభివృద్ధి చేసి అప్పుడు ఆ మాట అనండి. ప్రజలు హర్షిస్తారు.

> **ఈ ఉపోద్ఘాతం అంతా ఎందుకు చెప్పాల్సి వచ్చిందంటే- ప్రతిరోజూ టీవీ చానల్స్‌లో పొద్దునా, సాయంత్రం వీక్షకుల చెవులు బద్ధలయ్యే స్వరాలతో వచ్చే హోరాహోరీ చర్చోపచర్చలు వింటూ ఉండటం వల్ల! ఒక రాజకీయ పార్టీని మరో రాజకీయ పార్టీ నిలదీస్తూ, కడిగేస్తున్న సందర్భంలో ఆత్మరక్షణలో పడిన సదరు పార్టీనేత 'ప్రజలు చూస్తున్నారు.. వాస్తవాలు వాళ్లకు తెలుసు' అనేస్తాడు. 'కాగల కార్యం గంధర్వులే చేస్తారు..! అన్నట్టు సాక్ష్యంగా ప్రజలను నిలబెట్టేస్తే తక్కున ఒక పనై పోతుంది, 'డైలాగూ పవర్‌ఫుల్‌గా వస్తుంది' అన్నది తన అభిప్రాయం కావచ్చు.**

- డా. కొఠారి వాణీచలపతి రావు
సెల్: 98492 12448

వయ్యారి కన్నె కన్నుగీటితే..
మన్మథ బాణమే!

'అందలో పందెం వేస్తా.. అందాల మకరందాలు అందెల్లో చిందిస్తా' నంటూ- ఈ అందాలరాశి చిందులు వెయ్యలేదు. ఓసారి 'ఇలా' కన్నుకొట్టింది అంతే- కటారి చూపుల కన్నెపిల్ల ఇంకా టీనేజరే.. విరిసీ విరియని మొగ్గ- ఈమధ్యే కాలేజీలో బికాంలో చేరింది. కానీ నిన్నటి దాకా 'ఇసుకూలు' పిల్లే.. కామ్‌గా వుండే రకం గాదు ''ఒరు ఆడారు లవ్'' అనే మలయాళ సినిమాలో అరంగేట్రం చేస్తోంది. పేరు ప్రియాప్రకాష్ వారియార్- కురువింద పువ్వు లాంటి పిల్ల. 'వాలంటైన్స్ డే' సంబరాల సందర్భంలో - తాను నటిస్తున్న సినిమా 'ఆడారు లవ్' పాటలోని ఓ చిన్న మచ్చుముక్కని పాడుతూ చూపించిందో లేదో మొత్తం జనాలు ఫిదా అయిపోయారు- ఔను, వూరికే, ఇలాపాడుతూ కనబడినదా? కటారి కన్నుల చిన్నది? కిసుక్కున కన్ను కొట్టి.. కన్ను కొట్టి మోహాన్ని సమ్మోహనంగా ఇలా తిప్పింది.. అదీ కేవలం ఫినిష్ ముప్పయి రెండు సెకన్లు పరిగెత్తే చరణం అది - 'మాణిక్యాలరా పూవై..' అంటే ఓ కురువింద పూలబాలా - 'మాణిక్య పువ్వులాంటి' చిన్నదాన, మదీనాలో మహారాణి లాగ విలసిల్లినదానా?.. అంటూ ఆ పిల్లని వర్ణిస్తూ సాగే సుమధుర సంగీతమ్.. ముగ్గులై ఓ నలభై లక్షల జనాలు 'లైకులు' కొట్టి- గూగుల్‌ని తెగ వెర్రిగా వెతికేసి చూశారు - అదీ విషయం - ముంబయిలో పుట్టిన ఈ మలయాళీ కుట్టి అక్కడ కొంత పెరిగి వాళ్ల నాన్నకి ట్రాన్స్‌ఫర్ కాగా ఎర్నాకుళం వచ్చింది- మోడలింగ్, సింగింగు, డ్యాన్సింగ్ వగైరా నేర్చుకుంటూ మొత్తం మీద ఆడిషనులో పైమెట్టెక్కేసింది.. ఈ సినిమా డైరెక్టర్ జనాబ్ ఒమర్ లులూ ఈమెకి మరో నలుగురు అమ్మాయిలతో పాటు ఎగిరి గెంతేసే చక్కని పాత్రని ఇచ్చాడు -

ఇక ఈ పాట సంగతి. దీనిని మలబార్‌లో ఒక ముస్లిం సంప్రదాయ బద్ధమయిన పాటగా - పాడుకుంటూనే ఉంటారుట. కాకపోతే కన్నుగొడుతూ కాదు. పైగా తీస్తున్న ఆ సినిమాకు నిర్మాత దర్శకుడు రచయితా అందరూ మహమ్మదీయులే- కానీ ఈ అందాల బొమ్మ ఇలా కన్నుకొట్టడంతో అసలు చిక్కు వచ్చిపడ్డది. దీని మానానా ఇది వైరల్ అయిపోయింది కాని, ఆ కన్ను గీటుడు తోనే మొదట హైదరాబాద్‌లో ఆనక మిగతా రాష్ట్రాలలో ముస్లిం వర్గాలలో కినుక మొదలైంది. సరే ఇప్పుడు పాట లిటిగేషన్ అయ్యింది. వివాదంతో కోర్టుకి వచ్చింది కనుక మనం- దానిమీద 'నో డిస్కషన్'..

పోలీస్‌స్టేషన్- హైదరాబాద్ ఎఫ్ఐఆర్‌ల నుంచి ముంబయిలో క్రిమినల్ కేసుల దాకా కథ నడుస్తున్నది - దీనితో ప్రియప్రకాష్ నిర్మాత కూడా ముందస్తు జాగ్రత్తగా సుప్రీం కోర్టు తలుపు తట్టారు. కోర్టువారు రెడీగా విచారిస్తామన్నారు- నిర్మాత చెప్పాడు- ఈ సినిమాకి ఇంతవరకు కోటిన్నర ఖర్చు చేశాం అంతా పూర్తి చేసి జూన్‌లో విడుదల చేస్తామనుకుంటున్నాము అని.. అదిట్లుండ నిండు.. ఈ కటారి చిన్నారి - 'సోషల్ మీడియా' అని ముద్దుగా మనం అంటూ వుంటామే మనం- అందులో ఓ చిన్నసైజు సునామీ తీసుకువచ్చింది. 'ఇన్‌స్టాగ్రామ్' నుండి ట్వీట్‌ల లోకంలోకి, ఫేస్‌బుక్‌లోకి- ఈ పిల్ల

వీరాజీయం

veeraji.columnist@gmail.com

అందాల చర్చ గుర్రపుడెక్కలాగ అల్లుకుపోయింది. వీడియో కెమెరాలు- మీడియా ప్రతినిధులు పోటీపడి మరీ పరుగులు తీశారు. వైరల్ అయిపోయిన ఈ చిన్ని జున్ను ముక్కలాంటి కన్ను గీటుడు- ఎంత కిర్రెక్కించింది అంటే - 'ప్రియా మళ్లీ మళ్లీ అలాగే కన్ను గొట్టు ప్రియా..- కనుబొమ్మల్ని మన్మథబాణం లాగ లాగి సంధించు అదీ అలా..' అంటూ- పదేపదే ప్రాధేయపడి ఇంటర్వ్యూలు చేసోస్తోంటే - పాటని కూడా చిన్న పిసరు తన కోకిల సదృశ గాత్రంతో పాడడం - కూడా మొదలెట్టింది పాప- ఈటె ఎందుకు? బాణ మెందుకు? చిన్నదాని చూపు- చాలునూ..

అది చూపా? మన్మథుడు ఎక్కుపెట్టి వదిలిన తూపు.. కాని అటు వైరల్ దెబ్బకి గింజుకుంటున్న కళాభిమానులు ప్రశ్నల వానతో ఆమెకు నీరాజనాలు పడుతూ వుంటే బాలీవుడ్‌లో భూమి కంపించ జొచ్చింది- నిన్నటి దాకా ఫేసుబుక్కు మీద- సన్నీ లియోన్ అనే సెక్స్ బాంబు రాజ్యం ఏలింది. సెర్చ్ కొట్టినా లైక్ కొట్టినా - సన్నీదే పైచెయ్యి.. ఆ తరువాత, దీపిక పదుకొనే.. అప్పుడు కత్రినా కైఫ్ ఇంకా ఇటీవల రంగంలో రంగులు చిమ్ముతున్న - వలపు వొంపుల వయ్యారి అలియా భట్‌దే ముందు స్కోరు... రెండు రోజుల్లో వీళ్ళ రికార్డులని- ప్రియ ఇంతపిసరు మొహమాటం లేకుండా ఓసారి ఇలా కన్నుగీటి - అలా మూతితిప్పి- కనుబొమ్మలతో సమ్మోహక చిత్తరువులు పలికించి - వీళ్లందరినీ లుమ్మ చుట్టి అవతల పారేసింది. పాపం! అవతల ఈమెకి స్పందించే పాత్ర వేసిన కుర్రాడు కూడా-కేకా-లేదా ఈనాటి కుర్రాళ్ళ మాటల్లో చెప్పాలి అంటే - గొప్ప ''తోపే'' కాని ఎవడూ పట్టించుకొనే నాథుడు లేదు.. ఈ ''కన్ను-గన్ను''కి మీ కాలేజీ కుర్రకారంతా- డమాల్ అయిపోయి వెంట పడుతున్నారా?- అడిగాడో- సినీ జర్నలిస్ట్ లేదండీ బాబూ! నేను ఆడపిల్లల కాలేజీకి పోతున్నా... అని ఇలా నవ్వేసింది- ప్రియ/ ''నాకు మోజు? ఎవరిమీద అయినా 'ఇదా?/'.. అబ్బే అట్టి పిచ్చి గిట్టా.. అదేమిలేదండీ- అసలు మా వాళ్లు బయట అడుగే పెట్టనివ్వటం లేదు.. మరి? అని జవాబు. ప్రియా కేవలం కన్ను కొట్టడమే - సోషల్ మీడియాలో యమ సక్సెస్ అయింది కాని ఇంటర్వ్యూలలో- కన్నుగీటక- ఊరుకుందా? రెండు వ్రేళ్ళు- లేత బెండకాయల్లాంటి తన రెండు వేళ్లు - ఇలా తుపాకీలాగ చేసి- ఆ వేలిద్వయాన్ని తన మాణిక్య పుష్పం రేకులవంటి పెదవులకి సుతారంగా తాకించి- ఆ కుర్రది మనవైపు- అంటే కెమెరాలోకి గురిపెట్టి డిష్యుం డిష్యుం అని నవ్వింది- పడ్డారు బోర్లా.. సదరు యూ ట్యూబు వీడియో కూడా అరిగిపోయింది- కాని రసికజన ప్రేక్షక మహాజనం అలసిపోలేదు- ఇట్టి తరి- ''అమ్మాయ్! ప్రియా! మీ డాడీ క్యా కర్తె హైన్? మమ్మీ హ్యాపీనా? నువ్వు ముంబాయి వెళ్ళగలవా/'' లాంటి ప్రశ్నలు వేయడంలో మీడియాకు మొహమాటం వుండదు.. ఈ అందాల బొమ్మలకి కోరికల్ని ఏకరువు పెట్టడానికి విసుగు వుండదు- ఓ మీడియా వాలా ప్రశ్న. దీనికి - మా డాడ్ - సెంట్రల్ ఎక్సైజు- ముంబయిలోనే చదువుకున్నాను- అంటే హిందీ వచ్చును- అని అర్థం. ప్రపంచ సుందరి మానుషి చిల్లర్ మొదట - అబ్బే అబ్బే నేను సినిమాలకు వల్లను అన్నది కాని ఆడువారి మాటలకి అర్థాలే వేరు - కొంచెం గ్యాప్ ఇవ్వాలి- నాకు షారూక్ అంటే ఇష్టం నాకు సల్మాన్ అంటే ఇష్టం అంటూ ''మన్కీ బాత్'' బయటపెడతారు.. ఈమె టాలెంటు చూడగా రెండు వేపులా వాడిగల కత్తిలాగ వున్నది.. మలయాళీ మార్దవం వున్నది, హిందీ తెగువ వున్నది - గడుసుగా చదువుకుంటూ - సిన్మాలల్లో నటిస్తాను- ఎందుకంటే నటన ముఖ్యమే. అందరూ- నన్ను కన్నుగీటే కలువభామా ఏదీ మరొక్కసారి కన్నుగొట్టు అంటున్నారు తప్ప ''నాలోని నటనాభినివేశాన్ని పట్టించోడం లేదు- అందుకని నేను ఒక మంచి నటిని అనిపించుకోవాలి.. దీపిక లాగ రాణించాలి.. అని చెప్పుకు పోయింది.. అంతలేసి కనులు - చిరుగాలికి చెదిరే తమలపాకుల్లాంటి పెదాలమీద చిరు దరహాసం.. కాని కనుబొమ్మలతో బాణాలు వేసిందంటే - ముంబాయి నటీమణుల గుండెల్లో రైలు బండ్లు- ఇప్పుడే...

నిర్మాతకి అయాచితంగా- పబ్లిసిటీ- ఈమెకి అంతులేని ''హైపూ'' రెండు దొరికి పోయాయి- తంతే బోర్లా పడతారు అనుకుంటున్న వాళ్లు ఈ మధ్య సోషల్ మీడియాలో వైరల్ అయిపోయి తిన్నగ పోయి, బూరెల గంపలో పడుతున్నారు- ఓ చిన్న కాంట్రవర్సీ - చిన్న సెంటిమెంటు మీద దెబ్బ - అంటూ గోల చెయ్యడానికి - ఇంటర్నెట్‌ని వాడుకోడానికి చాలు. ఎంతో వెసులుబాటు దొరుకుతోంది. ఓ వర్గం వారు మరో వర్గం వారు 'పద్మావత్' కేసు ఏమయ్యింది? -రాజీ పడతారు- ఈలోగా అభిమానులు ఆయాస పడతారు- కాకపోతే ప్రియ వారియర్ తప్ప మిగతా యూనిట్ అంతా ఒక వర్గం వారే కాబట్టి- ప్రియకిది అత్యంత ప్రియమైన చాన్సు- మెట్లు కట్టుకుని వాటిని ఎక్కుతూ వెళ్లవలసిన ఫీల్డ్స్‌లో ''వారియమ్మ''కి రెక్కలు వచ్చాయి.. ముంబయి ఫీల్డు మీదే కన్నువేసింది గాని- ఈ అందాల మలయాళీ బొమ్మ- తెలుగులో తక్షం 'తత్కాల్' బుకింగ్సు దొరుకుతాయి సుమా.. భాష, యాస ఇవేమీ అక్కరలేదు.. పైగా ఇప్పుడే ఫీల్డులోకి వచ్చి వున్న అన్యభాషా సుందరాంగనలు తెలుగు నేర్చేసుకుంటున్నారు- అదో యాంటీ గ్లామర్ పాయింటు. చిల్లర్లకి, వార్రియర్లకి లక్కీ చాన్సులు ఇస్తే- మన డబ్బింగ్ ఆర్టిస్టులకు దెబ్బ తగలదు. బికినీల ఖర్చు కత్తెర లాగుల పోజుల బెడద తప్పుతాయి- ఔనా?

ప్రియ గడుసుపిల్ల - నటించమంటే అలాగే నటిస్తున్నా అంతే గాని ఏ వర్గంతోనూ నాకు సంబంధం వుండదు - అందర్నీ ఆనందాబ్దిలో ముంచడమే లక్ష్యం. అనేస్తుంది.. ఫినిష్! ఈ మాటలతో పాటు నాట్యం సంగీతం కూడా నేర్చునని కూడా చెప్పింది- ఈ సినిమా అవ్వాలి - సెన్సారు అవ్వాలి- వాళ్ల కోతలు రావాలి - అవి మళ్లీ వివాదాగ్రస్తం కావాలి అబ్బో - స్టేషన్ చాల దూరం వుంది- ఈలోగా - ఈ కన్ను గీటుడు సీను కోర్టువారి చలవతో- సిన్మా నుంచి లేచిపోతుందేమో? చూడాలి.. ఈలోగానే... ఆలసించిన ఆశభంగము..

టుమారో ఈజ్ టూ లేట్.. గెట్ వైరల్!



విశాఖలో జరగనున్న భాగస్వామ్య సదస్సుకు చురుగ్గా జరుగుతున్న ఏర్పాట్లు

భాగస్వామ్య సదస్సుకు ‘హోదా’ సెగ

- స్పష్టత లేని ఎంఓయూలు
- రాష్ట్రానికి పెద్దగా రాని పరిశ్రమలు
- ఆందోళనకు సిద్ధమవుతున్న రాజకీయ పక్షాలు

ఆంధ్రభూమి బ్యూరో

విశాఖపట్నం, ఫిబ్రవరి 21: విశాఖలో ఈనెల 24 నుంచి మూడు రోజులపాటు జరగనున్న భాగస్వామ్య సదస్సు మళ్లీ వివాదాస్పదం కాబోతోంది. 2016, 2017ల్లో విశాఖలో సిఐఐ భాగస్వామ్య సదస్సు జరిగింది. వరుసగా మూడో సంవత్సరం కూడా విశాఖలో ఈ భాగస్వామ్య సదస్సు జరగడం విశేషం. గత ఏడాది జనవరి 27 నుంచి మూడు రోజులపాటు భాగస్వామ్య సదస్సు జరిగింది. అప్పటికే ప్రత్యేక హోదా కోసం వైపీసీ పోరాటం చేస్తోంది. భాగస్వామ్య సదస్సును దృష్టిలో పెట్టుకుని జనవరి 26న విశాఖ బీచ్ రోడ్‌లో వైపీసీ పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించ తలపెట్టింది. దీనికి హాజరుకావల్సిన జగన్‌ను విశాఖ ఎయిర్‌పోర్టులోనే నిలిపివేశారు. ఆ సమయంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసుల పహారా నడుమ గత ఏడాది భాగస్వామ్య సదస్సు జరిగింది. ఈనెల 24 నుంచి జరగనున్న సదస్సు కూడా వివాదాస్పదమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. గడచిన నాలుగు సంవత్సరాలుగా ప్రత్యేక హోదా కోసం వైపీసీ ఒంటరి పోరు సాగిస్తోంది. తాజాగా బీజేపీ, టీడీపీ తప్ప మిగిలిన రాజకీయ పార్టీలన్నీ సంఘటితమై హోదా కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై వత్తిడి తెచ్చేందుకు సిద్ధమవుతున్నాయి. ప్రత్యేక హోదా మంజూరు చేయకపోవడం వలనే రాష్ట్రానికి కొత్త పరిశ్రమలు రావడం లేదన్నది ఉద్యమకారుల వాదన. ఈనేపథ్యంలో విశాఖలో మూడోసారి భాగస్వామ్య సదస్సు జరుగుతోంది. 2016లో విశాఖలో జరిగిన భాగస్వామ్య సదస్సులో సుమారు నాలుగు లక్షల కోట్ల రూపాయలు పెట్టుబడులు వస్తాయని అంచనా వేశారు. ఇందులో 290 ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. అలాగే, 2017లో ఏడు లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వస్తాయని, 586 ఒప్పందాలు కుదిరినట్టు స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. అయితే, ఇందులో ఎన్ని ఒప్పందాలు సాకారమయ్యాయన్నది ప్రభుత్వం స్పష్టత ఇవ్వడంలేదు. కనీసం 2016లో జరిగిన ఒప్పందాలకు సంబంధించి ఎన్ని కొత్త పరిశ్రమలు వచ్చాయన్నదానిపై ప్రభుత్వం కచ్చితంగా చెప్పలేకపోతోంది. అన్నింటికీ మించి, భాగస్వామ్య సదస్సు జరిగిన విశాఖ జిల్లాలో ఒక్క కొత్త పరిశ్రమ కూడా రాకపోవడం గమనార్హం. ఎంఓయూలు వాస్తవ రూపం దాల్చడానికి ఎంతకాలం పడుతుందో ఎవ్వరికీ తెలియదు. వాస్తవానికి విభజన చట్టంలో పేర్కొన్న విధంగా హోదా వచ్చి ఉంటే, కొత్త పరిశ్రమలకు భారీగా రాయితీలు వస్తాయి. ఆంధ్రప్రదేశ్‌కు హోదా వస్తుంది, దాంతోపాటు రాయితీలు కూడా వస్తాయని భావించిన పారిశ్రామికవేత్తలు వాటికోసం ఎదురు చూసి, హోదా రాదని తేలిపోవడంతో ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలో విశాఖలో జరిగే మూడవ భాగస్వామస్య సదస్సు జరుగుతోంది. ఓపక్క అన్ని రాజకీయ పార్టీలూ హోదా కోసం పోరాడుతూ సదస్సును అడ్డుకోడానికి ప్రయత్నిస్తున్నాయి. ఈ సదస్సుకు సుమారు 39 దేశాల నుంచి ప్రతినిధులు వస్తున్నారు. సదస్సు భగ్నం కాకుండా జాగ్రత్తలు తీసుకోవడమే కాకుండా, వివిధ దేశాల నుంచి ఈ సదస్సుకు హాజరవుతున్న పారిశ్రామికవేత్తలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భరోసా ఇవ్వాల్సి ఉంటుంది. ఇందుకోసం సదస్సులోనైనా, సదస్సుకు ముందైనా హోదాపై చంద్రబాబు స్పష్టమైన ప్రకటన చేయాల్సి ఉంటుంది.

కేజ్రీ సర్కార్‌ను డిస్మిస్ చేయండి

అధికారంలో కొనసాగే అర్హత లేదు ▪ ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్‌కు బీజేపీ డిమాండ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: ఆప్ ప్రభుత్వానికి అధికారంలో కొనసాగే అర్హత లేదని, తక్షణం డిస్మిస్ చేయాలని బిజెపి ఢిల్లీ శాఖ డిమాండ్ చేశారు. ఢిల్లీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అన్షు ప్రకాష్‌పై దాడి ఘటనపై బుధవారం బిజెపి ప్రతినిధి బృందం లెఫ్టినెంట్ జనరల్‌ను కలిసింది. ఈ దాడి ఘటనలో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా పరోక్ష ప్రమేయం ఉందని ఢిల్లీ అసెంబ్లీ ప్రతిపక్ష నేత వీరేందర్ గుప్తా నాయకత్వంలో కలిసిన ఈ బృందం లెఫ్టినెంట్ జనరల్ దృష్టికి తీసుకువెళ్లింది. ఆప్ ఎమ్మెల్యేలు దాడి చేస్తున్న సమయంలో తనను రక్షించేందుకు ఏ ఒక్కరూ అడ్డుపడలేదని సీఎస్ తన ఫిర్యాదులో పేర్కొన్నారని, దీన్ని బట్టి ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యేలందరూ ఈ నేరంలో సమాన భాగస్వాములేనని వీరేందర్ గుప్తా పేర్కొన్నారు. ప్రశ్నించేవారిపై దాడి చేసి అధికారుల్లో భయాందోళనలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. అధికారులపై అధికార పార్టీ నేతలే దాడి చేయడం, ముఖ్యమంత్రి కేజ్రీవాల్ సమక్షంలోనే జరగడం సిగ్గుచేటనీ, ఈ ప్రభుత్వానికి అధికారంలో కొనసాగే అర్హత లేదని తక్షణం డిస్మిస్ చేయాలని బిజెపి నేతలు డిమాండ్ చేశారు. కాగా, ఈ దాడికి సంబంధించి ఇప్పటికే ఎఫ్ఐఆర్ నమోదు చేసిన ఢిల్లీ పోలీసులు ఇద్దరు ఆప్ ఎమ్మెల్యేలు అమనతుల్లాఖాన్, ప్రకాశ్ జర్వాల్‌ను అరెస్టు చేశారు.

అధికారులకు రక్షణ కల్పించండి: కాంగ్రెస్

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిపై దాడి నేపథ్యంలో ప్రభుత్వ అధికారులకు తక్షణం రక్షణ కల్పించాలని ఢిల్లీ కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఢిల్లీ కాంగ్రెస్ అధ్యక్షుడు అజయ్ మాకెన్, మాజీ ముఖ్యమంత్రి షీలాదీక్షిత్ నేతృత్వంలోని ఓ బృందం బుధవారం లెఫ్టినెంట్ గవర్నర్‌ను కలిసింది. ఈ ఘటనకు బాధ్యులైన ఎమ్మెల్యేలపై కఠిన చర్యలు తీసుకోవాలని, ముఖ్యమంత్రి కేజ్రీవాల్ క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. సాక్షాత్తూ సీఎస్‌పైనే దాడి చేయడం దురదృష్టకర సంఘటన అనీ, ఈ దాడివల్ల పాలనాపరమైన సంక్షోభం తలెత్తిందని లెఫ్టినెంట్ గవర్నర్ దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం విలేఖరులతో మాట్లాడుతూ అధికారులకు రక్షణ కల్పించాల్సిన అవసరాన్ని లెఫ్టినెంట్ గవర్నర్ దృష్టికి తీసుకువెళ్లామని తెలిపారు. పాలనాపరమైన వ్యవహారాల్లో రాజకీయ జోక్యం ఉండకూడదని, అలాగే అధికారుల గౌరవానికి భంగం కలుగకుండా చూడాలని కోరినట్లు కాంగ్రెస్ నేతలు వెల్లడించారు. ఎలాంటి భయాందోళనలు లేకుండా అధికారులు పని చేసే వాతావరణాన్ని కల్పించాలని కోరామన్నారు. ప్రభుత్వ వైఫల్యాలనుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు ఇలాంటి ఘటనలకు ఉద్దేశపూర్వకంగా పాల్పడటం కేజ్రీవాల్ సర్కార్‌కు అలవాటేనని ఆరోపించారు. సీఎస్‌పై దాడికి సంబంధించి కేజ్రీవాల్ ప్రభుత్వం క్షమాపణ చెప్పాల్సిందేనని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన అవసరం ఉందని మాజీ ముఖ్యమంత్రి షీలాదీక్షిత్ డిమాండ్ చేశారు.

ప.గో.లో నకిలీ కరెన్సీ ముఠా హల్‌చల్

- పోలీసులపై తిరగబడిన నిందితులు
- గాలిలోకి కాల్పులు జరిపిన ఎస్సై
- ఇద్దరి అరెస్టు.. నకిలీ కరెన్సీ స్వాధీనం

దేవరపల్లి, ఫిబ్రవరి 21: నకిలీ నోట్ల ముఠాకు చెందిన ఇద్దరు సభ్యులను పశ్చిమ గోదావరి జిల్లా దేవరపల్లి పోలీసులు బుధవారం సాయంత్రం సినీఫక్కీలో అదుపులోకి తీసుకున్నారు. గ్రామంలోని ఒక హోటల్ వద్ద నకిలీ నోట్లు మార్చడానికి ప్రయత్నిస్తున్న వారిని అదుపులోకి తీసుకోవడానికి ప్రయత్నించిన పోలీసులపై వారు తిరగబడటంతో గాలిలోకి రెండు రౌండ్లు కాల్పులు సైతం జరపాల్సివచ్చింది. వివరాలివావున్నాయి... దేవరపల్లి గ్రామంలోని గోపాలపురం రోడ్డులోని ఒక హోటల్ వద్ద తూర్పు గోదావరి జిల్లాకు చెందిన శృంగారపు చిట్టిబాబు, కృష్ణా జిల్లాకు చెందిన పోతేపల్లి కిశోర్‌బాబు బుధవారం సాయంత్రం నకిలీ నోట్లు మార్చడానికి ప్రయత్నించారు. ఈ సమాచారం అందడంతో దేవరపల్లి ఎస్సై పి వాసు తన సిబ్బందితో అక్కడకు చేరుకుని వారిని అదుపులోకి తీసుకునే ప్రయత్నంచేశారు. ఈ నేపథ్యంలో నిందితులిద్దరూ పోలీసులపై తిరగబడ్డారు. దీనితో ఆత్మరక్షణ కోసం ఎస్సై వారు రెండు రౌండ్లు గాలిలోకి కాల్పులు జరిపారు. ఎట్టకేలకు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా వారి వద్ద నుండి రూ.2,10,900 విలువైన నకిలీ రూ.2000, రూ.500 రూ.200, రూ.100 నోట్లు స్వాధీనం చేసుకున్నారు. కొవ్వూరు డిఎస్పీ వెంకటేశ్వరరావు, సిఐ శరత్ రాజ్‌కుమార్, క్రైమ్ ఎస్ఐ సోమసుందరం, ఎస్సై పి వాసు నిందితులను విచారిస్తున్నారు. వీరి వెనుక బంగ్లాదేశ్‌కు చెందిన ముఠా ఉండవచ్చని అనుమానంతో సమగ్ర దర్యాప్తు చేస్తున్నామని కొవ్వూరు డిఎస్పీ వెంకటేశ్వరరావు తెలిపారు. పూర్తి వివరాలు గురువారం తెలియజేస్తామన్నారు.

మాతృభాషను పరిరక్షించుకుందాం

యార్లగడ్డ లక్ష్మీప్రసాద్

ఆంధ్రభూమి ప్రతినిధి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: మాతృభాష పరిరక్షణ కోసం ప్రజలతో పాటు ప్రభుత్వాల తీరులోనూ మార్పు రావాలని ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ అన్నారు. ఢిల్లీలో ఏపీ-తెలంగాణ భవన్ సంయుక్త అధ్యర్యలో జరిగిన తెలుగు మాతృభాష దినోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. లక్ష్మీప్రసాద్ విలేఖరులతో మాట్లాడుతూ తెలుగు భాషను నిర్లక్ష్యం చేస్తే దాని ఔన్నత్యం దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగు రాష్ట్రాలలో ప్రచార, శిలాఫలకాల్లో ఆంగ్లంతో పాటు తెలుగు కూడా తప్పని సరిగా ఉండాలని ఆయన సూచించారు. శిలాఫలకాలపై తెలుగు తప్పనిసరి అని ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు అమలుకావడం లేదని ఆయన వాపోయారు.



విలేఖరులతో మాట్లాడుతున్న లక్ష్మీప్రసాద్



ఢిల్లీలో బుధవారం ‘ఎన్ఆర్ చందూర్ జగతి’ పురస్కారాన్ని జర్నలిస్టు రాజు నరిశెట్టికి అందజేస్తున్న ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు

సత్యానికి దగ్గరగా.. సంచలనాలకు దూరంగా!

అదే నిజమైన జర్నలిజం: ఉప రాష్ట్రపతి వెంకయ్య

ఆంధ్రభూమి ప్రతినిధి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: మీడియా పారదర్శకత, విశ్వసనీయత కనబరిస్తే జర్నలిజంపై ప్రజల్లో నమ్మకం కలుగుతుందని ఉప రాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం సందర్భంగా తెలుగు జర్నలిజంలో అత్యున్నత ప్రతిభ కనబరిచిన పాత్రికేయులకు ఇచ్చే ‘ఎన్ ఆర్ చందూర్ జగతి’ పురస్కారాన్ని ఈ ఏడాది అంతర్జాతీయ జర్నలిస్టు రాజు నరిశెట్టికి ఆయన అందజేశారు. అవార్డును పొట్టి శ్రీరాములు స్మారక సమితి, చందూర్ కుటుంబ సభ్యులు సంయుక్తంగా ఏటా అవార్డును అందిస్తున్నారు. బుధవారం ఢిల్లీలోని ఉపరాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రాజు నరిశెట్టికి అవార్డు ప్రదానం చేశారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి లావు నాగేశ్వరరావు, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ పాల్గొన్నారు. వెంకయ్యనాయుడు మాట్లాడుతూ రాజు పత్రికా రంగంలో రాజులా వెలుగుతున్న నరిశెట్టికి అవార్డు ఇవ్వడం సంతోషంగా ఉందని చెప్పారు. జర్నలిజంలో విలువలు అవసరమని, మంచి ప్రమాణాలు పాటిస్తే ప్రభుత్వం నియంత్రణ అవసరమే ఉండదని అన్నారు. జర్నలిజంలో సత్యానికి దగ్గరగా సంచాలనానికి దూరంగా ఉండాలన్నదే తన అభిప్రాయంగా ఉప రాష్ట్రపతి వ్యాఖ్యానించారు. పారదర్శకత, విశ్వసనీయత జర్నలిజంపై నమ్మకం పెరుగుతుందని చెప్పారు. దేశంలో చాలా కుంభకోణాలను బయటకు తీసుకొచ్చింది పత్రికలేనని ఉప రాష్ట్రపతి పేర్కొన్నారు. జస్టిస్ లావు నాగేశ్వరావు మాట్లాడుతూ పత్రికలు ప్రజలకు, ప్రభుత్వాలకు మధ్య వారధిగా వ్యవహరిస్తున్నాయని శ్లాఘించారు. మీడియాకు స్వేచ్ఛ ఎంత అవసరమో అలాగే స్వీయ నియంత్రణ కూడా అంతకంటే ఎక్కువ అవసరమని స్పష్టం చేశారు.

ఎల్‌ఓసీ వద్ద పాక్ హెలికాప్టర్ చక్కర్లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: జమ్మూకాశ్మీర్‌లోని ఎల్‌ఓసీ వద్ద పాకిస్తాన్ సైనిక హెలికాప్టర్ ఎంఐ-17 చక్కర్లు కొట్టింది. ఆక్రమిత కాశ్మీర్ సరిహద్దును ఆనుకుని నియంత్రణ రేఖను దాటి భారత గగనతలంలోకి వచ్చేసింది. బుధవారం ఉదయం 9.45-10 గంటల ప్రాంతంలో 300 మీటర్ల లోపలికి హెలికాప్టర్ చొచ్చుకొచ్చినట్టు అధికారులు ధ్రువీకరించారు. ఎంఐ-17 కొన్ని సెకన్లపాటే చక్కర్లుకొట్టి వెంటనే వెనక్కి వెళ్లిపోయింది. హెలికాప్టర్ విషయాన్ని పాకిస్తాన్ దృష్టికి తీసుకెళ్లినట్టు సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

కొఠారీ చుట్టూ ఉచ్చు!

రొటోమాక్ యజమానిని విచారించిన సీబీఐ ▪ దేశం విడిచి పారిపోకుండా అప్రమత్తం చేసిన ఈడీ



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: బ్యాంకులకు 3,695 కోట్ల రూపాయల కుచ్చుటోపీ పెట్టిన ప్రముఖ పెన్నుల కంపెనీ రొటోమాక్ యజమాని విక్రమ్ కొఠారీ చుట్టూ ఉచ్చు బిగుసుకుంటోంది. దేశ రాజధాని ఢిల్లీలోని సీబీఐ ప్రధాన కేంద్రంలో విచారించారు. ఏడు జాతీయ బ్యాంకుల కన్సార్టియంకు కొఠారీ వేలాది రూపాయలు ఎగవేసినట్టు అధికారులు వెల్లడించారు. తొలుత కాన్పూర్‌లోని రొటోమాక్ కంపెనీ, నివాసంలో అతడిని ప్రశ్నించి సీబీఐ ప్రధాన కేంద్రానికి తీసుకొచ్చారు. విక్రమ్‌ను ప్రశ్నించినట్టు సీబీఐ వర్గాలు తెలిపాయి. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలు దారిమళ్లించారని కొఠారీతోపాటు ఆయన భార్య సాధన, కుమారుడు రాహుల్, రొటోమాక్ గ్లోబల్ ప్రవేట్ లిమిటెడ్ డైరెక్టర్లపై కేసులు నమోదు చేశారు. కన్సార్టియం బ్యాంకుల్లో ఒకటైన బ్యాంక్ ఆఫ్ బరోడా మోసాన్ని గ్రహించి సీబీఐకి ఫిర్యాదు చేయడంతో ఎఫ్ఐఆర్ నమోదయింది. ఈ నెల 18న ఎఫ్ఐఆర్ నమోదయ్యేనాటికి 3,695 కోట్ల రూపాయలేనని భావించగా విచారణ నిమిత్తం అది 8000 కోట్ల వరకూ ఉండవచ్చని తెలిసింది. వెంటనే రంగంలోకి దిగిన సీబీఐ రొటోమాక్ గ్లోబల్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో సోదాలు జరిపింది. బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అలహాబాద్ బ్యాంక్, ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ నుంచి కొఠారీ రుణాలు తీసుకున్నట్టు విచారణలో తేలింది.

అలాగే అప్రమత్తమైన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ విక్రమ్ కొఠారీ, కుటుంబ సభ్యులు దేశం విడిచివెళ్లిపోకుండా విమానాశ్రయాలు, పోర్టులను అప్రమత్తం చేసింది. ఉత్తరప్రదేశ్‌లోని పలు నగరాల్లో ఈడీ సోదాలు నిర్వహించింది. మనీలాండరింగ్ కింద విక్రమ్ కొఠారీపై ఈడీ కేసు నమోదుచేసింది.

‘సిట్’కు కేంద్రం విముఖత

పీఎన్‌బీ స్కామ్‌పై సుప్రీం కోర్టులో పిల్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: దేశంలో సంచలనం రేపిన పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) కుంభకోణం కేసు దర్యాప్తునకు ప్రత్యేక విచారణ బృందం (సిట్) ఏర్పాటు చేయాల్సిన అవసరం లేదని సుప్రీం కోర్టుకు కేంద్రం స్పష్టం చేసింది. వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ, అతడి అంకుల్ ఛోక్సీలు పీఎన్‌బీకి 11,400 కోట్ల రూపాయల మోసం చేశారని, దీనిపై సిట్ ఏర్పాటుకు ఆదేశించాలంటూ సుప్రీం కోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా నేతృత్వంలో జస్టిస్ ఎంఎ ఖన్వీకర్, జస్టిస్ డివై చంద్రచూడ్‌తో కూడిన ధర్మాసనం ముందుకు పిల్ విచారణకు వచ్చింది. పీఎన్‌బీ కుంభకోణంపై ఇప్పటికే ఎఫ్ఐఆర్ నమోదు కావడం, దర్యాప్తు ప్రారంభం కావడం జరిగిపోయింది, దీనిపై సిట్ వేయాల్సిన అవసరం ఎంతమాత్రం లేదని కేంద్రం స్పష్టం చేసింది. అలాగే స్కామ్‌కు సంబంధించి చెప్పదలకున్నది ఏదైనా ఉండే మార్చి 16న వింటామని బెంచ్ తెలిపింది. పిల్‌ను వినీత్ ధండా అనే న్యాయవాది దాఖలు చేశారు. వివిధ కారణాల దృష్ట్యా సిట్ ఏర్పాటు సాధ్యం కాదని కేంద్రం తరఫున వాదించిన అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్ బెంచ్‌కు చెప్పారు. దర్యాప్తు కూడా ముమ్మరంగా సాగుతున్న దశలో మరో విచారణ కమిటీ అర్థంలేదని ఆయన అన్నారు. పిల్‌లో పంజాబ్ నేషనల్ బ్యాంక్, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆర్థిక మంత్రులు, న్యాయశాఖ మంత్రులను ప్రతివాదులుగా చేర్చారు. వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ, ఆయన కుటుంబ సభ్యులను స్వదేశానికి రప్పించేందుకు చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని ఆదేశించాలంటూ పిటిషనర్ కోరారు. సీబీఐ ఇప్పటికే రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసింది. జనవరి 1న ఒకటి, ఇటీవలే రెండో ఎఫ్ఐఆర్ నమోదుచేశారు.

వాణిజ్యభూమి

మహేశ్వరం మండలంలో విప్రో తయారీ యూనిట్

★ మంత్రి కేటీఆర్‌తో విప్రో ప్రతినిధి రిషద్ ప్రేమ్‌జీ భేటీ
★ 220 కోట్లు పెట్టుబడి పెడతామని వెల్లడి



తెలంగాణ పరిశ్రమల శాఖ మంత్రి కేటీరామారావును కలిసిన విప్రో సంస్థ చీఫ్ స్ట్రాటజిక్ ఆఫీసర్ రిషద్ ప్రేమ్‌జీ

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 21: తెలంగాణకు మరో మెగా ప్రాజెక్టు రానుంది. తెలంగాణలో విప్రో సంస్థ తన మాన్యు ఫ్యాక్చరింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయనుంది. వరల్డ్ ఐటి కాంగ్రెస్ సందర్భంగా విప్రో సంస్థ చీఫ్ స్ట్రాటజిక్ ఆఫీ సర్ రిషద్ ప్రేమ్‌జీతో పరిశ్రమల శాఖా మంత్రి కేటీరామా రావు సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో తాము తెలంగాణలో ఒక తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు మంత్రికి రిషద్‌ప్రేమ్‌జీ తెలిపారు. విప్రో కన్స్యూమర్స్ కేర్ ప్రోడక్ట్ విభాగం ఆధ్వర్యంలో సబ్బులు, ఇతర సౌందర్య సాధనాల తయారీ కేంద్రాన్ని మహేశ్వరం మండలంలో ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఇందుకోసం 220 కోట్ల రూపాయిల పెట్టుబడిని విప్రో పెట్టనుంది. మొత్తం 40 ఎక రాల్లో నిర్మించే ఈ తయారీ పరిశ్రమ నేరుగా 300 మందికి పరోక్షంగా మరో 200 మందికి ఉపాధి కల్పిస్తుంది. ఇప్ప టికే విప్రో సంస్థ ఇతర విభాగాలు తెలంగాణలో పెద్ద ఎత్తున కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని, నూతనంగా ఈ తయారీ యూనిట్ ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చిన విప్రో సంస్థకు మంత్రి కేటీ రామారావు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. టిఎస్ ఐపాస్ ద్వారా ఇప్పటికే అనేక మెగా ప్రాజెక్టులకు అనుమతి ఇచ్చామని, ఇపుడు మరో మెగా ప్రాజెక్టు తెలంగాణకు రావడం, రాష్ట్రంలోని పెట్టుబడుల అనుకూల వాతావరణానికి అద్దం పడుతుం దని అన్నారు. దీంతో పాటు తెలంగాణలో ఉన్న పలు ఇతర పెట్టుబడి అవకాశాలను మంత్రి ఈ సందర్భంగా రిషద్ ప్రేమ్‌జీకి వివరించారు. ద్వితీయ శ్రేణి నగరాల్లోకి ఐటి పరిశ్రమ తీసుకుపోయేందుకు ప్రయత్నం చేస్తుందని, ఇందుకోసం ఇప్పటికే పలు జిల్లాల్లో ఐటి టవర్ల నిర్మాణం, టాస్క్ ప్రాంతీయ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని రిష ద్‌కు మంత్రి వివరించారు. వరంగల్ పట్టణంలో సైయింట్ తమ కార్యకపాలను నిర్వహిస్తోందని, తాజాగా టెక్ మహేంద్ర క్యాంపస్ ఏర్పాటు చేసేందుకు కూడా ఆ సంస్థ ముందుకు వచ్చిందని మంత్రి తెలిపారు. వరంగల్‌లో సంస్థల ఏర్పాటుకు ముందుకు రావాలని విప్రోను కోరారు. టెక్నాలజీ, ఇన్నోవేషన్ రంగంలో తెలంగాణ దేశంలోనే ముందుకు వరుసలో ఉందని, టిహబ్, టి వర్క్ వంటి కార్యక్రమాలు మంచి ఫలితాలు ఇస్తున్నా యని కేటీఆర్ చెప్పారు. త్వరలోనే మహిళా ఇంక్యుబేటర్ వి-హబ్ ఏర్పాటు చేస్తామని, అందులో విప్రో భాగ స్వామ్యం కావాలని కేటీఆర్ కోరారు.

బలపడిన స్టాక్ మార్కెట్లు

141 పాయింట్లు పెరిగిన సెనె్సక్స్ ■ 37 పాయింట్లు పుంజుకున్న నిఫ్టీ
■ ఐటీ, ప్రభుత్వ రంగ బ్యాంకుల షేర్లలో కొనుగోళ్ల జోరు


ముంబయి, ఫిబ్రవరి 21: మూడు వరుస సెషన్లలో నష్టాల పాలయిన దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం బలపడినాయి. ఐటీ, ప్రభుత్వ రంగ బ్యాంకుల షేర్లలో కొనుగోళ్లు బాగా జరగడంతో బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) సెనె్సక్స్ 141 పాయింట్లు పుంజు కుంది. వీటితో పాటు ఎఫ్‌ఎంసీజీ, చమురు-సహజ వాయువు రంగాల షేర్ల ధరలు పెర గడం కూడా బుధవారం కీలక సూచీలు పుంజు కోవడానికి దోహదపడింది. ఆసియా మార్కె ట్లలో నెలకొన్న పటిష్ఠమైన స్థితితో పాటు ప్రపంచ మార్కెట్‌లో ముడి చమురు ధరలు తగ్గడం కూడా బుధవారం దేశీయ మార్కెట్లు బలపడటానికి ప్రధాన కారణంగా నిలిచింది. ఫిబ్రవరి నెల ఎఫ్అండ్ఓ కాల పరిమితి గురు వారంతో ముగియనుండటంతో స్పెక్యులేటర్లు షార్ట్-కవరింగ్‌కు పూనుకోవడం కూడా కీలక సూచీలు పుంజుకోవడానికి తోడ్పడింది. సెనె్సక్స్ ఇంట్రా-డేలో 33,911.36 పాయింట్ల గరిష్ఠ స్థాయిని తాకి, తరువాత మదుపరులు లాభాల స్వీకరణకు పూనుకోవడం వల్ల 33,702.50 పాయింట్ల కనిష్ఠ స్థాయికి దిగజా రింది. చివరకు క్రితం ముగింపుతో పోలిస్తే 141.27 పాయింట్ల (0.42 శాతం) లాభంతో 33,844.86 పాయింట్ల వద్ద ముగిసింది. సెనె్సక్స్ క్రితం మూడు సెషన్లలో కలిపి 593.88 పాయింట్లు పడిపోయింది.


నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) నిఫ్టీ బుధవారం 37.05 పాయింట్లు (0.36 శాతం) పెరిగి, 10,397.45 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రా-డేలో ఈ సూచీ 10,426.10-10,349.60 పాయింట్ల మధ్య కదలాడింది. ఇదిలా ఉండగా, మంగళవారం దేశీయ సంస్థాగత మదుపరులు నికరంగా రూ. 1,437.24 కోట్ల విలువయిన షేర్లను కొనుగోలు చేయగా, ఫారిన్ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు రూ. 850.35 కోట్ల విలువయిన షేర్లను విక్రయించారు.


2018-19 ఆర్థిక సంవత్సరంలో ఎగుమతుల ఆదాయం 7-9 శాతం పెరుగుతుందన్న నాస్కామ్ అంచనా సానుకూలంగా పనిచేయ డంతో బుధవారం ఐటీ కంపనీల షేర్ల విలువ పెరిగింది. ఐటీ దిగ్గజం టీసీఎస్ అత్యధికంగా 3.33 శాతం లాభపడింది. ఐటీసీ షేర్ విలువ రెండు శాతం పెరగగా, ఓఎన్‌జీసీ 1.66 శాతం లాభపడింది. లాభపడిన ఇతర సంస్థల్లో ఎస్‌బీఐ, ఇన్ఫోసిస్, రిల్, కోటక్ బ్యాంక్, యెస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్, యాక్సిస్ బ్యాంక్, మారుతి సుజుకి, ఐసీఐసీఐ బ్యాంక్, భారతి ఎయిర్‌టెల్, విప్రో, డాక్టర్ రెడ్డీస్, కోల్ ఇండియా ఉన్నాయి.

వీటి షేర్ల విలువ 1.28 శాతం పెరిగింది. పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)ను ముంచిన కేసులో అభియోగాలు ఎదుర్కొం టున్న గీతాంజలి జెమ్స్ షేర్ల విలువ వరుసగా ఆరో సెషన్ బుధవారం కూడా పడిపోయింది. కాగా, అయిదు వరుస సెషన్లలో 56 శాతం పడిపోయిన పీఎన్‌బీ షేర్ విలువ ఆరో రోజు బుధ వారం 0.47 శాతం పెరిగింది.

బుధవారం నష్టపోయిన ఇతర సంస్థల్లో సన్ ఫార్మా, ఇండస్‌ఇండ్ బ్యాంక్, టాటా స్టీల్, టాటా మోటార్స్, బజాజ్ ఆటో, ఎన్‌టీపీసీ, ఎల్ అండ్‌టీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, హెచ్‌యూఎల్, పవర్ గ్రిడ్, ఆసియన్ పెయింట్స్, ఎంఅండ్ఎం ఉన్నాయి.







దేశీయ భద్రతకు జాతీయ ఏకీకృత వ్యూహాలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరిన అసోచామ్

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 21: ప్రస్తుత వివిధ రాష్ట్రాల్లో అంతరంగికభద్రతకు ఇవిధ రకాలైన వ్యూహాలు, సొల్యూ షన్స్ ఉన్నాయని, వీటి వల్ల గందరగోళం నెలకొని ఉందని, జాతీయ స్థాయిలో భద్రతకు ఏకీకృత వ్యూహ విధానం అమలు చేయాలని అసోచామ్ అనే జాతీయ వాణిజ్య సంస్థ కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలను కోరింది. పారద ర్శకంగా, సమగ్రంగా మార్గదర్శకాలను, విధానాలను దేశీయ భద్రత నిమిత్తం రూపొందించాలని అసోచామ్ హోంల్యాండ్ సెక్యూరిటీ డిజిటల్ ఫ్రాంటియర్స్ పేరిట విడుదల చేసిన విధానపత్రంలో పేర్కొంది. ప్రస్తుతం ఇంధనం, టెలికాం, రవాణా తదితర రంగాల్లో అనేక సవాళ్లు ఎదురవుతున్నాయని, సరైన భద్రత విధానం లేనందు వల్ల దేశంలో సైబర్ భద్రతకు విఘాతం కలుగుతోంద న్నారు. స్మార్ట్ హోంల్యాండ్ ప్రొక్యూర్‌మెంట్ విధానాన్ని ప్రవేశపెట్టాలన్నారు. సరైన టెక్నాలజీ ద్వారా ఇంటెలిజెన్స్ విధానాన్ని అమలుచేస్తూ సేకరించిన డాటాను విశ్లేషించే విధానం అమలులోకి రావాలన్నారు. పౌరుల భద్రత, సుర క్షితానికి అనిలిటిక్స్‌ను వినియోగించాలన్నారు. హై ఎండ్ సైబర్ ల్యాబ్స్, సైబర్ సెక్యూరిటీని పెంచాలన్నారు. దేశ వ్యాప్తంగా అన్ని పారిశ్రామిక వాడల్లో సైబర్ ల్యాబ్స్ ఉండాలన్నారు.

దీని వల్ల ఆర్థిక రంగం, ప్రభుత్వ శాఖలకు ఎప్పటికప్పుడు ఎదురయ్యే సవాళ్లను అధిగమించవచ్చన్నారు. సైబర్ క్రైమ్ ఇన్వెస్టిగేటర్లు, ప్రొఫెషనల్స్‌కు హోంల్యాండ్ సెక్యూరిటీపై శిక్షణ ఇవ్వాలన్నారు.

శ్రీలంక బస్సులో పేలుడు

19 మందికి తీవ్ర గాయాలు

కొలంబో, ఫిబ్రవరి 21: శ్రీలంకలో బుధవారం ఒక బస్సుల్లో భారీ పేలుడు సంభవించడంతో 19 మంది తీవ్రంగా గాయపడ్డారు. వారిలో 12 మంది ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్‌కు చెందినవారు ఉన్నారు. అయితే పేలుడుకు కారణాలు ఏమిటన్నది ఇంకా తెలియరాలేదు. ఉగ్రవాద చర్యకూ అవకాశం లేకపోలేదని మిలిటరీ అధికారి ఒకరు తెలిపారు. బస్సు దియంతలావా నుంచి జాఫ్నాకు వెళుతుండగా, ఉదయం 5.45 గంటల సమయంలో పేలుడు సంభవించిందని మిలిటరీ ప్రతినిధి బ్రిగేడియర్ సుమిత్ అటపట్టు విలేఖరులకు తెలిపారు. తీవ్రంగా గాయడిన వారిలో ఏడుగురు ఆర్మీ, ఐదుగురు ఎయిర్ ఫోర్స్ సిబ్బంది ఉన్నట్లు ఆయన తెలిపారు. మిగతా వారంతా సాధారణ పౌరులేనని ఆయన వివరించారు. పేలుడు ధాటికి బస్సు చాలా భాగం ధ్వంసమైంది. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ సంఘటనపై దర్యాప్తు జరుగుతోందని అటపట్టు తెలిపారు. శ్రీలంక గతంలో ఎల్‌టీటీఈ ఉగ్రవాదుల దాడులతో భీతిల్లిన విషయం తెలిసిందే.

జాఫ్నా కేంద్రంగా లిబరేషన్ టైగర్స్ ఆఫ్ తమిళ ఈలం (ఎల్‌టీటీఈ) 30 ఏళ్లపాటు జరిపిన వేర్పాటువాద పోరాటంలో లక్షలాది మంది ప్రాణాలు కోల్పోయారు. ఎల్‌టీటీఈ అధినేత వేలుపిళ్ళై ప్రభాకరన్ మరణానంతరం ఉగ్రవాద కార్యకలాపాలకు ఫుల్‌స్టాప్ పడింది.

1వ పేజీ తరువాయి

ప్యాకేజీపై యూ టర్న్?

సాధించి తాము అధికారంలోకి రానున్నామని, అప్పుడు 10 సంవత్సరాలు ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తామని బిల్లును ఆమోదించారు. ఆ తరువాత ఎన్నికలు రావడం కాంగ్రెస్ ప్రతిపక్షంలోకి, బీజేపీ అధికారంలోకి రావడం జరిగిపోయాయి. ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ బీజేపీతో చేతులు కలిపి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చింది. ఆ తరువాత కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వంలో కూడా తమ పార్టీ ఎంపీలు అశోక్ గజపతిరాజు, సుజనా చౌదరిని మంత్రులుగా ప్రతిపా దించింది. ఆ తరువాత రాష్ట్ర ప్రయోజనాలపై సంప్రదింపులు జరిపిన అనంతరం రెండేళ్ల తరువాత రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వలేమని చావుకబురు చల్లగా చెప్పారు. అందుకు ప్రత్యామ్నాయంగా ప్రత్యేక ప్యాకేజీని 10 సంవత్సరాలు అమలు చేస్తామని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. దీనిపై పార్టీ నేతలతో చర్చించిన చంద్రబాబు ప్యాకేజీకి అంగీకరించి తక్షణం చట్టబద్ధత కల్పించాలని కోరారు. ఈ విషయంలో కూడా కేంద్రం జాప్యం చేస్తూ చివరి బడ్జెట్ సమావేశాల్లో కూడా ప్యాకేజీకి చట్టబద్ధత కల్పించకపోవడం, అందుకు అవసరమైన నిధులు ఇవ్వకపోవడంతో కేంద్రం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ పార్లమెంటులో నిరసన కార్యక్రమం చేపట్టారు. సమావేశాలు జరుగకుండా అంతరాయం కలిగించడమే కాకుండా చివరకు ప్రధాని నరేంద్రమోడీ ప్రసంగాన్ని కూడా అడ్డుకునే వరకు వెళ్లింది.

దీంతో బీజేపీ అధినేత అమిత్‌షా, కేంద్రమంత్రులు రాజ్‌నాథ్, అరుణ్‌జైట్లీ టీడీపీకి చెందిన తమ సహచరమంత్రి సుజనా చౌదరి, పార్టీ ఎంపీలతో పలుదఫాలు సమావేశమై దిద్దుబాటు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా రాష్ట్రానికి రావాల్సిన రెవెన్యూ బకాయిలు తక్షణం విడుదల చేయడం, హోదాకు బదులు ప్రకటించిన ప్యాకేజీ ద్వారా రాష్ట్రానికి రావాల్సిన నిధులు, రాయితీలు ప్రకటిస్తామని, విశాఖపట్టణంలో రైల్వేజోన్, కడపలో ఉక్కు కర్మాగారంతో పాటు చట్టంలో ఉన్న ఇతర అన్ని అంశాలపై ప్రత్యేకంగా ప్రకటన చేస్తామని నచ్చచెప్పారు. పార్లమెంటులో అధికారిక ప్రకటన వెలువడేంత వరకు తాము ఆందోళన విరమించలేమని సుజనా చౌదరి కేంద్రమంత్రులకు తెలియజేశారు. ఆ తరువాత ఆయన ప్రధాన మంత్రి నరేంద్రమోదీతో చర్చించిన అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కేంద్రం రాష్ట్ర విభజన అంశాలపై దృష్టి సారించి పరిష్కారానికి చర్యలు చేపట్టిందన్న సమాచారం అందించారు. దాంతో చంద్రబాబు బీజేపీకి వ్యతిరేకంగా తీవ్ర నిర్ణయాలు తీసుకోకుండా నిర్ణయాన్ని వాయిదా వేశారు. ఇందుకు అనుగుణంగా రాష్ట్ర అధికారులను 23న ఢిల్లీకి పిలిపించి వారితో కేంద్ర అధికారులు చర్చించనున్నారు. అంతా అయ్యాక మార్చి 5వ తేదీ రాష్ట్రానికి అనుకూల, అధికార ప్రకటన వస్తుందని టీడీపీ నేతలు ధీమాతో ఉన్నారు. అది నెరవేరకపోతే ఇతర పార్టీలతో కలిసి ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేయనున్నట్లు వారు స్పష్టం చేశారు.

సిబ్బందికి శుభవార్త

అదనంగా రూ.300 చొప్పున తాత్కాలికంగా పెంచనున్నారు. కరవుభత్యం పెంపు వల్ల ప్రతి నెల రూ.69.91 కోట్లు, గ్రామ సేవకులకు పెంపు వల్ల రూ.6.57 కోట్లు పడనుంది. ఈ రెండింటివలన సంవత్సరానికి రూ.800 కోట్ల మేర భారం పడుతుంది.

- పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి కాంక్రీట్ పనులను రూ.1244 కోట్ల మేర పన్నులను నవయుగ ఇంజనీరింగ్ కంపెనీకి అప్పగించేందుకు అనుమతులు మంజూరు.
- ఏపీ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డుకు స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డ్, స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ కమిటీలకు స్వయంప్రతిపత్తి కల్పించేలా బిల్లు రూపకల్పన.
- విశాఖ, తిరుపతిలలో ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్ సెంటర్ల ఏర్పాటుకు ఆమోదం. విశాఖలో 2.7 ఎకరాలను ఎస్‌పీఏ సినిమాస్‌కు కేటాయించేందుకు జీవీఎంసీ కమిషనర్‌కు అధికారమిస్తూ నిర్ణయం. తిరుపతిలో 3.72 ఎకరాలలో ఈ సెంటర్‌ను ఏర్పాటు చేస్తారు. ఒక్కో ప్రాజెక్టుకు రూ.25 కోట్లు వ్యయం కానుంది. రెండేళ్లలో ఈ ప్రాజెక్టు పూర్తి చేయాలి. ప్రాథమికంగా ఇందుకయ్యే ఖర్చులను ఏపీటీడీసీ భరిస్తుంది. పీపీపీ పద్ధతిలో చేపట్టే ఈ ప్రాజెక్టులో కన్వెన్షన్ సెంటర్, ఫుడ్ కోర్టులు, ఆరు మల్టీప్లెక్స్ స్క్రీన్‌లు, త్రీస్టార్ హోటల్ నిర్మిస్తారు.
- ఎక్స్‌టర్నల్ ఎయిడెడ్ ప్రాజెక్టుల కింద ఏఐబీ చేపట్టిన అన్ని ప్రాజెక్టులకు పరిపాలనా ఆమోదం ఇచ్చారు. రూ.4,188 కోట్ల రూపాయలతో 42 నాన్ అమృత్ పట్టణాల్లో మౌలిక సదుపాయాలను కల్పిస్తారు.
- అవినీతి నిరోధక శాఖలో 300 ఖాళీలను నేరుగా, 50 ఖాళీలను ఔట్‌సోర్సింగ్ విధానంలో భర్తీ. రాజధాని నిర్మాణం తదితర అభివృద్ధి కార్యక్రమాలలో అవినీతికి తావులేకుండా చూసేందుకు ఏసీబీని బలోపేతం చేయాలని నిర్ణయం.
- కృష్ణా జిల్లా గన్నవరంలోని అడిషనల్ చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ సీనియర్ సివిల్ జడ్జిల పోస్టుల మంజూరుకు నిర్ణయం.
- అసెంబ్లీ స్పీకర్‌కు పీఆర్వోను నియమించేందుకు వీలుగా ఒక పోస్టును సృష్టించేందుకు అనుమతి.
- విజయవాడ విద్యాధరపురం 13వ వార్డులో ఉర్దూ జూనియర్ కళాశాల ఏర్పాటుకు 92 సెంట్ల భూమి కేటాయింపు.
- శ్రీకాకుళం జిల్లా రణస్థలం సంచాంలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు 44 ఎకరాల కేటాయింపు.

రక్తమోడిన రహదారి

నుండి చిన్నచింతకుంట మండలం నెల్లికొండి గ్రామంలో జరిగే జాతరకు 10 వాహనాల్లో బయలుదేరగా అందులోని టిఎస్ 08 యుఎ 3801 అనే మహేంద్రా క్యాబ్ ముందు టైరు ప్రమాదవ శాత్తూ పేలిపోవడంతో, వాహనం డివైడరును ఢీకొని ఆవల వెళ్తున్న టిఎస్ 08 ఇఎ 8108 నంబరుగల కారును ఢీకొట్టింది. మహేంద్ర వాహనంలో ఆరుగురు ప్రయాణిస్తుండగా ఐదుగురు మృతి చెందారు. కర్నూలు నుండి హైద్రాబాద్‌కు వెళ్తున్న అవతలి వాహనంలో ఐదుగురిలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందారు. మృతిచెందిన వారిలో గోపన్‌పేట గ్రామానికి చెందిన భీరప్ప (26), అజ్జకోలు గ్రామానికి చెందిన రాజు (38), మూలమల గ్రామానికి చెందిన మల్లేష్ (28), ఆంజనేయులు (40), నరేష్ (35), కర్నూలుకు చెందిన సూరిబాబు (45), ప్రసన్న (70), రాజేశ్వరమ్మ (60), సునీత (40) ఉన్నారు. మస్తీపురం గ్రామానికి చెందిన మోగిలన్న, కర్నూలుకు చెందిన కల్పన తీవ్రంగా గాయపడ్డారు. మహబూబ్‌నగర్ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స నిర్వహించిన అనంతరం హైద్రాబాద్‌కు తరలించారు.

మృతుల్లో భీరప్ప, మల్లేశ్, రాజు, ఆంజనేయులు, నరేష్‌లు వనపర్తి జిల్లావాసులుకాగా వలస వెళ్లి హైద్రాబాద్‌లో పండ్ల వ్యాపారం చేసుకుంటున్నట్టు బంధువులు తెలిపారు. కర్నూలు జిల్లా వాసులైన సూరిబాబు కుటుంబానికి చెందిన తల్లి ప్రసన్న, అత్త రాజేశ్వరి, భార్య సునీత మృతి చెందడం కుటుంబంలో విషాదాన్ని నింపింది. విషయాన్ని తెలుసుకున్న జేసీ నిరంజన్, ఏఎస్పీ సురేందర్ రెడ్డి, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను వెలికితీయించి, సహాయక చర్యలకు సహకరించారు.

మక్కళ్ నీది మయ్యమ్

(మా మనిషి), నల్లై నమాతే అని రాసుకొచ్చిన బ్యానర్లను అభిమానులు ప్రదర్శించారు. రామేశ్వరం వెళ్లి దివంగత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం సోదరుడి ఆశీస్సులు తీసుకున్న తరువాత కమల్ సభకు హాజరయ్యారు. కాగా తమిళ రాజకీయ పార్టీలకు ద్రవిడ పేరు ఉండడం కద్దు. అయితే సంచలనటుడు కమల్ హసన్ పార్టీ పేరులో ద్రవిడ అన్న పదమే లేదు.

కుంగుబాటు అంటువ్యాధి

సదస్సును ప్రారంభించగా, రెండో రోజు కృత్రిమే మేథోసంపన్నురాలైన సోఫియా తమ మాటలతో మైమరిపించింది. మూడోరోజు ముగింపు సందర్భంగా బాలీవుడ్ సినీనటి దీపికా పదుకొనె హాజరయ్యారు. వివిధ దేశాల నుండి వచ్చిన ప్రముఖులకు పేరుపేరునా నాస్కామ్ చైర్మన్ రామన్‌రాయ్, అధ్యక్షుడు ఆర్ చంద్రశేఖర్, విట్సా సెక్రటరీ జనరల్ జిమ్ పోసంట్, విట్సా చైర్మన్ యువన్ చు ధన్యవాదాలు తెలిపారు. డాటా సైన్స్, కృత్రిమ మేథస్సు, భవిష్యత్ ఐటీ సవాళ్లు, బ్లాక్ చైన్ తదితర అంశాలపై విస్తృత చర్చ జరిగింది.

వచ్చే సదస్సు ఆర్మేనియాలో..

వచ్చే ఏడాది ఐటీ కాంగ్రెస్ సమావేశం ఆర్మేనియాలో జరగనుంది. దీంతో ఆర్మేనియా సదస్సు నిర్వహణ బాధ్యతలను ప్రపంచ ఐటీ కాంగ్రెస్‌కు అప్పగించింది. అనంతరం హైదరాబాద్- తైవాన్ నగరాల మధ్య అవగాహన ఒప్పందం జరిగింది.

డిజిటల్ ఎకానమీ, బ్లాక్ చైన్‌పై చర్చ

మూడో రోజు డిజిటల్ ఎకానమి, బ్లాక్ చైన్‌పై చర్చ జరిగింది. బ్లాక్‌చైన్ ఇన్నోవేషన్ మీడియా ప్రతినిధి డాన్ తాప్‌స్కాట్ అనేక కొత్త విషయాలను వివరించారు. ఒక విలువైన రహస్య సమాచారాన్ని వివిధ ప్రాంతాల్లో భద్రపరచి దానిని ఇతరులు తస్కరించకుండా ఒకదానితో మరొకటి అనుసంధానించే అత్యాధునిక సాంకేతిక భద్రతా టెక్నాలజీనే బ్లాక్ చైన్ టెక్నాలజీ అంటున్నామని అన్నారు. నెట్‌వర్కులోకి పాస్‌వర్డు ఉన్న వారు మాత్రమే ప్రవేశించగలుగుతారని, ఇతరులు ప్రయత్నిస్తే క్షణాల్లో ఆ విషయం తెలుస్తుందని చెప్పారు.

డేటాను భద్రపరిచే ప్రాంతాలను నోడ్స్ అని, పాస్‌వర్డులను హాష్‌కీ అని వ్యవహరిస్తున్నామని, డేటాను క్రిప్టోలజీ విధానం ద్వారా కోడ్స్‌లోకి మార్చి భద్రపరుస్తామన్నారు. ఈ టెక్నాలజీ సైబర్ నేరాలకు ముకుతాడు వేస్తుందన్నారు. బ్లాక్ చైన్ టెక్నాలజీలో ఎవరు ఏంచేసినా ఇట్టే తెలుస్తుందని వివరించారు. మరో చర్చలో అప్‌డైనమిక్ సిఇఓ జ్యోతి బన్సాల్, గూగుల్ ఎక్స్ ప్రతినిధి టామ్ మోర్ మాట్లాడారు. నాస్కామ్ ఫౌండేషన్ నిర్వహించిన సదస్సులో మంత్రి కేటీఆర్, సియాంట్ చైర్మన్ బీవీఆర్ మోహనరెడ్డి, నాస్కామ్ ఫౌండేషన్ చైర్మన్ అరుణ్ సేథ్ పాల్గొన్నారు. ఐటీ నిర్వహణపై బీసీజీ ఎండి నీరజ్ అగర్వాల్ మాట్లాడారు.

బుందేల్‌ఖండ్‌కు వరం

పరిధిలోకి కొయంబత్తూర్ తదితర నగరాలను తీసుకొస్తారు. ఈ కారిడార్లు దేశ రక్షణ రంగం బలోపేతానికి దోహదపడతాయని కేంద్ర రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. ఉత్తరప్రదేశ్ ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ పలు అభివృద్ధి పథకాలను ప్రకటించారు. ప్రధానంగా ముద్రా యోజన పథకం అందులో ఒకటి.

కాగా రాష్ట్రానికి పెట్టుబడులను ఆహ్వానించాలన్న ఉద్దేశంతో యోగి ప్రభుత్వం ఇన్వెస్టర్ల మీట్‌ను ఏర్పాటు చేసింది. ఈ సమావేశం రెండు రోజులుపాటు జరుగుతుంది. ఉత్తరప్రదేశ్‌పై ఉన్న అపప్రద తొలగించడానికి యోగీ ప్రభుత్వం కృషి చేస్తోందని ఈ సంద్భంగా ప్రధాని అన్నారు. గత పాలకుల వల్ల రాష్రాభివృద్ధి కుంటుపడిందని, దాన్ని గాడిలోపెట్టేందుకు బీజేపీ ప్రభుత్వం చర్యలు చేపట్టినట్టు ఆయన వివరించారు. పారిశ్రామికీకరణతో అభివృద్ధి అలాగే ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, ఆ లక్ష్యం కోసం ఆదిత్యనాథ్ సర్కార్ చేస్తున్న కృషి అభినందనీయమని మోదీ పేర్కొన్నారు. ముఖ్యంగా 'వన్ డిస్ట్రిక్ట్- వన్ ప్రొడక్ట్ పాలసీ' రాష్ట్ర దశనే మార్చేస్తుందని ప్రధాని తెలిపారు. అభివృద్ధిలో మహారాష్ట్ర, యూపీలు పోటీ పడుతున్నాయన్న మోదీ 'ఇలాంటి పోటీ అభివృద్ధికి దోహదపడుతుంది. యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. సమాఖ్య స్ఫూర్తికి చుక్కానీ'అని మోదీ వ్యాఖ్యానించారు. హవాయ్ చెప్పులు వేసుకున్న వారు కూడా విమానంలో విహరించాలన్నది తన కల అని ప్రధాని స్పష్టం చేశారు.

అనంతలో కియా

పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కాగా ఏడాదికి దాదాపు 3 లక్షల కార్లు తయారు చేయాలన్నది కియా సంస్థ లక్ష్యం. అలాగే టౌన్‌షిప్, అనుబంధ సంస్థలు, శిక్షణ సంస్థ తదితరాలను మరో 1200 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్నారు. కియాకు కేటాయించిన 600 ఎకరాల్లో దాదాపు 550 ఎకరాల్లో గ్రౌండ్‌వర్క్ పూర్తయింది. ఈ పనుల్ని ఎల్అండ్‌టీ కంపెనీ ఏపీఐఐసీ ఆధ్వర్యంలో చేపట్టి శరవేగంగా పూర్తి చేస్తోంది. తొలుత తమిళనాడులో ఏర్పాటు చేయాలని భావించినా, సీఎం చంద్రబాబు అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రాజెక్టును తీసుకుని దేశంలోనే రెండో అత్యంత కరవు జిల్లా అయిన అనంతపురంలో నెలకొల్పడానికి కృషి చేశారు. అంతకుముందే చిత్తూరు జిల్లాలోని శ్రీసిటీ, చిత్తూరు, పెనుకొండలోని ఎర్రమంచి వద్ద భూమికి సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన సమాచారంతో 10 మంది సభ్యులతో కూడిన 3 బృందాలు పరిశీలన చేశాయి. పెనుకొండ ప్రాంతం అనువుగా ఉన్నట్లు నిర్ధారించుకున్నాక ఈ కంపెనీకి రెవెన్యూశాఖ ద్వారా భూసేకరణ చేశారు. అదే సమయంలో బీహార్ రాష్ట్రానికి కియాను తరలించేందుకు ప్రయత్నాలు జరిగాయన్న ప్రచారం కూడా సాగింది. బుధవారం నిర్వహించనున్న కార్యక్రమంలో సీఎంతో పాటు కియా సంస్థ ప్రతినిధులు పాల్గొంటున్నారు. జిల్లా కలెక్టర్ జీ.వీరపాండ్యన్, జాయింట్ కలెక్టర్ టీ.రమామణి, స్థానిక ఆర్‌డీఓ రామ్మూర్తి, పోలీసు ఉన్నతాధికారులు కార్యక్రమం ఏర్పాట్లను పరిశీలించారు.

క్రీడాభూమి

స్విమ్మింగ్ విజేతలకు ఏపీ సీఎం అభినందనలు

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, ఫిబ్రవరి 21: ఇండో-కజక్ మాస్టర్స్ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్ గెలిచిన ఏపీ జట్టును ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభినందించారు. వెలగపూడి సచివాలయంలో బుధవారం సీఎంను ఆ జట్టు సభ్యులు కలిశారు. పతకాలు సాధించిన జి.సురేష్, రాధిక, పి.ఈశ్వరరావు, జి.రవితేజ, ఎల్.వేణుబాబు, ఎస్.బాజీ, పి.నాంచారమ్మ, ఎస్.కె.ఖాజా మొహియుద్దీన్‌లను అభినందించారు. రాష్ట్రంలో జల క్రీడలను ప్రోత్సహిస్తామని సీఎం ప్రకటించారు.



ఇండో-కజక్ మాస్టర్స్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ విజేతలను అభినందిస్తున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

కివీస్‌పై ఆసీస్ గెలుపు

✳ టీ-20 ముక్కోణపు టోర్నీ ఫైనల్ మ్యాచ్ ✳ మ్యాన్ ఆఫ్ మ్యాచ్ ఆగస్టన్
✳ మ్యాన్ ఆఫ్ ది సిరీస్ గ్లెన్ మాక్స్‌వెల్ ✳ పొట్టి ఫార్మాట్‌లో ఆస్ట్రేలియా నెంబర్ వన్

ఆక్లాండ్, ఫిబ్రవరి 21: ఇక్కడి ఈడెన్ పార్క్‌లో బుధవారం జరిగిన టీ-20 ముక్కోణపు క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా జట్టు న్యూజిలాండ్‌ను 19 పరుగుల తేడాతో ఓడించింది. ఆస్ట్రేలియా 14.4 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి 121 పరుగులు చేసినా, వరుణుడి రూపంలో ఆటకు ఆటంకం ఏర్పడడంతో డక్ అండ్ లూయిస్ పద్ధతిలో విజయం ఆస్ట్రేలియాను వరించింది. వర్షం ఎప్పటికీ తగ్గే సూచనలు కనిపించక పోవడంతో ఎంపైర్లు ఈ నిర్ణయం తీసుకున్నారు. టీ-20 ఇంటర్నేషనల్ మ్యాచ్‌లోని పొట్టి ఫార్మాట్‌లో గెలుపు ద్వారా ఆస్ట్రేలియా ప్రపంచ నెంబర్ వన్ స్థానాన్ని ఆక్రమించింది. కీలక సమయంలో వికెట్లు తీసిన ఆస్ట్రేలియా క్రికెటర్ ఆస్టన్ ఆగర్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, సిరీస్ ఆసాంతం గొప్పగా రాణించిన గ్లెన్ మాక్స్‌వెల్‌కు మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అవార్డులు దక్కాయి. గత శుక్రవారం ఇదే మైదానంలో జరిగిన మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 243 పరుగులు చేసింది. ఫైనల్ మ్యాచ్‌లోతొలుత బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో తొమ్మిది వికెట్లు కోల్పోయి కేవలం 150 పరుగులు చేయడానికి ఆపసోపాలు పడింది. ప్రత్యర్థి బౌలర్లు న్యూజిలాండ్ బౌలర్లకు చుక్కలు చూపించారు. న్యూజిలాండ్ జట్టులో రాస్ టేలర్ ఒక్కడే దాదాపు అర్ధ శతకం చేశాడు. మిగిలిన బ్యాట్స్‌మెన్‌లెవరూ ఆశించిన విధంగా రాణించలేదు. తొలుత బ్యాటింగ్‌కు దిగిన మార్టిన్ గుప్తిల్ 15 బంతులు ఎదుర్కొని ఒక సిక్సర్, రెండు ఫోర్లతో 21 పరుగులు చేసి, స్టాన్‌లేక్ బౌలింగ్‌లో వార్నర్‌కు క్యాచ్ ఇచ్చి వెనుతిరిగాడు. కొలిన్ మన్రో 14 బంతులు ఎదుర్కొని రెండు సిక్సర్లు, మూడు ఫోర్లతో 29 పరుగులు చేసి, రిచర్డ్సన్ బౌలింగ్‌లో ఆగర్‌కు క్యాచ్ ఇచ్చాడు. కెప్టెన్ కేన్ విలియమ్సన్ తొమ్మిది బంతులు ఎదుర్కొని ఒక ఫోర్‌తో కేవలం తొమ్మిది పరుగులు సాధించి ఆగర్ చేతిలో బౌల్డ్ అయ్యాడు. మార్క్ చాప్‌మన్ తొమ్మిది బంతులు ఎదుర్కొని ఒక ఫోర్‌తో ఎనిమిది పరుగులు చేసి ఆగర్ బౌలింగ్‌లో ఎల్‌బీడబ్ల్యు అయ్యాడు. రాస్ టేలర్ 38 బంతులు ఎదుర్కొని ఒక సిక్సర్, రెండు ఫోర్ల సహాయంతో 43 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. కొలిన్ డి గ్రాండ్‌హోమ్ ఆరు బంతులు ఎదుర్కొని ఒక ఫోర్‌తో పది పరుగుల చేసి ఆగర్ బౌలింగ్‌లో మాక్స్‌వెల్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ దారి పట్టాడు. మిచెల్ సత్‌నర్ ఒక బంతిని ఎదుర్కొని పరుగులేమీ చేయకుండానే ఆండ్రూ టై బౌలంగ్‌లో కార్వేకు క్యాచ్ ఇచ్చాడు. వికెట్ కీపర్ సైఫెర్ట్ ఎనిమిది బంతులు ఎదుర్కొని మూడు పరుగులు చేసి స్టోనిస్ చేతిలో బౌల్డ్ అయ్యాడు. టిమ్ సౌతీ మూడు బంతులు ఎదుర్కొని ఒక ఫోర్‌తో ఐదు పరుగులు చేసి కానే రిచర్డ్సన్ బౌలింగ్‌లో మాక్స్‌వెల్‌కు క్యాచ్ ఇచ్చి వెనుతిరిగాడు. ఇష్ సోధి 16 బంతులు ఎదుర్కొని ఒక సిక్సర్‌తో 13 పరుగులు చేసి ఆండ్రూ టే చేతిలో బౌల్డ్ అయ్యాడు. ట్రెంట్ బౌల్ట్ ఒక బంతిని ఎదుర్కొని ఒక పరుగు మాత్రమే చేసి నాటౌట్‌గా నిలిచాడు. మొత్తం తొమ్మిది వికెట్లకు న్యూజిలాండ్ 150 పరుగులు చేసింది.

వారు ఓటమిని చవిచూడలే...

టీ-20 ఇంటర్నేషనల్ మ్యాచ్‌ల ముక్కోణపు టోర్నీలో ఆస్ట్రేలియా ఓటమి ఎరుగకుండా సిరీస్‌ను సొంతం చేసుకోవడమే కాకుండా ఐసీసీ తాజా ర్యాంకింగ్స్‌లో కోహ్లీ సేనను వెనకకు నెట్టేసింది. టీ-20 ముక్కోణపు టోర్నీలో అఖండ విజయం ద్వారా దాదాపు 15 పాయింట్లు ఎక్కువ సాధించిన ఆసీస్ ఐసీసీ ర్యాంకింగ్‌లో రెండో స్థానాన్ని చేరుకోగా, భారత్ 122 పాయింట్లతో మూడోస్థానానికి పరిమితమైంది. దక్షిణాఫ్రికాతో జరుగుతున్న టీ-20 మూడో మ్యాచ్‌లో భారత్ విజయం సాధించిన ర్యాంకింగ్‌లో ఎలాంటి మార్పు ఉండబోదు. ఐసీసీ ర్యాంకింగ్‌లో పాకిస్తాన్ ఇప్పటికే 126 పాయింట్లతో అగ్రస్థానంలో ఉంది. ప్రతిష్టాత్మక టీ-20 ఇంటర్నేషనల్ మ్యాచ్‌లో న్యూజిలాండ్‌పై 19 పరుగుల తేడాతో గెలిచిన ఆస్ట్రేలియా జట్టు షార్ట్ ఫార్మాట్‌లో తొలిసారిగా ప్రపంచ నెంబర్ టూ ర్యాంక్‌ను సాధించింది.

ఇదిలావుండగా ఆస్ట్రేలియా జట్టులో కేన్ రిచర్డ్సన్ నాలుగు ఓవర్లు వేసి 30 పరుగులిచ్చి రెండు వికెట్లు, ఆండ్రూ టే నాలుగు ఓవర్లలో 30 పరుగులిచ్చి రెండు వికెట్లు తీసుకున్నారు. బిల్లీ స్టాన్‌లేక్ నాలుగు ఓవర్లలో 37 పరుగులిచ్చి ఒక వికెట్, మెర్క్యూస్ స్టోనిస్ నాలుగు ఓవర్లలో 23 పరుగులిచ్చి ఒక వికెట్ తీసుకున్నారు.

అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా 14 ఓవర్ జరుగుతున్న సమయంలో వర్షంతో మ్యాచ్‌కు ఆటంకం కలిగింది. అప్పటికే 14.4 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయిన ఆస్ట్రేలియా 121 పరుగులు చేసింది. ఈ టీమ్‌లో డీ ఆర్సీ షార్ట్ అర్ధ సెంచరీ నమోదు చేశాడు. తొలుత బ్యాటింగ్‌కు దిగిన కెప్టెన్ డేవిడ్ వార్నర్ 23 బంతులు ఎదుర్కొని రెండు ఫోర్ల సహాయంతో 25 పరుగులు చేసి ఇష్ సోధి చేతిలో బౌల్డ్ అయ్యాడు. డి ఆర్టీ షార్ట్ 30 బంతులు ఎదుర్కొని మూడు సిక్సర్లు, ఆరు ఫోర్లతో 50 పరుగులు చేసి మున్రో బౌలింగ్‌లో చాప్‌మన్‌కు క్యాచ్ ఇచ్చి వెనుతిరిగాడు. గ్లెన్ మాక్స్‌వెల్ 18 బంతులు ఎదుర్కొని ఒక సిక్సర్‌తో 20 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. ఆరోన్ పించ్ 13 బంతులు ఎదుర్కొని ఒక సిక్సర్‌తో 18 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. న్యూజిలాండ్ జట్టులో ఇష్ సోధి, మిచెల్ సంత్‌నర్, కొలిన్ మన్రో చెరో వికెట్ సాధించారు.

స్కోరు బోర్డు:

న్యూజిలాండ్: మార్టిన్ గుప్తిల్ సి వార్నర్ బి, స్టాన్‌లాక్ 21 కొలిన్ మన్రో సి ఆగర్ బి, రిచర్డ్సన్ 29 కనే విలియమ్సన్ బి, ఆగర్ 9 మార్క చాప్మన్ ఎల్‌బీడబ్ల్యు బి, ఆగర్ 8 రాస్ టేలర్ నాటౌట్ 43, కొలిన్ డి గ్రాండ్‌హోమ్ సి మాక్స్‌వెల్ బి, ఆగర్ 10 మిచెల్ సంత్‌నర్ సి కారే బి, టై 0 టిమ్ సైఫెర్ట్ బి స్టోయిన్సిస్ 3 టిమ్ సౌథీ సి మాక్స్‌వెల్ బి, సౌథీ 5 ఇష్ సోధి బి, టై 13 ట్రెంట్ బౌల్ట్ నాటౌట్ 1. (150/9)

ఆస్ట్రేలియా: డేవిడ్ వార్నర్ బి సోధి 25, డి ఆర్సే షార్ట్ సి చాప్‌మన్ బి, మన్రో 50, ఆస్టాన్ ఆగర్ బి సంతన్‌నర్ 2, గ్లెన్ మాక్స్‌వెల్ నాటౌట్ 20, ఆరోన్ పించ్ నాటౌట్ 18. (121/3).



టీ-20 ముక్కోణపు క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌లో న్యూజిలాండ్‌పై గెలిచిన కప్‌తో ఆస్ట్రేలియా జట్టు ఆటగాళ్లు

నిదాస్ ట్రోఫీ టీ-20 ముక్కోణపు వన్డే సిరీస్

మొదటి మ్యాచ్‌లో శ్రీలంకతో-భారత్ ఢీ

కొలంబో, పిబ్రవరి 21: కోహ్లీ సేన దక్షిణాఫ్రికా పర్యటన ముగిసిన వెంటనే శ్రీలంక వేదికగా ముక్కోణపు వన్డే కోసం సన్నద్ధం కానుంది. భారత్, శ్రీలంక, బంగ్లాదేశ్ జట్ల మధ్య శ్రీలంకలో ముక్కోణపు వన్డే సిరీస్ జరుగనుంది. మార్చి 6 నుంచి 18 వరకు నిదాస్ ట్రోఫీ జరగనుంది. ఈ టోర్నీకి సంబంధించిన పూర్తిస్థాయి షెడ్యూల్‌ను శ్రీలంక క్రికెట్ బోర్డు తాజాగా వెల్లడించింది. నిదాస్ ట్రోఫీ టీ-20 ముక్కోణుపు వన్డే సిరీస్ క్రికెట్ టోర్నమెంట్ మార్చి 6వ తేదీ నుంచి 18 వరకు ఇక్కడి ఆర్ ప్రేమదాస స్టేడియంలో జరుగుతాయి.

శ్రీలంక 70వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా నిర్వహిస్తున్న ఈ ప్రతిష్టాత్మకమైన టోర్నమెంట్ రౌండ్ రాబిన్ పద్ధతిలో నిర్వహిస్తారు. వేసవికాలం సందర్భంగా అన్నీ డే నైట్ మ్యాచ్‌లేనని నిర్వాహకులు ప్రకటించారు. ఈ సిరీస్‌లో ప్రతి జట్టు తప్పకుండా మిగతా జట్లతో రెండు మ్యాచ్‌లు ఆడాల్సి ఉంటుంది. టోర్నమెంట్‌లో టాప్‌లో నిలిచిన రెండు జట్లు మార్చి 18న జరుగనున్న ఫైనల్ మ్యాచ్‌లో తలపడతాయి. శ్రీలంక స్వాతంత్ర్య దినోత్సవాలను పురస్కరించుకుని నిర్వహిస్తున్న త్రికోణపు టీ-20 సిరీస్ ఇంటర్నేషనల్ క్రికెట్ టోర్నమెంట్ భారత్, బంగ్లాదేశ్‌తో పాటు టోర్నమెంట్‌కు అతిధ్యమిస్తున్న శ్రీలంక జట్టు పాల్గొంటాయని శ్రీలంక క్రికెట్ ప్రెసిడెంట్ తిలంగా సుమతిపాలా వెల్లడించారు. ఇండియా, దక్షిణాఫ్రికా టూర్‌ను ముగించుకున్న వెంటనే ఈ టోర్నమెంట్ ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు. పొరుగుదేశాలైన బంగ్లాదేశ్, భారత్ జట్లు టోర్నమెంట్‌లో పాల్గొని తాము జరుపుకునే శ్రీలంక స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగస్వాములు కావాలని తిలింగా సుమతిపాల పిలుపునిచ్చారు.

టోర్నమెంట్ షెడ్యూల్ వివరాలు

మార్చి 6న ప్రారంభమయ్యే టోర్నమెంట్‌లో మొదటి మ్యాచ్ శ్రీలంక-ఇండియా జట్ల మధ్య జరుగుతుంది. అదేవిధంగా మిగతా మ్యాచ్‌లు మార్చి 8న బంగ్లాదేశ్-ఇండియా, 10న శ్రీలంక-బంగ్లాదేశ్, 12న ఇండియా-శ్రీలంక, 14న ఇండియా-బంగ్లాదేశ్, 16న బంగ్లాదేశ్-శ్రీలంక మ్యాచ్‌లు జరుగుతాయి. చివరిగా ఫైనల్ మ్యాచ్ మార్చి 18న ఫైనల్ మ్యాచ్ జరుగుతుందని టోర్నమెంట్ నిర్వాహకులు తెలిపారు.

కామన్వెల్త్ బరిలో సింధు, శ్రీకాంత్

ఢిల్లీ, ఫిబ్రవరి 21: కామన్వెల్త్ క్రీడల్లో బాడ్మింటన్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్లో టాప్ సీడ్ భారత్ బలమైన జట్టును బరిలో దించనుంది. మేటి షట్లర్లు పీవీ సింధు, సైనా నెహ్వాల్, కిడాంబి శ్రీకాంత్, హెచ్ఎస్.ప్రణయ్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో పసిడి పతకం కోసం పోరాటం చేయనున్నారు. భారత బాడ్మింటన్ సంఘం (బాయ్) ఈ జట్టును ప్రకటించింది. ఏప్రిల్ 5న ఆస్ట్రేలియా ఆరంభం కానున్న మిక్స్‌డ్ టీమ్ విభాగంలో భారత్ గ్రూప్-ఎ జరిగే మ్యాచ్‌లో పాల్గొంటుంది.

భారత జట్టు:

పురుషులు: శ్రీకాంత్, ప్రణయ్, చిరాగ్ శెట్టి, సాత్విక్ సాయిరాజ్, ప్రణయ్ జెర్రీ చోప్రా.

మహిళలు: పీవీ సింధు, సైనా నేహ్వాల్, అశ్విని, సిక్కిరెడ్డి, రుత్విక శివాని.

వరుణుడి ఆటంకం

మహిళల నాలుగో టీ-20 రద్దు

✳ ఇరు జట్లకు ఐదో మ్యాచ్ ప్రతిష్ఠాత్మకమే

సెంచూరియన్, ఫిబ్రవరి 21: దక్షిణాఫ్రికా, భారత్ మహిళల క్రికెట్ టీ-20 ఇంటర్నేషనల్ నాలుగో మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. ఇదే మైదానంలో పురుషుల మూడో టీ-20 మ్యాచ్ ఉండడంతో వర్షం తగ్గినా ఔట్ ఫీల్డ్ తడిగా ఉండడంతో ఆటను ఎంపైర్లు రద్దు చేశారు. మహిళల టీ-20 రద్దవడంతో భారత మహిళా క్రికెట్ చరిత్రలో ఇదే తొలిసారి కావడం విశేషం. అయితే, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ నేతృత్వంలో జట్టు మాత్రం నిర్ణయాత్మక ఐదో మ్యాచ్‌ను ఆడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే భారత్ 2-1 ఆధిక్యంతో ఉంది. కానీ చిట్టచివరి మ్యాచ్‌లో భారత్ గెలిస్తేనే సిరీస్ మన వశం అవుతుంది లేదంటే డ్రాగా ముగుస్తుంది.

భారత్ టాస్ గెలిచి దక్షిణాఫ్రికాను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. ఆతిధ్య జట్టు వర్షం కారణంగా ఆట నిలిచే సమయానికి 15.3 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి 130 పరుగులు చేసింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన వికెట్ కీపర్ లిజెల్సీ లీ 38 బంతులు ఎదుర్కొని ఐదు సిక్సర్లు, రెండు ఫోర్ల సహాయంతో 58 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచింది. కెప్టెన్ డేన్ వాన్ నైకెర్క్ 47 బంతులు ఎదుర్కొని రెండు సిక్సర్లు, ఆరు ఫోర్లతో 55 పరుగులు చేసి దీప్తి శర్మ బౌలింగ్‌లో రుమేలీ ధర్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ దారిపట్టింది. క్లో ట్రెయాన్ నాలుగు బంతులు ఎదుర్కొని రెండు పరుగులు మాత్రమే చేసి పూనమ్ యాదవ్ బౌలింగ్‌లో రుమేలీ ధర్‌కు క్యాచ్ ఇచ్చింది. సునే లూస్ మూడు బంతులు ఎదుర్కొని ఒక ఫోర్ సహాయంతో ఐదు పరుగులు చేసి దీప్తి శర్మ చేతిలో ఎల్‌బీడబ్ల్యు అయింది. మిగ్నాన్ డు ప్రీజ్ రెండు బంతులు ఎదుర్కొని రెండు పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచింది. భారత జట్టులో దీప్తి శర్మ మూడు ఓవర్లలో 33 పరుగులిచ్చి రెండు వికెట్లు, పూనమ్ యాదవ్ మూడు ఓవర్లలో 23 పరుగులిచ్చి ఒక వికెట్ తీసుకున్నారు.

దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి రెండు మ్యాచ్‌లలో అద్భుత విజయాలను అందుకున్న హర్మన్‌ప్రీత్ కౌర్ నేతృత్వంలోని భారత్ సేన మూడో టీ-20లో మాత్రం అతి పేలవ ప్రదర్శనతో అభిమానులను నిరాశపరిచింది. ఆ మ్యాచ్‌లో 175. ఓవర్లలో కేవలం 133 పరుగులకే భారత్ కుప్పకూలింది.

ఈ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 19 ఓవర్లలోనే ఐదు వికెట్లు కోల్పోయి 134 పరుగులు చేసింది. బుధవారం జరిగిన నాలుగో టీ-20 ఇరు జట్లకు ప్రతిష్ఠాత్మకమైనా వర్షం కారణంగా ఆటను రద్దు చేయడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఐదో మ్యాచ్ ఆడాల్సిన పరిస్థితి నెలకొంది.

నాలుగు వికెట్లకు 188

టీ-20 రెండో మ్యాచ్‌లో భారత్ స్కోరు

సెంచూరియన్, ఫిబ్రవరి 21: ఇక్కడి సూపర్ స్పోర్ట్ పార్క్ మైదానంలో బుధవారం దక్షిణాఫ్రికాతో జరిగిన టీ-20 ఇంటర్నేషనల్ రెండో మ్యాచ్ సందర్భంగా టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్న దక్షిణాఫ్రికా ప్రత్యర్థి జట్టును బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. ఈ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా టీమ్‌లో ఎలాంటి మార్పులు చేయలేదు. భారత్ జట్టులో కడుపునొప్పితో బాధపడుతున్న పేసర్ బుమ్రాకు విశ్రాంతినిచ్చి అతని స్థానంలో శ్రాద్ధూల్ ఠాకూర్‌ను జట్టులోకి తీసుకున్నారు. బ్యాటింగ్‌ను ప్రారంభించిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 188 పరుగులు చేసింది. మనీష్ పాండే 79 పరుగులు, వికెట్ కీపర్ ఎం.ఎస్.ధోని 52 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు. మొదటి టీ-20లో గెలుపు ద్వారా రెండో మ్యాచ్‌ను కూడా కైవసం చేసుకునేందుకు బరిలోకి దిగిన భారత్‌కు ఆదిలోనే దెబ్బతగిలింది.

రోహిత్ శర్మ రూపంలో తొలి వికెట్‌ను కోల్పోయిన భారత్ ఆ తర్వాత 11 ఓవర్లలో వరుసగా శిఖర్ ధావన్, కెప్టెన్ విరాట్ కోహ్లీ, సురేష్ రైనా వికెట్లను కోల్పోయింది. భారత బ్యాట్స్‌మెన్‌లలో శిఖర్ ధావన్ 14 బంతులు ఎదుర్కొని రెండు సిక్సర్లు, మూడు ఫోర్ల సహాయంతో 24 పరుగులు చేసి డుమిని బౌలింగ్‌లో బెహర్డియన్‌కు క్యాచ్ ఇచ్చి వెనుతిరిగాడు. రోహిత్ శర్మ ఒకే ఒక బంతిని ఎదుర్కొని పరుగులేమీ చేయకుండానే జూనియర్ డాలా చేతిలో ఎల్‌బీడబ్ల్యు అయ్యాడు. కెప్టెన్ విరాట్ కోహ్లీ ఐదు బంతులు ఎదుర్కొని ఒక పరుగు చేసి జూనియర్ డాలా బౌలింగ్‌లో క్లాసెన్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ దారి పట్టాడు. సురేష్ రైనా 24 బంతులు ఎదుర్కొని ఐదు ఫోర్లతో 30 పరుగులు చేసి ఫెహ్లు క్వాయో బౌలింగ్‌లో ఎల్‌బీడబ్ల్యు అయ్యాడు. నలుగురు ప్రధాన బ్యాట్స్‌మెన్‌లు బ్యాట్‌ను ఝులిపించడంలో విఫలమైనా మనీష్ పాండే, ఎం.ఎస్.ధోని మరో వికెట్ పడకుండా సిక్సర్లు, ఫోర్లతో అలరించారు. మనీష్ పాండే 48 బంతులు ఎదుర్కొని మూడు సిక్సర్లు, ఆరు ఫోర్ల సహాయంతో 79 పరుగులు, వికెట్ కీపర్ ఎం.ఎస్.ధోని 28 బంతులు ఎదుర్కొని మూడు సిక్సర్లు, నాలుగు ఫోర్లతో 52 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచారు. దక్షిణాఫ్రికా జట్టులో జూనియర్ డాలా రెండు వికెట్లు నాలుగు ఓవర్లలో 28 పరుగులిచ్చి రెండు వికెట్లు తీసుకున్నాడు. జీన్ పాల్ డుమినీ రెండు ఓవర్లలో 13 పరుగులిచ్చి ఒక వికెట్, ఆండిలో ఫెహ్లు క్వాయో రెండు ఓవర్లలో 15 పరుగులిచ్చి ఒక వికెట్ తీసుకున్నారు. అనంతరం దక్షిణాఫ్రికా జట్టు ప్రత్యర్థి విధించిన 189 పరుగుల లక్ష్య ఛేదనలో భాగంగా బ్యాటింగ్‌కు దిగింది. 17 ఓవర్లు ముగిసేటప్పటికి నాలుగు వికెట్లు కోల్పోయి 163 పరుగులు చేసింది. జేజే స్మట్స్ తొమ్మిది బంతులు ఎదుర్కొని రెండు పరుగులు చేసి ఉన్మద్కత్ బౌలింగ్‌లో సురేష్ రైనాకు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ దారి పట్టాడు. రీజా హెండ్రిక్స్ 17 బంతులు ఎదుర్కొని ఐదు ఫోర్లతో 26 పరుగులు చేసి ఎస్.ఎన్.ఠాకూర్ బౌలింగ్‌లో హార్థిక్ పాండ్యకు క్యాచ్ ఇచ్చి వెనుతిరిగాడు. హెన్రిచ్ క్లాసెన్ 30 బంతులు ఎదుర్కొని ఏడు సిక్సర్లు, మూడు ఫోర్లతో 69 పరుగులు చేసి, ఉన్మద్కత్ బౌలింగ్‌లో ధోనికి క్యాచ్ ఇచ్చాడు. డేవిడ్ మిల్లర్ 6 బంతులు ఎదుర్కొని ఐదు పరుగులు చేసి హార్థిక్ పాండ్య బౌలింగ్‌లో ఎస్.ఎన్.ఠాకూర్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ దారి పట్టాడు.

భారత్ (20 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 188) : శిఖర్ ధావన్ సి బెహర్డియన్ బి డుమిని 24, రోహిత్ శర్మ ఎల్‌బీడబ్ల్యు జూనియర్ దాలా 0, సురేష్ రైనా ఎల్‌బీడబ్ల్యు ఫెహ్లుక్వాయో 30, విరాట్ కోహ్లీ సి క్లాసెన్ బి జూనియర్ డాలా 1, మనీష్ పాండే 29 నాటౌట్, ఎం.ఎస్.ధోని 52 నాటౌట్ (188/4)

దక్షిణాఫ్రికా: (17 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 163)

జేజే స్మట్స్ సి రైనా బి ఉన్మద్కత్ 2, రీజా హెండ్రిక్స్ సి హార్థిక్ పాండ్య బి ఎస్.ఎన్.ఠాకూర్ 26. హెన్రిచ్ క్లాసెన్ సి ధోని ఉన్మద్కత్ బి 69. డేవిడ్ మిల్లర్ సి ఎస్.ఎన్.ఠాకూర్ బి పాండ్య 5.

దర్బన్ పోరుకు ఆస్ట్రేలియా జట్టు

సౌతాఫ్రికా, ఫిబ్రవరి 21: దర్బన్‌లో మార్చి 1 నుంచి ప్రారంభం కానున్న నాలుగు టెస్ట్‌ల సిరీస్‌లో దక్షిణాఫ్రికాతో తలపడే ఆస్ట్రేలియా తమ జట్టును దీటుగా బరిలోకి దింపనుంది. అక్లాండ్‌లో పర్యటిస్తున్న తమ జట్టు టీ-20లో ఆడుతున్న డేవిడ్ వార్నర్ మినహా జట్టులో మిగిలిన సభ్యులను వెల్లడించింది. దీంతో ఈసారి ఆస్ట్రేలియా జట్టు బాధ్యతలను స్టీవ్ స్మిత్ చేపట్టనున్నాడు. విల్లోమోరే పార్క్ మైదానంలో గురువారం దక్షిణాఫ్రికా-ఎ జట్టుతో ఆస్ట్రేలియా మొదటి మ్యాచ్‌లో ఆడనుంది.

జట్ల వివరాలు: సౌతాఫ్రికా ఎ: ఖాయన్ జోండో (కెప్టెన్), తేయునీస్ డి బ్రుయాన్, జూబేర్ హాంజా, బేయురాన్ హెన్‌డ్రిక్స్, పీటర్ మాలన్, వియాన్ ముల్డార్, సేనురాన్ ముత్తుస్వామి, దుహనే ఓలీవిర్, రూడిసెకండ్ (వికెట్ కీపర్), మాలుసీ సిబోటో, షాహున్ వాన్ బెర్గ్.

ఆస్ట్రేలియా: స్టీవ్ స్మిత్ (కెప్టెన్), ఉస్మాన్ ఖావాజ, పీటర్ హ్యాండ్సుకోంబ్, షాహున్ మార్ష్, మైకేల్ మార్ష్, టీమ్ (వికెట్ కీపర్), ప్యాట్ కుమీన్స్, మైకాల్ స్టార్క్, నాతన్ లియాన్, జోష్ హాజెల్‌వుడ్.

సుల్తాన్ అజ్లాన్‌షా కప్ హాకీ టోర్నీ

భారత పురుషుల జట్టు కెప్టెన్‌గా సర్దార్ సింగ్

మలేషియా, ఫిబ్రవరి 21: మలేషియాలో మార్చిలో జరుగనున్న ఆజ్లాన్ షా కప్ హాకీ టోర్నమెంట్‌లో పాల్గొంటున్న భారత పురుషుల జట్టుకు సీనియర్ ఆటగాడు సర్దార్ సింగ్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. ఆసియా కప్ హాకీ టోర్నమెంట్‌లో పాల్గొని, డిసెంబర్‌లో న్యూజిలాండ్‌లో జరిగిన హాకీ వరల్డ్ లీగ్‌లో చోటు దక్కని సర్దార్ మంచి గొప్ప అవకాశం లభించింది. ప్రస్తుత భారత హాకీ జట్టు కెప్టెన్ మన్‌ప్రీత్ సింగ్‌కు రెస్ట్ ఇవ్వడంతో సర్దార్‌కు మంచి ఆవకాశం లభించిందని జట్టు ఛీప్ కోచ్ జోర్డ్ మిరీన్ తెలిపారు. ఆజ్లాన్ షా కప్‌లో సర్దార్ సింగ్ చక్కగా రాణిస్తే త్వరలో జరుగనున్న కామన్వెల్త్, ఆసియా గేమ్స్‌తో పాటు వరల్డ్ కప్‌లో పాల్గొనే భారత జట్టుకు సారథ్యం వహించే ఆవకాశాలు మెరుగు పడతాయి.

సర్దార్ సింగ్‌కు వచ్చిన ఆవకాశాన్ని సద్వినియోగం చేసుకుని జట్టును విజయపథంలో నడిపిస్తే భవిష్యత్‌లో కెప్టెన్ బర్త్ ఖాయమవుతుందని చెప్పవచ్చు. అజ్లాన్ షా కప్ టోర్నమెంట్‌లో పాల్గొంటున్న భాతర హాకీ జట్టుకు వైస్ కెప్టెన్‌గా స్ట్రైకర్ రామాన్‌దీప్ వ్యవహరిస్తాడు. జట్టుకు ఎంపికైన వారిలో మన్‌దీప్ మోర్, సుమిత్ కుమార్ (జూనియర్), శిలానంద్ లాక్ర ఉన్నారు.

భారత హాకీ మాజీ కోచ్‌పై పాక్ కన్ను

కరాచీ, ఫిబ్రవరి 21: భారత హాకీ జట్టు మాజీ కోచ్ రోలన్ట్ ఆల్టమన్స్‌పై పాకిస్థాన్ హాకీ ఫెడరేషన్ (పీహెచ్ఎఫ్) కన్నేసింది. ఆల్టమన్స్ నేతృత్వంలో భారత హాకీ జట్టు ఎన్నో విజయాలను నమోదు చేసింది. తమకన్నా బలమైన జట్లను సైతం ఓడించిన ఘనతను సాధించిందంటే అదంతా అప్పటి కోచ్ ఆల్టమన్స్ చలవే. ఆల్టమన్స్ 2003-2004 మధ్య పాక్ హాకీ జట్టుకు కోచ్‌గా సేవలు అందించాడు. ఒమన్‌లో జరిగే పాకిస్తాన్, జపాన్, ఒమన్ ముక్కోణపు టోర్నీ సందర్భంగా ఆల్టమన్స్ సేవలను పాక్ వినియోగించుకోవాలని యోచిస్తోంది. ఈ నేపథ్యంలో కామన్వెల్త్ గేమ్స్‌కు ముందుగానే ఆల్టమన్స్‌ను తమ దేశ హాకీ జట్టుకు సేవలు అందించేందుకు మళ్లీ పంపాలని పాక్ హాకీ ఫెడరేషన్ విజ్ఞప్తి చేసింది. ప్రస్తుతం ఒమన్ పర్యటనలో ఉన్న ఆల్టమన్స్ పాక్ హాకీ ఫెడరేషన్‌తో ప్రెసిడెంట్, సెక్రెటరీతో ఈ విషయమ్మై చర్చలు జరుపుతున్నారు. ఒకవేళ అతను పాక్ కోచ్‌గా సేవలు అందించేందుకు అంగీకరిస్తే అతనికి కొత్తగా బాధ్యతలు అప్పజెబుతారు. ఏప్రిల్‌లో జరుగబోయే కామన్వెల్త్ గేమ్స్‌లో అతని సేవలు తమ దేశానికి ఉపయోగపడతాయని పాక్ హాకీ ఫెడరేషన్ భావిస్తోంది. 2013 నుండి భారత హాకీ జట్టులో గట్టి అనుబంధం ఉన్న ఆల్టమన్స్ పాకిస్తాన్ కోచ్‌గా వెళ్లేందుకు తుది నిర్ణయం కోసం కొద్దిరోజుల కిందట సంబంధిత అధికారులతో సంప్రదింపులు జరిపినట్టు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఆల్టమన్స్ 2015లో భారత జట్టు కోచ్‌గా ఎంపికైన తీరు అప్పట్లో వివాదాస్పదమైంది. ఆయన నేతృత్వంలో ఎన్నో విజయాలను అందుకున్న టీమిండియా గత ఏడాది ఆశించిన మేరకు రాణించలేదు. ప్రపంచ కప్‌లో అర్హత సాధించేందుకు భారత్ ఆపసోపాలు పడింది. ఈ నేపథ్యంలో ఆల్టమన్స్‌ను కోచ్ పదవి నుండి హాకీ ఇండియా గత సెప్టెంబర్‌లో తొలగించింది.

అమెరికా రైడర్ కప్ టీమ్ వైస్ కెప్టెన్‌లుగా టైగర్ ఉడ్స్, స్టీవ్ స్టయికర్

లాస్ ఏంజిల్స్, ఫిబ్రవరి 21: అమెరికా రైడర్ కప్ టీమ్ వైస్ కెప్టెన్‌లుగా టైగర్ ఉడ్స్, స్టీవ్ స్టయికర్‌లను ఎంపిక చేశారు. ఈ విషయాన్ని టీమ్ కెప్టెన్ జిమ్ ఫురిక్ ఫ్లోరిడా పామ్ బీచ్ గార్డెన్స్‌లో ప్రకటించారు. రైడర్ కప్ సెప్టెంబర్ 28 నుండి 30 వరకు ఫ్రాన్స్‌లోని లీ గోల్ఫ్ నేషనల్స్‌లో జరుగుతుంది. 1993 నుంచి ఇప్పటివరకు అమెరికన్లు యూరోప్‌లో గెలవలేదు. జిమ్ ఫురిక్ 2012 నుండి 2016 వరకు రైడర్ కప్‌కు కెప్టెన్‌గా వ్యవహరించాడు. ఉడ్స్, స్టయికర్ గత ఏది అమెరికన్ ప్రెసిడెంట్ కప్ టీమ్ విన్నింగ్ టీమ్‌లో అసిస్టెంట్‌లుగా సేవలు అందించారు. ఉడ్స్ 2016లో హాజిల్టయిన్‌లో జరిగిన యూఎస్ రైడర్ కప్‌లో అసిస్టెంట్‌గా వ్యవహరించాడు.

స్విస్ ఓపెన్ సూపర్ బాడ్మింటన్ టోర్నీ

రెండో రౌండ్‌కు గురు, సౌరభ్, సమీర్

బసెల్, ఫిబ్రవరి 21: భారత బాడ్మింటన్ క్రీడాకారులు మరోసారి సత్తచాటారు. స్విట్జర్లాండ్‌లోని బసెల్‌లో జరుగుతున్న ప్రతిష్టాత్మకమైన స్విస్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్ 300 బాడ్మింటన్ టోర్నమెంట్ మొదటి రౌండ్‌లో ప్రత్యర్థులపై విజయం సాధించి స్విస్ ఓపెన్ బాడ్మింటన్ టోర్నమెంట్ రెండో రౌండ్‌కు ప్రవేశించిన వారిలో ఆర్ఎంవి.గురుసాయిదత్, సౌరభ్ వర్మ, సమీర్ వర్మలున్నారు.

ఇక్కడ జరిగిన మొదటి రౌండ్‌లో కామన్వెల్త్ గేమ్స్‌లో రజత పతకం గెలుచుకున్న గురుసాయిదత్ గాయల కారణంగా చికిత్స పొందిన అనంతరం టోర్నమెంట్‌లో పాల్గొన్నాడు.

సాయిదత్ 21-16, 21-11 స్కోరు తేడాతో ప్రత్యర్థి బ్రెజిల్‌కు చెందిన యోర్ కోయిలోపై విజయం సాధించాడు. మరో మ్యాచ్‌లో సౌరభ్ 21-11, 21-18తో మిషాజిల్‌బేర్మాన్‌పై , సౌరభ్ సోదరుడు సమీర్ వర్మ 22-20, 21-10 స్కోరు తేడాతో ఫ్రాన్స్‌కు చెందిన థామాస్ రాక్సెల్‌పై పురుషుల సింగిల్స్ మ్యాచ్‌లో నెగ్గారు. రెండో రౌండ్ సింగిల్స్‌లో సమీర్ జపాన్‌కు చెందిన యు ఇగార్షితో, సౌరభ్‌తో గురుసాయిదత్ తలపడునున్నారు.



వటపత్రశాయి అలంకార సేవలో లక్ష్మీనరసింహుడు

వటపత్రశాయిగా యాదగిరీశుడు

పొన్న వాహనంపై భక్తులకు అభయం ◆ పులకించిన భక్తులు

ఆంధ్రభూమి బ్యూరో

నల్లగొండ, ఫిబ్రవరి 21: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో ఐదవ రోజు బుధవారం స్వామివారు ఉదయం వటపత్రశాయి అలంకార సేవలో, రాత్రి పొన్నవాహన రూఢుడై భక్తులకు దర్శనమిచ్చారు. ప్రళయకాలంలో మరోజగత్తును సృష్టించేందుకు జగద్రక్షుడైన స్వామివారు చిన్నికృష్ణుడి రూపంలో వటపత్ర శయనుడిగా అవతరించి లోకాలను రక్షించారు. లక్ష్మీనరసింహుడు లోకరక్షకుడైన వటపత్ర శాయిగా దర్శనమిచ్చి భక్త రక్షకుడిగా చాటుకున్నారు. రాత్రి 9గంటలకు కోరిన కోర్కెలు తీర్చే పొన్న (కల్పవృక్షం) వాహనంపై విహరించారు. పొన్న వాహన రూఢుడైన స్వామివారిని దర్శిస్తే కోరిన కోరికలు తీరుతాయని, సంతాన సిద్ధి కలుగుతుందన్న నమ్మకంతో భక్తులు పెద్దఎత్తున స్వామివారిని దర్శించుకున్నారు.

నేడు గోవర్ధనగిరిధారి అలంకారం

గురువారం లక్ష్మీనరసింహస్వామికి గోవర్ధనగిరిధారి అలంకార సేవ, సింహవాహన సేవలు నిర్వహించనున్నారు. శుక్రవారం రాత్రి 9గంటలకు బాల ఆలయంలో స్వామివారికి ఎదుర్కోలు ఘట్టం సాగనుంది.

ఈడీ సోదాలు ముమ్మరం

దేశవ్యాప్తంగా 17 చోట్ల దాడులు

ముంబయి/న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) కుంభకోణానికి సంబంధించి వరుసగా ఏడోరోజు బుధవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సోదాలు జరిపింది. ముంబయిసహా దేశవ్యాప్తంగా 17 చోట్ల దాడులు నిర్వహించారు. పీఎన్‌బీలో జరిగిన 11,400 కోట్ల రూపాయల స్కామ్‌కు సంబంధించి ఈడీ మనీలాండరింగ్ కేసులు నమోదు చేసింది. వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ కేసులో దర్యాప్తు సంస్థ పురోగతి సాధించినట్టు తెలిసింది. మోదీ, ఆయన అంకుల్ గీతాంజలీ జెమ్స్ ప్రమోటర్ మెహుల్ ఛోక్సీకి డొల్ల కంపెనీలతో ఏమైనా సంబంధాలున్నాయా అన్న కోణంలో సీబీఐ, ఈడీ దర్యాప్తు చేస్తున్నాయి. కంపెనీ శాఖలున్న ఒపేరా హౌస్, పెడ్డార్‌రోడ్, గొరేగావ్ (ఈస్ట్), పవాయ్ ప్రాంతాల్లో ఈడీ దాడులు జరిపింది. మొత్తం ఈ వ్యవహారంపై ఆదాయ పన్ను శాఖ (ఐటీ) దృష్టి సారించింది. మంగళవారం డొల్ల కంపెనీలపై కొరడా ఝుళిపించింది. డొల్ల కంపెనీలకు నిధులు దారిమళ్లించడం ద్వారా పన్నులు ఎగ్గొట్టినట్టు భావిస్తున్నారు. వేలాది కోట్ల రూపాయల కుంభకోణం కేసులో బినామీలు ఉండొచ్చని అంటున్నారు. ముంబయి జోనల్ ఆఫీసు నుంచి సుమారు 5,726 కోట్ల రూపాయల విలువైన వజ్రాలు, వైడుర్యాలు సీజ్ చేసిన సంగతి తెలిసిందే. పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఆడిట్ రిపోర్టులను పరిశీలిస్తున్నారు.

జేపీసీపై కొత్త రగడ

దర్యాప్తునకు వామపక్షాల మద్దతు ◆ వృథా ప్రయాసే అంటున్న తృణమూల్
మిత్రపక్షాలను కూడదీస్తున్న కాంగ్రెస్ ◆ పీఎన్బీ కుంభకోణంలో కొత్తకోణం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: పీఎన్బీ కుంభకోణంలో నిజాల నిగ్గు తేల్చడానికి సంయుక్త పార్లమెంటరీ కమిటీ వేయాలన్న కాంగ్రెస్ ప్రతిపాదన ప్రతిపక్ష వామపక్షాలు, మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ మధ్య రచ్చ లేపింది. జేపీసీ దర్యాప్తునకు వామపక్షాలు మద్దతు పలికితే, పశ్చిమ బెంగాల్‌లో ప్రత్యర్థి అధికార పక్షం తృణమూల్ కాంగ్రెస్ మాత్రం కాంగ్రెస్ ప్రతిపాదనను పూర్తిగా వ్యతిరేకించింది. జేపీసీ వల్ల దర్యాప్తు నీరుగారడమే తప్ప, నిజాల నిగ్గు తేలదంటూ అభిప్రాయపడింది. 'పీఎన్బీ కుంభకోణంలో సమగ్ర దర్యాప్తు జరగాల్సిన అవసరం ఉంది. గతంలోనూ హర్షద్ మెహతా, కేతన్ పరేఖ్‌లు ఆర్థిక కుంభకోణాలకు పాల్పడినపుడు దర్యాప్తునకు జేపీసీలను ఏర్పాటు చేశారు. అప్పటి కేసుల్లో ఆర్థిక మంత్రులే తప్పుకోక తప్పలేదు. ప్రస్తుత పీఎన్బీ కేసులోనూ సంయుక్త పార్లమెంటరీ కమిటీని వేయాల్సిందే. దర్యాప్తులో తలెత్తే అనేక ప్రశ్నలకు ఆర్థిక మంత్రి సమాధానం ఇచ్చుకోక తప్పదు' అని సీపీఐ(ఎం) ఒక ప్రకటనలో పేర్కొంది.

పారిశ్రామికవేత్తల కారణంగా బ్యాంకుల్లో నిరర్థక ఆస్తులు 2లక్షల కోట్లకు పేరుకుపోయాయని ప్రభుత్వం చెబుతున్న నేపథ్యంలో, ప్రధాని నరేంద్ర మోదీ చొరవ తీసుకుని వారి పేర్లను బహిర్గతపర్చాలని సీపీఐ(ఎం) డిమాండ్ చేసింది. అలాగే, ప్రధాని విదేశీ పర్యటనల సందర్భంలో ఆయనవెంట వెళ్లిన పారిశ్రామికవేత్తలు, వారికైన ఖర్చును సైతం ప్రకటించాల్సిందేనని డిమాండ్ చేసింది. 'ఈ పేర్లు బహిర్గతమైతే, అధికారపక్షానికి దగ్గరగా మసలుతూ లబ్ధిపొందుతున్న పెట్టుబడిదారుల వ్యవహారం బహిర్గతమవుతుంది' అని పార్టీ పేర్కొంది. పీఎన్బీ కుంభకోణంపై జేపీసీ దర్యాప్తు సహా రెండు కోణాల్లో దర్యాప్తు సాగాలని డిమాండ్ చేసింది. ఒకపక్క న్యాయపరమైన దర్యాప్తు సాగిస్తూనే, మరోవైపు సంయుక్త పార్లమెంటరీ కమిటీతో దర్యాప్తు చేయించాలని సీపీఐ సీనియర్ నేత డి రాజా డిమాండ్ చేశారు. అయితే, జేపీసీతో దర్యాప్తు చేయించాలన్న డిమాండ్‌ను తృణమూల్ పూర్తిగా వ్యతిరేకిస్తోంది. గతంలోనూ ఆర్థిక కుంభకోణాలపై జేపీసీలను వేయడమే తప్ప, సాధించిన ఫలితమంటూ ఏమీ లేదని స్పష్టం చేసింది.

'పీఎన్బీ కుంభకోణంపై జేపీసీని వేయాలన్న ప్రతిపాదనకు మేం పూర్తి వ్యతిరేకం. నిజానికి దీనివల్ల ఏమాత్రం ఫలితం కూడా ఉండదు. ప్రస్తుత దర్యాప్తుతో త్వరలోనే వాస్తవాలు బయటకు వస్తాయని నమ్ముతున్నాం. 1987లో బోఫోర్స్ కేసును దర్యాప్తు చేసిన జేపీసీ నివేదికను ప్రతిపక్షమే తిరస్కరించింది. హర్షత్ మెహతా, కేతన్ పరేఖ్‌ల కేసుల్లోనూ చర్యలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. ఇలాంటి అనుభవాల నేపథ్యంలో ప్రస్తుత కుంభకోణంపై జేపీసీ వేయడం అర్థరహితం' అని టీఎంసీ నేత డెరెక్ ఓబెరాయ్ వ్యాఖ్యానించారు. అయితే, కేసులో ఏ కోణంలో దర్యాప్తు చేయాలన్న అంశంపై తృణమూల్ ఎలాంటి స్పష్టతను ఇవ్వలేదు. బీజేపీ తన ప్రత్యర్థులను వేధించడానికి సీబీఐని పావుగా వాడుకుంటోందని తృణమూల్ వ్యాఖ్యానించటం తెలిసిందే. 'ఇలాంటి కుంభకోణాల కేసుల కారణంగా సామాన్యుడే బలైపోతున్నాడు. బ్యాంకుల్లో రుణాలు తిరస్కరిస్తున్నారు. ఆర్థిక కుంభకోణాలపై పార్లమెంట్‌లో పెద్దఎత్తున చర్చించాలి. ప్రజల దృష్టికి వాస్తవాలను తీసుకెళ్లాలి' అని ఓబెరాయ్ డిమాండ్ చేశారు. స్కాంను జేపీసీతో దర్యాప్తు చేయించాలంటూ ప్రతిపాదిస్తున్న కాంగ్రెస్ పార్టీ, మిత్రుల సహాయంతో ఈ అంశాన్ని పార్లమెంట్‌లో లేవనెత్తేందుకు ప్రయత్నిస్తోంది.



భారత్‌లో పర్యటిస్తున్న కెనడా ప్రధాని జస్టిన్ ట్రుడో కుటుంబ సమేతంగా బుధవారం అమృత్‌సర్‌లోని స్వర్ణదేవాలయాన్ని సందర్శించారు. ఆలయ కమిటీ తరపున వారికి ఘన స్వాగతం లభించింది. ప్రధాన ఆలయాన్ని దర్శించిన అనంతరం అక్కడ సాంప్రదాయమైన లంగర్‌ను తయారు చేస్తున్న దృశ్యం



కేసులు నమోదు చేయవద్దు

'ఒరు ఆదార్ లవ్'పై సుప్రీం ఆదేశం ◆ ప్రియా ప్రకాశ్ వారియర్‌కు ఉపశమనం

ఆంధ్రభూమి ప్రతినిధి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: మలయాళ నటి ప్రియాప్రకాశ్ వారియర్‌కు సుప్రీం కోర్టులో ఊరట లభించింది. ఒరు ఆదార్ లవ్ మలయాళ సినిమాలోని 'మాణిక్య మలరాయ పూవి' పాటకు అభ్యంతరం వ్యక్తం చేస్తూ ప్రియా వారియర్, సినిమా దర్శక, నిర్మాతలపై తెలంగాణ, మహారాష్ట్రల్లో నమోదైన కేసులపై అత్యున్నత ధర్మాసనం స్టే ఇవ్వడంతోపాటు, దేశంలో ఎక్కడా కేసులు నమోదు చేయవద్దని ఆదేశించింది. మాణిక్య మలరాయ పూవి పాట తమ మనోభావాలను దెబ్బతీసే విధంగా చిత్రీకరణ జరిపారంటూ తెలంగాణ, మహారాష్ట్రల్లో కేసులు నమోదు అయిన విషయం తెలిసిందే. దీనిపై దాఖలైన కేసులను కొట్టివేయాలని, అలాగే తమపై క్రిమినల్ చర్యలు చేపట్టకుండా ఆదేశాలివ్వాలని కోరుతూ ప్రియావారియర్ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. బుధవారం ఈ పిటిషన్ ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రాతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ముందుకు విచారణకు వచ్చింది. పిటిషనర్ తరపు న్యాయవాది హారీష్ బిరేన్ వాదనలు వినిపిస్తూ సినిమా ఇంకా విడుదల కాలేదని, సినిమాలో అభ్యంతరకర సన్నివేశాలుంటే తిరస్కరించేందుకు అధికారం సన్సార్ బోర్డుకు ఉందని, ఈ సినిమా పాటపై కొందరు కావాలనే అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారని వాదించారు. ఈ పాటపై పోలీసులు కేసును ఎలా నమోదు చేస్తారని వాదించారు. ఈ పాటపై కేరళలో ఎలాంటి కేసూ నమోదు కాలేదని, ఇతర రాష్ట్రాల్లో కేసులు పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. వాదనల అనంతరం చిత్ర బృందంపై వేసిన క్రిమినల్ కేసులపై స్టే విధిస్తూ నటి, దర్శకుడిపై దేశవ్యాప్తంగా ఎక్కడా క్రిమినల్ కేసులు నమోదు చేయవద్దని సుప్రీం కోర్టు ఆదేశించింది. ఈ సినిమాపై కేసులు నమోదు చేసిన తెలంగాణ, మహారాష్ట్ర సమాధానం చెప్పాలని ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. ప్రియ, అబ్దుల్ రహోఫ్ జంటగా నటించిన చిత్రం 'ఒరు ఆదార్ లవ్' సినిమాకు ఒమర్ లులు దర్శకత్వం వహించారు. కాగా ఇటీవల ఈ సినిమాలో ముస్లిం మనోభావాలను కించపరిచే విధంగా ఓ పాట ఉందని హైదరాబాద్‌లోని కొందరు విద్యార్థులు ఫిర్యాదు చేశారు. అలాగే మహారాష్ట్రలో కూడా కేసు నమోదయింది.

వారిని పనుల్లోంచి తొలగించకండి

టీటీడీని ఆదేశించిన హైకోర్టు
హైందవేతర ఉద్యోగులకు ఊరట

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 21: తిరుమల తిరుపతి దేవస్థానంలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న క్రైస్తవ, ముస్లిం ఉద్యోగులను హైందవేతరులనే కారణంపై తొలగించారదని, తదుపరి ఆదేశాలు వెలువడే వరకు వారిని వారి సర్వీసుల్లో కొనసాగించాలని హైకోర్టు టిటిడిని ఆదేశించింది. ఈ మేరకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేష్ రంగనాథన్, జస్టిస్ కె విజయలక్ష్మితో కూడిన ధర్మాసనం ఆదేశాలు జారీ ఏసచింది. ఈ కేసులో టిటిడి తరపున న్యాయవాది వై.బాలాజీ వాదనలు వినిపించారు. హైందవేతరులైన ఉద్యోగుల పట్ల టిటిడి సానుభూతితో ఉండాలని, వారి తల్లితండ్రులు కూడా టిటిడిలో పనిచేశారని, వారు నియమాలను ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవచ్చని పేర్కొంది.

డిసెంబర్‌లోగా పరిహారాలు చెల్లించండి

- తెలుగు రాష్ట్రాలకు హైకోర్టు ఆదేశం
- కొలిక్కివచ్చిన భూసేకరణ నష్టపరిహారం కేసులు
- పెండింగ్‌లో ఉన్న భూసేకరణ కేసులు 3032
- భూమిని కోల్పోయిన యజమానులకు ఉపశమనం



ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 21: ప్రభుత్వం చేపట్టే మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, ఇరిగేషన్ ప్రాజెక్టుల వల్ల భూములు కోల్పోయిన రైతులు లేదా ఇతరులు తమకు నష్టపరిహారం ఎప్పుడు వస్తుందా అని ఏళ్లతరబడి ఎదురు చూశారు. కాని అత్యున్నతమైన న్యాయ వ్యవస్థ జోక్యంవల్ల భూములు కోల్పోయిన వారికి వీలైనంత త్వరలో నష్టపరిహారం అందేందుకు ఇటీవల వెలువడిన తీర్పు దోహదపడింది. ఈ ఏడాది డిసెంబర్‌లోగా ఆంధ్ర, తెలంగాణ ప్రభుత్వాలు భూసేకరణ వల్ల భూమి కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని హైకోర్టు ఇచ్చిన తీర్పుతో రెండు రాష్ట్రాల రైతాంగంలో ఆనందం వ్యక్తమవుతోంది. మహబూబ్‌నగర్ జిల్లా కోర్టు ప్రిన్సిపల్ జడ్జి జి వెంకట కృష్ణయ్య భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించడంలో ఆలస్యమవుతోందని, పెద్దసంఖ్యలో ఎగ్జిక్యూటివ్ పిటిషన్లు విచారణ కోర్టులో పెండింగ్‌లో ఉన్నాయని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి గత ఏడాది జూన్ 24వ తేదీన లేఖ రాశారు. దీంతో హైకోర్టు ఈ కేసును విచారించి రైతులకు ఆమోదయోగ్యంగా, ఉపశమనం కలిగించే విధంగా తీర్పు ఇచ్చింది. కోర్టు ప్రకారం రెండు రాష్ట్రాల్లో 3032 భూసేకరణ నష్టపరిహారం కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. కాగా తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కోర్టుకు ఇచ్చిన నివేదిక ప్రకారం 1669 కేసులు, ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఇచ్చిన లేఖ ప్రకారం 918 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి.

భూసేకరణలో భూములు కోల్పోయిన రైతులు తీవ్ర వేదనకు గురవుతున్నారని, 300-ఏ అధికరణ కింద రైతుల హక్కులను పరిరక్షించాల్సిన అవసరం ఉందని మహబూబ్‌నగర్ జిల్లా ప్రిన్సిపల్ కోర్టు జడ్జి హైకోర్టుకు రాసిన లేఖలో పేర్కొన్నారు. ఈ లేఖను హైకోర్టు పిల్ కమిటీ జడ్జీల ముందు ఉంచింది. పిల్ కమిటీ సభ్యుడు జస్టిస్ చల్లా కోదండరామ్ ఈ లేఖను పిల్ స్వీకరించేందుకు అవసరమైన అన్ని అర్హతలు ఉన్నాయని సిఫార్సు చేశారు. రెండు రాష్ట్రాల్లో ఎగ్జిక్యూటివ్ పిటిషన్లు ఎన్ని ఉన్నాయో సమాచారం తెప్పించుకోవాలని పిల్ కమిటీ నిర్ణయించింది. ఈ సిఫార్సు మేరకు హైకోర్టు రిజిస్ట్రీ రెండు రాష్ట్రాల్లో వివిధ కోర్టుల్లో ఉన్న ఈ కేసుల వివరాలను సేకరించింది. నష్టపరిహారం చెల్లించకుండా ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూస్తున్న కేసులు 3032 ఉన్నట్లు రిజిస్ట్రీకి సమాచారం వచ్చింది.


అనంతరం తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేష్ రంగనాథన్ ఆధ్వర్యంలో ధర్మాసనం పిల్‌ను విచారించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులను పూర్తి వివరాలు ఇవ్వాలని ఆదేశించింది. ఒకవేళ తమ ఆదేశాలను పాటించని పక్షంలో భూసేకరణ ప్రక్రియను నిలుపుదల చేయాల్సి వస్తుందని హైకోర్టు స్పష్టం చేసింది. హైకోర్టు ధర్మాసనం ఆదేశం వల్ల ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం కోర్టుకు ఇచ్చిన హామీ మేరకు ఈ ఏడాది డిసెంబర్‌లోగా రూ.457.79 కోట్లను నష్టపరిహారంగా బాధితులకు ఇచ్చేందుకు సమాయత్తమవుతోంది. వచ్చే బడ్జెట్‌లో ఈ మేరకు నిధులను కేటాయించేందుకు కసరత్తు చేస్తోంది. ఆంధ్ర ప్రభుత్వం కూడా రూ.84.32 కోట్ల నష్టపరిహారాన్ని చెల్లించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని హైకోర్టుకు హామీ ఇచ్చింది.

మోదీజీ.. ప్రజలకు ఆ వివరాలు చెప్పండి

పీఎన్‌బీ, రాఫెల్ కుంభకోణాలపై రాహుల్

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: రత్నాల వ్యాపారి నీరవ్ మోదీ 22వేల కోట్లు దోచుకుని పారిపోవటం, 58వేల కోట్ల రాఫెల్ యుద్ధ విమానాల ఒప్పందం వివరాలను ప్రజలకు తెలియజేయాలని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి హితవు చెప్పారు. రాహుల్ గాంధీ బుధవారం ఈ మేరకు ట్వీట్ చేశారు. మోదీజీ 'మీ మనసులోని మాట' కార్యక్రమానికి నేను గత నెలలో చేసిన సూచనలు మీరు పట్టించుకోలేదు, ప్రజలకు ఏం కావాలనేది మీకు తెలిసినప్పుడు మళ్లీ ప్రజల నుండి సూచనలు, సలహాలు ఎందుకు అడుగుతున్నారని ఆయన ట్వీట్‌లో ప్రశ్నించారు. 'నీరవ్ మోదీ 22వేల కోట్లు దోచుకుని పారిపోవటం గురించి ప్రజలు అడగాలనుకుంటున్నారు, 58వేల కోట్ల రాఫెల్ ఒప్పందం గురించి తెలుసుకోవాలనుకుంటున్నారు, ప్రజలు కోరుకుంటున్న ఈ అంశాలకు మీరు సమాధానం చెప్పాలని రాహుల్ డిమాండ్ చేశారు. మీరు కనీసం ఇప్పుడైనా ఈ ప్రశ్నలకు జవాబులు చెబుతారని ఆశిస్తున్నాను, మీ ఉద్బోధలకోసం ఎదురుచూస్తుంటా' అంటూ రాహుల్ తన ట్వీట్ ముగించారు.



యశోదా ఆసుపత్రిలో ప్రవేశపెట్టిన 3టీ ఐఎంఆర్ఐ అత్యాధునిక యంత్రం గురించి వివరిస్తున్న ఆసుపత్రి ఎండి జీఎస్ రావు, ఇతర డాక్టర్లు

బ్రెయిన్ ట్యూమర్‌కు ఇక అత్యాధునిక శస్త్రచికిత్స

3టీ ఐఎంఆర్ విధానాన్ని ప్రవేశపెట్టిన యశోద ఆసుపత్రి

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 21: ఇక దేశంలో అత్యాధునిక పద్ధతిలో బ్రెయిర్ ట్యూమర్ శస్త్రచికిత్సలు హైదరాబాద్‌లో జరగనున్నాయి. కేవలం అభివృద్ధి చెందిన దేశాల్లో మాత్రమే అందుబాటులో ఉన్న 3టి ఐఎంఆర్ఐ విధానాన్ని దేశంలోనే తొలిసారిగా యశోద ఆసుపత్రి అందుబాటులోకి తీసుకువచ్చింది. బుధవారం ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఆసుపత్రి ఎండి జీఎస్ రావు, సీనియర్ న్యూరోసర్జన్ డాక్టర్ ఆనంద్ సుబ్రహ్మణియం వివరాలను వెల్లడించారు. ఇంట్రా ఆపరేటివ్ 3టి విధానం వల్ల మెదుడులో గడ్డలు ఏర్పడ్డ రోగికి ఖచ్చితమైన శస్త్రచికిత్సలను సురక్షితంగా నిర్వహించే అవకాశం ఏర్పడిందని చెప్పారు. గతంలో ట్యూమర్‌తో బాధపడే రోగికి చికిత్సలు అందించడం ఎంతో సంక్లిష్టంగా ఉండేదని, చికిత్స మొత్తం పూర్తిచేసిన తరువాత ఎంఆర్ఐ నిర్వహించి తిరిగి మరోమారు శస్త్రచికిత్సలు చేయాల్సి వచ్చేదన్నారు. ఎంఆర్ఐ వల్ల శస్త్రచికిత్స సమయంలో ట్యూమర్ ఏదో, న్యూరాన్లు ఏవో గుర్తించలేని పరిస్థితి ఉండేదని 3టి విధానంలో వచ్చే స్పష్టమైన చిత్రాల ద్వారా ట్యూమర్ ఎక్కడ ఉంది, ఏ మేరకు ఉంది అన్నదాన్ని ఖచ్చితంగా తెలుసుకొని ఆపరేషన్ చేసే అవకాశం ఏర్పడిందని అన్నారు. ఆపరేషన్ థియేటర్‌తో అనుసంధానంగా ఉండే 3టి ఐఎంఆర్ఐ యంత్రంతో ఆపరేషన్ మధ్యలో కూడా రోగికి పరీక్షలు నిర్వహించి లోపం ఉన్న భాగాన్ని తొలగించవచ్చునని చెప్పారు. ప్రస్తుతం ఖర్చుతో కూడుకున్న ఈ వైద్యం భవిష్యత్‌లో అందరికీ అందుబాటులోకి వస్తుందని ఆశిస్తున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో న్యూరో సర్జన్లు రాజేష్, సవిత్ర్ శాస్త్రి, వేణుగోపాల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పీఎన్‌బీ జీఎం అరెస్టు

నీరవ్‌కు ఎల్‌ఓయూలు జారీచేసినట్టు అభియోగం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: దేశాన్ని కుదిపేసిన రూ.11,400 కోట్ల కుంభకోణం కేసుకు సంబంధించి పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) జనరల్ మేనేజర్ ర్యాంక్ అధికారిని సీబీఐ అరెస్టు చేసింది. ముంబయిలోని బ్రాడీహౌస్ బ్రాంచ్ చీఫ్ రాజేశ్ జిందాల్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఆయన 2009-11 మధ్యకాలంలో బ్రాంచ్ మేనేజర్‌గా పనిచేశారని, మంగళవారం అర్ధరాత్రి కస్టడీలోకి తీసుకున్నామని సీబీఐ వెల్లడించింది. వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ గ్రూపుసంస్థలకు లెటర్స్ ఆఫ్ అండర్‌టేకింగ్ (ఎల్‌ఓయూ)లు జారీ చేయడంతో జిందాల్ కీలకపాత్ర పోషించారు. ఆయనే ఎల్‌ఓయూలు మంజూరు చేసినట్టు అభియోగం. రాజేష్ జిందాల్ ప్రస్తుతం పంజాబ్ నేషనల్ బ్యాంక్ న్యూఢిల్లీ ప్రధాన కార్యాలయంలో జనరల్ మేనేజర్ (క్రెడిట్)గా పనిచేస్తున్నారు. నీరవ్ మోదీ ఆయన మేనమామ మెహుల్ ఛోక్సీకి అక్రమ పద్ధతుల్లో ఎల్‌ఓయూలు జారీచేసినట్టు విచారణలో వెల్లడైంది.

నిర్మల్‌లో ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటుచేయండి

కేంద్రాన్ని కోరిన ఇంద్రకరణ్‌రెడ్డి ◆ సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి



కేంద్ర కార్మిక మంత్రి సంతోష్ గంగ్వార్‌తో సమావేశమైన తెలంగాణ దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: నిర్మల్ జిల్లా కేంద్రంలో యాభై పడకల ఈఎస్ఐ ఆసుపత్రిని ఏర్పాటు చేసేందుకు కేంద్ర కార్మిక మంత్రి సంతోష్ గంగ్వార్ సానుకూలంగా స్పందించారని తెలంగాణ దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి తెలిపారు. ఇంద్రకరణ్ బుధవారం ఢిల్లీలో సంతోష్ గంగ్వార్‌ను కలిసి నిర్మల్ కేంద్రంలో యాభై పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేయటం గురించి చర్చించారు. ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటుకు అవసరమైన పాత ఏరియా ఆసుపత్రి భవనాన్ని కేటాయిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసిందని ఇంద్రకరణ్ రెడ్డి కేంద్ర కార్మిక శాఖ మంత్రికి తెలిపారు. ఇంద్రకరణ్ రెడ్డి కేంద్ర మంత్రిని కలిసిన అనంతరం విలేఖరులతో మాట్లాడుతూ యాభై పడకల ఈఎస్ఐ ఆసుపత్రిని ఏర్పాటు చేసేందుకు సంతోష్ గంగ్వార్ సానుకూలంగా స్పందించారని చెప్పారు. ఏరియా ఆసుపత్రి భవనంలో ఈఎస్ఐ ఆసుపత్రిని ఏర్పాటు చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలన్న తన విజ్ఞప్తిని గంగ్వార్ ఆమోదించారన్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో ఈఎస్ఐ ఆసుపత్రిని ఏర్పాటు చేయటం వలన జిల్లాతోపాటు దీనికి సరిహద్దుల్లో ఉన్న జిల్లాల బీడీ కార్మికులకు వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని ఇంద్రకరణ్ రెడ్డి చెప్పారు. దీర్ఘకాలిక వ్యాధుల బారినపడ్డ అనేదిమంది బీడీ కార్మికులకు ఈ ఆసుపత్రి వలన ఎంతోమేలు జరుగుతుందన్నారు. ప్రస్తుతం ఈ ప్రాంతానికి చెందిన బీడీ కార్మికులు వైద్యంకోసం వ్యయ, ప్రయాసలకోర్చి సుదూర ప్రాంతాలకు వెళ్లవలసి వస్తోందని, ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు జరిగితే వీరందరికి ఎంతోమేలు జరుగుతుందని వివరించారు.

Printed and Published from Vijayawada by **K.Sudhakar** on behalf of Deccan Chronicle Holdings Limited at Deccan Chronicle Holdings Press, No.C 3 & 4, Patamata, Industrial Estate, Vijayawada. Chief Editor **T.V.Ravi Reddy,** Phones:2555284,2555185,2555287 Regd. No.AP/VJA/41/51/2000. RNI Registration No.52743/90

మాతృభూమి

పర స్త్రీలను తల్లులుగా
పర ధనమును మట్టివోలె భావించుటయే
పరమోన్నత సంస్కారము
సరళముగా పొందగల్గు సాయుజ్యమిదే

ఆంధ్రభూమి

గురువారం 22, ఫిబ్రవరి 2018

స్త్రీ శక్తి



సృష్టిలో స్త్రీ పురుషులు ఇద్దరూ సమానులే. అనగా + =0 అనగా పూర్ణము. రెండు అరసున్నలు కలిపితే సున్నా అవుతుంది. ఏ పని చేయడానికైనా పూర్ణసంఖ్యల్లో ఏ అరసున్నా అన్నా పనికి వస్తుంది. ఈ కలియుగంలో స్త్రీపురుషులు వేర్వేరు అని అనుకొంటున్నారు. కాని పూర్వకాలంలో స్త్రీపురుషులు అధ్యయనం మొదలుకొని అన్నింటా సమానంగా ఉండేవారు. గార్గేయి, మైత్రేయి, రుక్మిణి, దమయంతి ఇలా వీరంతా కూడాసర్వసృష్టికి ఆదర్శప్రాయులే.

- వివేకానంద విఠలాచార్య

బాధ్యతా మీదే బరువూ మీదే

ఒకరికి ఒకరు తోడుగా ఉంటామని ఏడడుగులు నడిచి పదిమంది ఆశీర్వాదంతో వధూవరులు ఒకటవుతారు. గృహస్థాశ్రమంలోకి అడుగుపెడతారు. అప్పటిదాకా ఇరువురు వేరు వేరు ప్రదేశాలల్లో జీవించినవారు ఇకపై ఒకచోటనే కలిసి జీవిస్తారు. ఇద్దరికీ వేర్వేరు అభిప్రాయాలు నిన్నటి దాకా ఉంటాయి. కాని ఇకమీద ఒకరి అభిప్రాయానికి మరొకరు గౌరవిస్తారు. ఒకరికి నచ్చిన విషయాలను మరొకరు నచ్చుకునేలా తమను తాము మార్చుకుంటారు.

ఇరుకుటుంబాల వారు వీరికి సాయంగా ఉంటారు. వీరు కొత్త జీవితాన్ని ఆరంభిస్తారు. మరికొద్దినాళ్లల్లోనే కొత్త వ్యక్తులను ఇద్దరూ కలసి ఆహ్వానిస్తారు.

కొత్తజీవితం కొంగొత్త అనుభవాలు ఆడవారికి ఎక్కువగా సొంతమవుతాయి. అంతాసజావుగా సాగితే చిక్కేలేదు. గృహిణిగా మారిన యువతి అమ్మగా మారుతుంది. ఆ పై అమ్మమ్మగానో నాయనమ్మగానో మారుతుంది. అందరికీ సలహాలుసంప్రదింపులు చేసే పవిత్రమూర్తిగా భాసిస్తుంది.

ఇదే మనభారతీయ సనాతన ధర్మాన్ని ప్రపంచదేశాలు ఆకర్షించేలా చేయగగ్గిన వ్యవస్థ. దాంపత్యమంటే నూరేళ్ల పంట. ఇక్కడ భార్యాభర్తలు ఇరువురు వేర్వేరుగా కనిపిస్తున్నప్పటికీ ఒక్కరుగా ఉంటారు. ఒకే నిర్ణయాలు వారిద్దరూ కలస్తేనే





కుటుంబం. ఆ కుటుంబం తీసుకొనే నిర్ణయాలు నలుగురికీ ఆదర్శవంతంగా ఉంటాయి.

కాని నేడు నలుగురు మెచ్చుకోకపోయినా ఫర్వాలేదుకాని నలుగురూ ఎద్దేవా చేసేట్లుగా కుటుంబాలు కుంపట్లుగా మారుతున్నాయి. ఇక్కడ నన్ను గౌరవించలేదని ఒకరికొకరు చెప్పుకుంటున్నారు. నా సంపాదన నా సంపాదన అనే వేర్వేరు గా సంపాదనలు చెబుకుంటున్నారు. ఇది నాది ఇది నీది ఇద్దరూ ఉద్యోగస్థులం కనుక పనిని విభజించుకోవాలి అన్నారు. సంపాదన విభజించుకోవాలి అంటున్నారు. ఇక్కడే అసలు సమస్య వస్తోంది.

పని విభజన కేవలం వెసలుబాటుకు ఏ ఒక్కరికీ అది భారం కాకుండా ఉండడానికి పనికి వచ్చేది. సంపాదన కూడా ఏ ఒక్కరూ అతిగా కష్టపడడమో లేక అతిగా సుఖపడడమో కాకుండా ఇరువురూ సమాన బాధ్యతలు సమాన బరువులు మోయడానికి వీలుగా ఉండడానికి మాత్రమే ఈ నిర్ణయాలు తీసుకోవాలి కాని మీ వాళ్లు వద్దు అనే భావన ఇద్దరిలోను రాకూడదు. కుటుంబం లోని భార్యభర్తల్లో ఏ ఒక్కరైనా నీ నా అనే ధ్యాసలో కొట్టుకుపోతుంటే మాత్రం ఆ కుటుంబం లోని పిల్లలపై ఆ ప్రభావం పడుతుంది. మొక్క వంగనిది మానై వంగునా అన్నట్టు పిల్లలు ఎక్కువగా అమ్మనాన్నలనే అనుకరిస్తుంటారు. కనుక వారిలో ఏ ఒక్కరైనా మీ నాన్న తరఫున వాళ్లు మంచివాళ్లు కాదనో, లేక మీ అమ్మతరఫు వాళ్లు మంచి వాళ్లు కారనో చెప్పితే అది పిల్లలపై చాలా ప్రభావం చూపుతుంది. ఇంట్లో ఎవరికీ చూపించకుండా తినమని చెప్పడం లాంటివి చేస్తే దొంగతనం అనేది ఉగ్గుపాలతో నేర్పించిన వారు అవుతారు. నాన్నకీ విషయం చెప్పొద్దుఅనో, లేక అమ్మకీ విషయం తెలియకూడదనో చెప్పినట్లు అయితే ఆ పెరిగే పిల్లలు రేపొద్దున మీకిద్దరికీ తెలియకుండా చేసే పనులు చేయడానికి మీరే దారి చూపిన వారు అవుతారు.

ఇలా ఎన్నో చెడుపనులను పెద్దలే పిల్లల చేత చేయించిన వారు అవుతారు. అందుకే ముందు మీరిద్దరూ కలసి మీలో ఒకరిపై ఒకరికి నమ్మకం కలిగేట్లుగా, మీరిద్దరూ కలసి కుటుంబాన్ని సక్రమమైన దారిలో నడిచేట్టు చేయడానికి మిమ్మల్ని మీరు సన్నద్ధం చేసుకోవాలి. మీలో ఉండే అసమానతలను పిల్లలపై రుద్దితే మీరు వర్తమానాన్ని చెడు చేసుకొన్నట్లుగానే రేపొద్దున భవిష్యత్తరంలో వెలుగుచూసే మీ పిల్లలు తప్పులు చేసి ఆ తప్పులకు శిక్షలు అనుభవించడానికి కారకులు మీరే అవుతారు. కనుక తల్లిదండ్రులుగా, భార్యాభర్తలుగా మీరు ఏం చేస్తున్నారో ఏం చేయాలనుకొంటున్నారో దాని ఫలితాలే విధంగా ఉంటాయో ఆలోచించుకుని మరీ చేయండి. మంచి కారకులు మీరే అయితే భవిష్యత్తరం మిమ్ములను సీతారాముల్లాగా గౌరవిస్తారు. లేకపోతే ఒక్క మండోదరిని కీర్తించినట్లు, ఒక్క సుగ్రీవుణ్ణి కీర్తించినట్టు మీలో ఎవరో ఒకరికి ఆ కీర్తికిరీటం దక్కుతుంది. అదిసరే కాని ప్రపంచ ప్రజలను ఆకర్షించే మన దాంపత్యవ్యవస్థ మీవల్ల మసిబారితే అది ఎవరికీ మంచిది కాదు కనక ఇక నుంచైనా మీలో అసమానతలు ఉంటే వాటిని సరిచేసుకోండి. భార్యాభర్తల నే పదబంధంలాగానే మీరు ఒక్కటిగా ఉండండి. మన సనాతన ధర్మాన్ని కాపాడండి. అపుడే మీరు మీ విద్యుక్త ధర్మాన్ని నిర్వర్తించిన వారు అవుతారు. దాంపత్య వ్యవస్థను రక్షించే బాధ్యత మాత్రం గృహస్థాశ్రమంలోకి వెళ్లే వధూవరులదే.

- వేంకటేశ ప్రసన్న



నేస్తం

అలసిన నా శరీరం సేదతీరాలంటోంది.
ఇంకా తీరం రాలేదు...
తొలి కిరణం ఇంకా భువినే చేరలేదు...
గడియ యైనా భారంగా గడుస్తోంది
ఎందాకా ఈ ప్రయాణం....
అలసిన నా శరీరం భారమౌతోంది....
నేస్తమనే ఊతం
ఎపుడు వచ్చేనో.....
దిగులు మేఘంకరిగేదెన్నడో
అడగడునా ఆటంక కంటకాలే
నేస్తమనే ఆసరా తో
తరువుతీరం అతిదగ్గరనుకొన్నా
నేస్తమనే పవనమొక్కటీ
వీచినట్లనపించీ
అర్థరాత్రి అంతా చీకటైనా
వెలుగుపూలపరిమళాన్ని
అంతదూరంనుంచే
ఆఘ్రాణించా
మెల్లమెల్లగా
నేస్తమనే మాధుర్యభావన
మనసుపొరల్ని ఆవరిస్తోంది
ఆశల చిగుర్లు అంకురిస్తున్నాయి
తరువు నీడలో తనువు సేద తీరుతోంది
నిన్న రాలిపోయినా
రేపొకటి రూపుదిద్దుకొంటోంది !!

కావ్యాంజలి

ఇంటిపేరు మార్చిన జిలేబి



జిలేబి వంటకంలో అర్వపల్లి రాజేశ్వరమ్మ

కవిత్వంలోనో, పాండిత్యంలోనో, సాహిత్యంలోనో నటనలోనో తనదైన ప్రత్యేకత సంతరించుకుని తన పేరుకన్నా ముందుగా వారి ఇంటిపేరో వారి రచన పేరో వారిపేరుకు ముందుగా ఉచ్చరించే ప్రాచుర్యం పొందిన సందర్భాలు మనకు సాధారణమే.కాని పల్లెటూరులోని చిరు హోటల్‌లో తయారయ్యే జిలేబి వ్యాపారమే ఆయన ఇంటిపేరును మార్చివేసిందంటే ఆ వంటకానికి ప్రజల్లో ఎంత ప్రాచుర్యం లభించిందో చెప్పకనే తెలుస్తుంది.

సంతమాగులూరులో 50 ఏళ్ల క్రితం వీధి అరుగుపై అర్వపల్లి వారు ప్రారంభించిన జిలేబి వ్యాపారం నేడు మూడంతస్తుల భవనంలో నడుస్తుడటం వ్యాపారాభివృద్ధికి నిదర్శనమైతే ప్రస్తుతం ఆ కుటుంబ సభ్యుల పేర్లకు ముందు జిలేబి అని చేరిస్తేనే గాని వారి చిరునామా తెలిసే పరస్థితికి వచ్చిందంటే వారి వంటకానికి ప్రజల్లో ఎంతటి ప్రాచుర్యం ఉందో చెప్పవచ్చు.

మండల కేంద్రమైన సంతమాగులూరులో ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన అర్వపల్లి వెంకటేశ్వర్లు చిన్నతనం నుంచి బేల్దారి పనులు చేసేవాడు. పెళ్లయిన తరువాత బేల్దారి కూలి పనులతో ఇల్లు జరగడం కష్టమైంది. అప్పడే తమ కులవృత్తి వ్యాపారం చేయాలని భార్య సూచన మేరకు గడ్డం వెంకటరెడ్డి ఇంటి ముందు వీధి అరుగుపై చిన్న గంపలో జిలేబి వంటకంతో వ్యాపారం ప్రారంభించారు. వారి జిలేబి వంటకం నాణ్యతతో కూడి రుచికరంగా ఉండటంతో సంతమాగులూరుతోపాటు పరిసర ప్రాంతాలవారు కూడా వివాహాది శుభకార్యాలకు ప్రత్యేకంగా సంతమాగులూరు జిలేబి వడించేవారు. ఈ నేపథ్యంలో జిలేబి వ్యాపారం దినదినాభివృద్ధి చెంది వీధివ్యాపారం కాస్తా పదేళ్లకు మూడంతస్తుల సొంత భవనంలోకి మారింది. వ్యాపారాభివృద్ధితో పాటు అర్వపల్లి వెంకటేశ్వర్లుతో పాటు కుటుంబ సభ్యులనందరిని ప్రజలు జిలేబి వెంకటేశ్వర్లు, జిలేబి ప్రసాద్, జిలేబి రాము అని పిలవడం అలవాటైపోయింది. దీంతో వారి ఇంటిపేరు కాస్త జిలేబిగా మారిపోయింది. ప్రస్తుతం వారి కుటుంబం ఆర్థికంగా స్థిరపడింది. వ్యాపారం ప్రారంభించిన కుటుంబ పెద్ద వెంకటేశ్వర్లు ఐదేళ్లక్రితం కన్నుమూశారు. అయినా ఇద్దరు కుమారులతో వెంకటేశ్వర్లు ధర్మపత్ని రాజేశ్వరమ్మ తమకు అన్నంపెట్టిన జిలేబి వ్యాపారాన్ని కొనసాగించాలనే సంకల్పంతో కుమారులతో వ్యాపారం కొనసాగిస్తున్నారు. ఒక కుటుంబం జీవితాల్లో వెలుగులు నింపడంతో పాటు ఇంటిపేరునే 'జిలేబి'గా మార్చిన ఆ వంటకం మధురాతిమధురం..

- బి కృష్ణారెడ్డి

జీడిపప్పుతో నోరూరించే పుచ్చకాయ



ఎండకాలం రాగానే పుచ్చకాయ తినాలని పిస్తోంది. ఇక్కడ జీడిపప్పుతోకూడా మెత్త మెత్తని పుచ్చకాయను అందంగా తయారు చేయవచ్చు చూడండి. పిల్లలు, పెద్దలు ఇష్టంగా తినవచ్చు.

కావలసిన పదార్థాలు

జీడిపప్పుపొడి: రెండు కప్పులు
పాలపొడి : రెండుకప్పులు
చక్కెర : రెండు కప్పులు
కండెన్స్‌డ్ మిల్క్ :రెండు కప్పులు
నల్లనువ్వులు :చెంచాడు
ఫుడ్ కలర్స్ ; ఎరుపు, ఆకుపచ్చ, చిటికెడు
నెయ్యి: తగినంత

తయారు చేసేవిధానం:

మొట్టమొదట జీడిపప్పు పొడి కోసం జీడిపప్పును మెక్సీలో మెత్తగా పొడి చేసుకోవాలి. అట్లానే చక్కెరను కూడా మెత్తగా పొడి చేసుకోవాలి. స్టవ్‌ను వెలిగించి చిన్న మంటపైన మూకుడులో కాస్త నెయ్యివేసి కండెన్స్‌డ్ మిల్క్ పోయాలి. చక్కెరను వేసి, చక్కెర కరగానే అందులో జీడిపప్పు పొడి, పాల పొడి రెండూ వేసి దగ్గరగా అయ్యేట్టు చేసి స్టవ్ కట్టేయాలి.

మూకుడు నుంచి ఆ జీడిపప్పు ముద్దను తీసి వేరే పళ్లెంలో పెట్టుకోవాలి. ఆ పళ్లెరానికి కాస్త నెయ్యి రాయాలి. చేతులకుకూడా నెయ్యిరాసుకుంటే పదార్థం అంటుకోదు.

- ఆ ముద్దను మూడు భాగాలు చేసుకోవాలి. రెండు భాగాల్లో ఒక్కోభాగానికి ఎరుపు, ఆకుపచ్చ రంగులను చిటికెడు వేసి కలుపుకోవాలి.
- మిగిలిన భాగంలో నల్లనువ్వులు వేయించి అందులో కలుపుకోవాలి. ఇప్పుడు మూడు భాగాలను చిన్న చిన్న ఉండలు చేసుకోవాలి.
- ముందు నల్లనువ్వులు కలిపిన ముద్దను చిన్న చిన్న ఉండలు చేసుకొనాలి.

ఇపుడు ముందుగా నల్లనువ్వులు కలిపిన ఉండను తీసుకొని దానిపైన ఎరుపు రంగు కలిపిన ఉండను చుట్టండి. ఇపుడు మీ చేతిలో నల్లనువ్వులు కలిపిన ఉండ కనిపించకుండా ఎర్రటి ఉండమాత్రమే కనిపించేలాగా చేయండి. ఆ తరువాత ఆకుపచ్చ రంగు ఉండను చుట్టండి. ఇపుడు మీ చేతిలో ఆకుపచ్చ ఉండమాత్రమే కనిపిస్తుంది.

అలంకరణ

ముందు ఒక పళ్లెంలో మీరు చేసిన ఆకుపచ్చటి ఉండను ఒకదాన్ని తీసుకొన చిన్న చాకుతో అడ్డంగా కోయండి. ఆ తరువాత పుచ్చకాయను కోసుక్కున్నట్లుగా ముక్కలుగా ఉండలన్నీ కోయండి.

మీ పళ్లెంలో జీడిపప్పు పుచ్చకాయ ముక్కలు రెడీ....

- శ్రీ చరణ

ఇదిగోండి పరిష్కారం!



ఇంట్లో చాలామంది గలగలామాట్లాడేస్తుంటారు. అదే నలుగురిలోకి వెళ్లి మాట్లాడమంటే తడబడుతుంటారు. నేటికాలంలోమహిళామండలులు ప్రతి కాలనీకి ఒక్కటి ఉన్నాయి. ఆ మహిళా మండలిలోనో లేక ఏ టీవీ చానల్ వాళ్లో వచ్చి నాలుగు మాటలు చెప్పండి అని అడిగితే చాలు గొంతు తడారిపోతుంటుంది. మాటలు పెగలవు. ఎందుకిలా జరుగుతోంది.


మరేంలేదు. కేవలం అలవాటు లేక ఇదంతా జరుగుతుంది. మెల్లమెల్లగా అలవాటు చేసుకోండి. ముందుగా మీ అపార్ట్‌మెంట్‌లోనో, లేక మీ స్నేహితులతో మాట్లాడండి. దానికన్నా ముందు విషయం మీద పట్టు సాధించండి. అవగాహన పెంచుకోండి. దేనిగురించి మాట్లాడుతున్నామో దాన్ని గురించి పూర్తి అవగాహన ఉంటేచాలు. మొదలు భయపడినా గొంతుతడారినా వణుకు వచ్చి చిరు చెమటలు పోసినా సరే మీరు కొద్దిసేపట్లోనే మామూలు స్థితికి వచ్చేస్తారు.

ఇక ఆ తరువాత మీకున్న విషయ పరిజ్ఞానంతో ప్రేక్షకులను ఆకట్టుకొంటారు. మొట్టమొదట అందరినీ ఒకసారి పలకరింపుగా మాట్లాడండి. మెల్లగానైనా చిరునవ్వు వచ్చేట్టుగా మాట్లాడడం ఆరంభించండి. శ్రోతల్లో ఆసక్తి పెరుగుతుంది. తప్పకుండా మీరు చెప్పేది వింటారు. అన్నీ తెలిసిన విషయాలే అయినా వాటికి రంగు రుచివాసన వచ్చేవిధంగా సామెతలు,జాతీయాలు, పలుకుబళ్లు ఉపయోగించండి. విషయాన్ని ఇంతకు ముందుకాలంలో ఎవరైనా ఎదుర్కొన్నారేమో చూసి చెప్పండి. భవిష్యత్తులో మీరు ఆ పనిని నిర్వర్తిస్తే వచ్చే లాభాలు మీదృష్టిలో ఎలా ఉంటాయో వాటిని పరిశోధనాత్మకంగా చెప్పండి. ఇక ఏమి శ్రోతలే కాదు వేదకనలంకరించిన ఉన్న పెద్దలూ మీకు చప్పట్లు కొడుతారు. ఇక అపుడు మీరే ఏ భయం సంకోచం లేకుండా చక్కని భాషా పటిమతో మాట్లాడుతారు. తెలుగునాట మాట్లాడేటపుడు తెలుగులోనే మాట్లాడండి. ఎక్కడికి వెళ్లినా అక్కడ తెలుగు వారు ఉంటే వారితో తెలుగులోనే మాట్లాడండి. తెలుగు తెలీని వాళ్లు ఉన్నప్పుడే మరో భాషలో మీరు ఉపన్యాసం ఇవ్వండి. అపుడు మీకు మీ భాషపై ఉన్న మక్కువ తెలుస్తుంది. అదేకాదు మీరు రోజూమాట్లాడే భాషే కనుక అనర్గళంగా మాట్లాడేస్తారు.విషయాన్ని మరింత విపులంగా చెప్పడానికి మీ భాష మీకు తోడుగా ఉంటుంది. ఇక ఉపన్యాస కేసరి అనే బిరుదునివ్వడానికి శ్రోతలు వెనుకాడరు.

-ఎస్. లక్ష్మి

ప్రతిరోజూ ఉల్లాసంగా సాగిపోవాలంటే..

- ప్రతీ ఉదయం నిత్యనూతనమే. కొత్తవిషయాలకు వేదిక. కొత్త విషయాలు నేర్చుకోవడంలో మనల్ని మనం సుసంపన్నం చేసుకోవాలి.
- ఏ మనిషైనా ఒక రంగంలో అత్యున్నత శిఖరాలను అధిరోహించాలంటే కనీసం పదివేల గంటలైనా కృషి చెయ్యాలన్నది ఓ శాస్త్రీయ అంచనా. అంటే మనలో అందరికీ గొప్పవాళ్లయ్యే అవకాశం ఉంది. మనకి ఇష్టమైన రంగంలో ప్రతిరోజూ వీలైనంత సేపు కృషి చేస్తే మనకీ చరిత్రలో సమున్నత స్థానం లభించే అవకాశం ఉంది.
- మనం జీవితాన్ని ప్రతిక్షణం ఆనందంగా ఆస్వాదించాలంటే మన ఆరోగ్యం, ఆలోచనలు సరైన రీతిలో ఉండాలి. ఆరోగ్యం కోసం ప్రతిరోజూ వ్యాయామం, సమతులాహారం తప్పనిసరి. మంచి ఆలోచనల కోసం ఉత్తమ సాహిత్యం, యోగా చేయడం, సంగీతం, ప్రకృతి ఆరాధన, ఆధ్యాత్మిక చింతన లాంటివి ఎంతగానో ఉపయోగపడతాయి.



కర్మభూమి

రచనే, చిత్రమో నాట్యమో
రుచి పెంచెడి కర్మమొకటి ఋతమై నిలుచున్
శుచియౌ ప్రేరణ నొసగుచు
కాచుచుబోచును మనుజుల కాంక్షలు తీర్చున్

'తెర' వెనుక

నాటకం/నాటిక సంపూర్ణంగా పండాలంటే అందులో సమష్టి కృషి ఉంటుంది. ఒక దర్శకుడు, ఒక నటుడు, ఒక నటి, ఒక సంగీత దర్శకుడు... ఇలా... అంతా వారి వారి బాధ్యతల్లో నూటికి నూరుపాలు మమేకమైనప్పుడే ఫలితం చేతికందుతుంది. కాని, నాటకం ఇంతగా అందరినీ ఆకట్టుకోవాలంటే వీరే కాదు తెరవెనుక వాళ్లూ కావలసిందే.

నాటకం ప్రదర్శనలో పాత్రధారులు ప్రేక్షకులకు కనిపిస్తే, తెరవెనుక సూత్రధారులు దర్శనమివ్వరు. వారిని ప్రస్తావించేవారు తక్కువగా ఉంటారు. నటులకు అలంకరణ చేసేవారు, దుస్తులు ఎంపిక చేయడం వారిని ధరింపచేయడం, అంతేకాదు రంగస్థలాన్ని వేయబోయే నాటికకు అనుకూలమైన వాతావరణం, పరిస్థితులను కల్పించడం అంటే ఆషామాషిగాదు. నాటకంలోని నటుడు/నటి అభినయానికీ, ఆ పాత్రోచితంగా కదలికల నియమాలకు అనుగుణంగా రంగస్థల అలంకరణ ప్రధానం. నాటికలోని వాతావరణ పరిస్థితులు కల్పించాలంటే రంగస్థల అలంకరణ చేసేవారికి నాటిక గురించిన పూర్తి సమాచారం కావాల్సి ఉంటుంది. అపుడే ఆ రంగస్థలం వేయబోయే నాటికను పండిస్తుంది. అందుకే ఒక్క నటునివల్లో, దర్శకునివల్లో కాదు నాటిక పండించడానికి ఎంతమంది పని చేస్తారో వారందరి సమిష్టికృషినే నాటిక లేదా నాటకం ప్రేక్షకులను ఆకట్టుకొంటుంది. ■



వ్యూహం

50 అలపర్తి రామకృష్ణ

"విష్‌యు హేపీ జర్నీ సార్" అంది లోహిత.

"ఈ ప్రయాణాలు నాకు మామూలే! ముంబై, పాట్నా తరచుగా వెళ్తానే వుంటాను.. నీ పెళ్లి కుదిరితే నాకు ఫోన్ చేసి చెప్పు!" అన్నాడు అరవింద్ కారు ఎక్కుతూ.

నవ్వుతూ అక్కడే వుండిపోయింది కారు స్టార్ట్ అయ్యేదాకా.

డాక్టర్ అరవింద్ వెళ్ళేక పెద్దగా నిట్టూర్పు విడిచింది.

***

ఎయిర్‌పోర్టులో కారు డిపార్చర్ వింగ్ దగ్గర ఆగింది.

బ్రీఫ్‌కేసు భద్రంగా పట్టుకుని కారుదిగాడు. డ్రైవరు డిక్కీలో వున్న ట్రావెలర్ బ్యాగ్ తీసి ఇచ్చాడు. ఆ బ్యాగ్‌లో అతని బట్టలు, షేవింగ్ సెట్, మందులు వుంటాయి. అతను ఎప్పుడు ప్రయాణమైనా ఆ బ్యాగ్ సిద్ధంగా ఉంచుతాడు డ్రైవర్.

ట్రావెలర్ బ్యాగ్ చెక్ ఇన్ కౌంటర్ దగ్గర ఇచ్చేశాడు.

సెక్యూరిటీ చెక్ అయ్యేక లోపలికి వెళ్ళాడు.

ఫ్లయిట్‌కు ఇంకా అరగంట టైముంది.

చేతిలోని బ్రీఫ్ కేసు వెయిట్ తక్కువగా వున్నట్లు అన్పించింది.

బ్రీఫ్‌కేసు నిండా డాక్యుమెంట్లు పెట్టాడు.. తన ఛాంబర్ నుంచి వచ్చేటప్పుడు కొంచెం బరువుగానే అన్పించింది.

ఇప్పుడు తేలిగ్గా వుందేమిటి?

అనుమానం వచ్చింది.

లాంజ్‌లో కూర్చుని బ్రీఫ్‌కేసు ఓపెన్ చేశాడు. దాన్నిండా పాత వారపత్రికలు వున్నాయి.. వారపత్రికలు చదివే తీరిక తనకు ఎక్కడుంది?

కాశీ కూడా చదవడు.. మరి ఎవరు తన బ్రీఫ్‌కేసులో పెట్టారు.. బ్రీఫ్‌కేసువైపు పరీక్షగా చూశాడు.. 'హష్‌పప్పీస్' కంపెనీవాళ్ళ బ్రీఫ్ కేసు. ఆరునెలల క్రిందట ఢిల్లీలో కొన్నాడు రెండు బ్రీఫ్‌కేసులు. ఒకటి కాశీకి ఇచ్చాడు. రెండోది తన దగ్గరవుంది.

కాశీకి ఫోన్ చేశాడు.

"నా బ్రీఫ్‌కేసు మారిపోయింది.. నువ్వేమన్నా మార్చావా? డాక్యుమెంట్లు వున్న బ్రీఫ్‌కేసు ఏమయింది?' అడిగాడు.

"మీ బ్రీఫ్‌కేస్‌లో మీరే సర్దుకున్నారు. పెద్ద ట్రావెల్ బ్యాగ్ మాత్రం నేనూ డ్రైవర్ కలిసి మీ బట్టలు సర్దాం.. మీ బ్రీఫ్‌కేసు సంగతి నాకు తెలియదు" సమాధానమిచ్చాడు కాశి.



పిచ్చెక్కినట్లుగా వుంది అరవింద్‌కు. తల పట్టుకుని కూర్చున్నాడు. వచ్చేటప్పుడు బ్రీఫ్‌కేసును చెక్ చేశాడు. అందులో డాక్యుమెంట్లు వున్నాయి..

మధ్యలో ఏమైనట్లు?

తను ఎవరికీ ఇవ్వలేదు.

అప్పుడు గుర్తుకు వచ్చింది.

... ఛాంబర్ నుంచి బయటకు వచ్చేటప్పుడు డాక్టర్ లోహిత ఎదురుపడింది.. తనతోపాటు లిఫ్ట్ ఎక్కింది.. ఆమె చేతిలో కూడా బ్రౌన్ కలర్ బ్రీఫ్‌కేసుంది.. అచ్చం తన బ్రీఫ్‌కేసులాగే వుంది.

నెక్ టై, కోట్ బటన్లు సరిచేసుకుంటూ బ్రీఫ్‌కేసు కిందపెట్టాడు. ఆమె లిఫ్ట్ ఆపరేట్ చేస్తూ తన బ్రీఫ్‌కేసు ప్రక్కనే ఆమె బ్రీఫ్‌కేసు పెట్టింది.. అక్కడ మారిపోయిందేమో! పొరపాటున మారిపోయిందా?

ఆమె ఊరికి వెళ్తున్నట్లు చెప్పింది. మరి బ్రీఫ్‌కేసులో పాత వారపత్రికలు ఎలా వస్తాయి? కాశీ దగ్గర వుండాల్సిన హష్ పప్పీస్ బ్రీఫ్‌కేసు ఆమె దగ్గరకు ఎలా వచ్చింది?

వాళ్ళిద్దరూ కలిసి డాక్యుమెంట్లు మాయం చేసి వుంటారేమో

కాశీకి తెలియకుండా అతని దగ్గర వున్న బ్రీఫ్‌కేసు కాజేసిందా?

డాక్టర్ లోహితకు ఫోన్ చేశాడు. స్విచ్ఆఫ్‌లో వుంది ఆమె ఫోన్. అరిఫ్‌కు ఫోన్ చేసి డాక్యుమెంట్లు గల్లంతు అయిన సంగతి చెప్పాడు అరవింద్.

"సర్లే! నువ్వు ముంబై వచ్చెయ్యి.. కొన్ని లీగల్ డాక్యుమెంట్లు మీద సంతకాలు పెట్టాలి! మనవాళ్ళకు చెబుతాను.. డాక్టర్ లోహితను నిర్బంధించి డాక్యుమెంట్స్ ఎక్కడ పెట్టిందో తెలుసుకుంటారు.. కాశీ సంగతి తరువాత ఆలోచిద్దాం..!"

ఫ్లయిట్ టెర్మినల్‌కు చేరుకున్నట్లు, బయలు దేరడానికి సిద్ధంగా వున్నట్లు ఎనౌన్స్‌మెంట్ వచ్చింది.

***

ముంబై సెకెండ్ లార్జెస్ట్ సిటీ ఇండియాలో.

ఇంద్రభవనంలా వుండే పెద్ద భవంతుల్లో వుండేవాళ్ళు వుంటారు. రోడ్డుప్రక్కన రేకుల షెడ్డులో వుండేవాళ్ళూ వుంటారు. దేశం కోసం ప్రాణాలు ఇచ్చేవాళ్ళు వున్నారు. దేశాన్ని నాశనం చేసే మాఫియా గ్యాంగులకు నిలయంగా వుంటుంది ముంబై.

చర్చిగేటు ప్రాంతంలో అరిఫ్ భవనం వుంది. విశాలమైన ఆవరణలో వుంది. చుట్టూ పెద్ద ప్రహరీ గోడ. సెక్యూరిటీ గార్డులు అనుమతి లేనిదే ఎవరిని వెళ్ళనివ్వరు. వందమంది పనివాళ్ళు వున్నారు. ల్యాండ్ సెటిల్‌మెంట్లు జరుగుతూ వుంటాయి అక్కడ. గవర్నమెంటు ఫైల్స్ అక్కడకు చేరుకుంటాయి.

దుబాయినుంచి అరిఫ్ వచ్చేడంటే మరింత కోలాహలంగా వుంటుంది అక్కడ.

అరిఫ్ ఛాంబర్‌లోకి అడుగుపెట్టాడు డాక్టర్ అరవింద్.

"వారం రోజుల్నుంచి స్కంద ఇక్కడే వుంటున్నాడు.. ఏం పనిమీద వచ్చాడో? సిటీ పోలీసు కమిషనర్‌తో కలిసి తిరుగుతున్నాడట. ఏ వ్యవహారం చక్కబెట్టడానికి ఇక్కడకు వచ్చాడో అర్థం కావడంలేదు" అన్నాడు అరిఫ్ తెల్లటి గడ్డం నిమురుకుంటూ.

అరిఫ్‌తో ఏం మాట్లాడినా చిక్కే!

ఇంకాఉంది


మొదటి ప్రశ్న

మామూలుగా అందరిలాగే పెరిగి వుంటే జబ్బులూ, రోగాలూ, వార్ధక్యం, మరణం - ఇవన్నీ సహజంగానే ప్రతి మనిషికీ వచ్చి తీరతాయని తెలిసి వుండేది సిద్ధార్థుడికి. అయితే ఒక్కసారి అంతఃపుర వాసం విసుగు పుట్టి బలవంతంగా బయటికి రథంలో వెళ్లినప్పుడు 'మరణించిన ఒక మనిషి' శవాన్ని చూసిన వెంటనే తన రథసారథిని అడిగాడు. ఏమైంది ఈ మనిషికి! ఇది అతడి మొదటి ప్రశ్న!

అతడు మరణించాడు అని చెప్పాడు రథసారథి. నేను మీకు చెప్పకూడదు. ఊళ్లో అందరికీ ముందే చాటించి చెప్పారు. మీరు నగరంలోకి వస్తున్నారని, కాబట్టి ఏ రోగిష్ఠివాడూ, ఏ వృద్ధుడూ, ఏ శవమూ మీకు కనిపించకూడదని. అయినా నేను మీకు అబద్ధాలు చెప్పలేను. సత్యం చెపుతున్నాను. ఇది అతడి శవం. మరణించాడు.

సిద్ధార్థుని రెండవ ప్రశ్న: నాక్కూడా ఇలా జరుగుతుందా?

రథసారథి : అవును యువరాజా! చెప్పడం ఇష్టం లేకున్నా మీకు అబద్ధం చెప్పకూడదు. అందరికీ ప్రతి ఒక్కరికీ ఇదే జరుగుతుంది. ఏ ఒక్కరూ దీన్ని తప్పించుకోలేరు. ఎవరినీ విడిచి పెట్టదు 'మృత్యువు'.



మూడవ ప్రశ్న: కాషాయ వస్త్రాలు ధరించిన ఓ సన్యాసిని చూసి అడిగాడు గౌతముడు. ఎవరీ మనిషి? ఏమిటీ విచిత్ర వేషధారణ?

బుద్ధుడికి రథసారథి చెబుతున్నాడు. ఈ మనిషి శాశ్వతత్త్వం కోసం వెదుకుతున్నాడు. జీవితం క్షణికమే అన్న సత్యాన్ని ఆ మనిషి తెలుసుకున్నాడు. జీవితం ఓ కల వంటిదనీ, తెలుసుకున్న ఆ సన్యాసి, తన దేహం మరణించినా, మరణించకుండా తనలో ఇంకేదైనా మిగిలి వుంటుందా.. లేకపోతే శూన్యం మాత్రం మిగిలుంటుందా.. అనే విషయాన్ని గురించి తెలుసుకోవాలని అన్వేషిస్తున్నాడు. సత్యాన్వేషి ఆయన.

గౌతముడు సాంవత్సరిక యౌవనోత్సవాన్ని మొదలుపెట్టడానికి పిలువబడ్డాడు. తప్పనిసరి పరిస్థితుల్లో ఇష్టం లేకున్నా తండ్రి కుమారుడిని పంపవలసి వచ్చింది ఆ యొక్క యవ్వనోత్సవానికి. రథాన్ని మళ్లించు. నన్ను ఇంటికి చేర్చు. నేను మోసగించబడ్డాను. ఏమీ తెలియకుండా పెంచారు నన్ను అని విరక్తితో రాజభవనానికి వెళ్లిపోయాడు గౌతముడు.

అత్యంత ప్రియతమురాలు మేనమరదలు - భార్య అయిన యశోధరను, అప్పుడే జన్మించిన ప్రియతమ కుమారుడిని వదిలి వెళ్లిపోయాడు గౌతముడు ఎవ్వరికీ చెప్పకుండా. ఆ రోజు రాత్రి జన్మించిన రాహులుడిని కనీసం గదిలోకి వెళ్లకుండా వాకిలి వద్ద నుండే చూసి, మళ్లా దగ్గరికి వెడితే బంధంతో వెనుదిరగనేమో అనే భావనతో వెళ్లిపోయాడు.

బుద్ధుడు ఇల్లు విడిచి, భార్యా, కొడుకు, తల్లిదండ్రులను, అధికారాన్ని, రాజ్యాన్ని విడిచి వెళ్లిపోయింది కామానికి భయపడి కాదు, అప్పటిదాకా తానొక చెరసాలలో వున్నానని తెలుసుకోగలిగాడు కనుక. ఆపైని బుద్ధుడి కథను మరొక సందర్భంలో చెప్పుకుందాం.

బుద్ధుడి ప్రజ్ఞోదయం ఎంతో సులభమైన అతిసౌఖ్యపు సంభవం. ఆ దారి ఎంతో సుగమం, సులభం, స్పష్టం. 'ఆనాపానసతి' అనబడే 'శ్వాస మీద ధ్యాస' ధ్యానాన్ని మీరు కులాసాగా కూర్చుని మీరు మీ అంతరంలోకి వెళ్లి ఆ 'ధ్యానమేలుకొలుపు'ను ఆనందంగా అనుభవించవచ్చు.

గౌతమ బుద్ధుడికి జ్ఞానోదయం ఉండినంత దూరం మనకు లేదు. ఓ అంధుడు వెతికినట్లు ఆయన దాని కోసం వెదికాడు. ఎంతోకాలం తానెక్కడికి వెళుతున్నాడో తనకే తెలియకుండా! కానీ ఎంతో ధైర్యం, నిబ్బరం ఉన్న బుద్ధుడు పన్నెండు సంవత్సరాలు నిరంతరం అన్వేషించాడు. ఆ రోజుల్లోని అన్ని పద్ధతులనూ, మార్గాలనూ ప్రజ్ఞోదయం కోసం అనుసరించాడు. వేదాంతం గురించీ, యోగశాస్త్రం గురించీ ఎందరో ఆచార్యుల మాటలను విని ఆచరించాడు. ఓ ఆచార్యుడి నుండి మరొక ఆచార్యుడి వద్దకు అయిదేళ్లు తిరిగాడు. చివరికి ఓ వైశాఖ పూర్ణిమ రోజు ఓ బోధివృక్షం కింద సాధించాడు అపూర్వ జ్ఞానోదయాన్ని! అనంత సత్య సంభవాన్ని! ఏ సంకల్పాలూ లేని క్షణంలో ఉన్నట్లుండి గౌతముడు బుద్ధుడయ్యాడు.

-మారం శివప్రసాద్



రాశిఫలం

- గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

● **మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా.)**
మానసికాందోళనతో కాలం గడుస్తుంది. ఆరోగ్యం విషయంలో శ్రద్ధ వహించక తప్పదు. ప్రయత్న కార్యాలు ఆలస్యంగా సఫలమవుతాయి. చెడు పనులకు దూరంగా నుండుట మంచిది. వృత్తి ఉద్యోగ రంగాల్లో అభివృద్ధి ఉంటుంది. స్థిరాస్తులకు సంబంధించిన విషయాల్లో జాగ్రత్త అవసరం.

● **వృషభం (కృత్తిక 2, 3, 4పా., రోహిణి, మృగశిర 1, 2పా.)**
గౌరవ మర్యాదలకు లోపముండదు. అనవసర వ్యయప్రయాసలుంటాయి. వృథా ప్రయాణాలెక్కువ చేస్తారు. మానసికాందోళనతోనే కాలం గడుపవలసి వస్తుంది. బంధు, మిత్రులతో వైరమేర్పడకుండా జాగ్రత్త వహించాలి. శారీరకంగా బలహీనులవుతారు. విందులు, వినోదాల్లో పాల్గొంటారు.

● **మిథునం (మృగశిర 3, 4 పా., ఆరుద్ర, పునర్వసు 1, 2, 3పా.)**
మీ మంచి ప్రవర్తనను ఇతరులు ఆదర్శంగా తీసుకుంటారు. ప్రయత్న కార్యాలన్నింటిలో విజయాన్ని సాధిస్తారు. దైవదర్శనం చేసుకుంటారు. స్థిరాస్తులకు సంబంధించిన సమస్యలు పరిష్కరించుకుంటారు. కళలందు ఆసక్తి పెరుగుతుంది. నూతన వస్తు, వస్త్ర ఆభరణాలను పొందుతారు.

● **కర్కాటకం (పునర్వసు 4 పా., పుష్యమి, ఆశ్రేష)**
కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా వుంటాయి. ఆరోగ్యం గూర్చి శ్రద్ధ వహించాలి. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతారు. నూతన కార్యాలు ప్రారంభించకుండా నుండుట మంచిది. ఆత్మీయుల సహాయ సహకారాలకై సమయం వెచ్చించాల్సి వస్తుంది.

● **సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)**
బంధు, మిత్రులతో విరోధమేర్పడకుండా జాగ్రత్తపడుట మంచిది. ఆర్థిక ఇబ్బందులనెదుర్కొంటారు. స్వల్ప అనారోగ్య బాధలుంటాయి. వృత్తి, ఉద్యోగ రంగంలో అభివృద్ధి ఉంటుంది. మానసికాందోళనతో కాలం గడుస్తుంది. ప్రయత్న లోపం లేకున్నా పనులు పూర్తిచేసుకోలేకపోతారు.

● **కన్య (ఉత్తర 2, 3, 4పా., హస్త, చిత్త 1, 2 పా.)**
పట్టుదలతో కొన్ని కార్యాలు పూర్తిచేసుకోగలుగుతారు. పిల్లలపట్ల జాగ్రత్తగా నుండుట మంచిది. వృత్తిరీత్యా గౌరవ, మర్యాదలు పొందుతారు. కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా ఉంటాయి. మనోల్లాసాన్ని పొందుతారు. స్వల్ప అనారోగ్య బాధలుంటాయి.

● **తుల (చిత్త 3, 4పా., స్వాతి, విశాఖ 1, 2, 3పా.)**
అనారోగ్య బాధలు అధికమవుతాయి. అకారణంగా కలహాలేర్పడే అవకాశాలుంటాయి. అనవసర భయానికి లోనవుతారు. విద్యార్థులు చంచలంగా ప్రవర్తిస్తారు. వ్యాపార రంగంలోనివారు జాగ్రత్తగా నుండుట మంచిది. స్త్రీలు పిల్లలపట్ల మిక్కిలి శ్రద్ధ వహిస్తారు.

● **వృశ్చికం (విశాఖ 4 పా., అనూరాధ, జ్యేష్ఠ)**
తలచిన కార్యాలకు ఆటంకాలెదురవుతాయి. స్థిరాస్తులకు సంబంధించిన సమస్యల్లో జాగ్రత్తగా నుండుట మంచిది. మోసపోయే అవకాశాలుంటాయి. ఆర్థిక పరిస్థితి ఆందోళనకరంగా మారుతుంది. నూతన కార్యాలు ప్రారంభించరాదు. ప్రయాణాలెక్కువ చేస్తారు.

● **ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా.)**
విదేశయాన ప్రయత్నాలు అనుకూలిస్తాయి. అనారోగ్య బాధలు అధికమవుతాయి. ఆకస్మిక ధననష్టమేర్పడే అవకాశముంటుంది. బంధు, మిత్రులతో విరోధమేర్పడకుండా జాగ్రత్త వహించుట మంచిది. అనవసర వ్యయప్రయాసలుంటాయి. ప్రయాణాలెక్కువ చేస్తారు.

● **మకరం (ఉత్తరాషాఢ 2, 3,4పా., శ్రవణం, ధనిష్ఠ 1, 2పా.)**
అపకీర్తి రాకుండా జాగ్రత్తపడుట మంచిది. స్వల్ప అనారోగ్య బాధలుంటాయి. ప్రయాణాల్లో వ్యయ ప్రయాసలు తప్పవు. కలహాలకు దూరంగా ఉండుటకు ప్రయత్నించాలి. దూర వ్యక్తుల పరిచయం ఏర్పడుతుంది.

● **కుంభం (ధనిష్ఠ 3, 4పా., శతభిషం, పూర్వాభాద్ర 1,2, 3పా.)**
ఆర్థిక ఇబ్బందులుండవు. నూతన వస్తు, ఆభరణాలను ఖరీదు చేస్తారు. స్నేహితులను కలుస్తారు. ఇతరులకు మంచి సలహాలు, సూచనలిస్తారు. సంఘంలో గౌరవం పెరుగుతుంది. ధైర్యసాహసాలతో కొన్ని పనులు పూర్తిచేస్తారు. శుభవార్తలు వింటారు.

● **మీనం (పూర్వాభాద్ర 4 పా., ఉత్తరాభాద్ర, రేవతి)**
ఊహించని కార్యాల్లో పాల్గొనే అవకాశముంటుంది. వృత్తి, ఉద్యోగ రంగాల్లో అభివృద్ధి ఉంటుంది. ఆత్మీయులను కలియుటలో విఫలమవుతారు. అనవసర వ్యయ ప్రయాసలవల్ల ఆందోళన చెందుతారు. వృథా ప్రయాణాలెక్కువగా ఉంటాయ. స్త్రీల మూలకంగా ధనలాభముంటుంది. ■


నేర్చుకుందాం — నరసింహ శతకం

సీ॥ పుండరీకాక్ష! నారెండు కన్నులనిండ
నిన్నుఁజూచెడి భాగ్యమెన్నడయ్య!
వాసిగా నామనోవాంఛ దీరెడునట్లు
సొగసుగా నీ రూపుఁ జూపవయ్య!
పాపకర్ముని కంటబడక పోవుదమంచుఁ
బరుషమైన ప్రతిజ్ఞ పట్టినావ?
వసుధలోఁ బతితపావనుఁడవీవంచునేఁ
బుణ్యవంతుల నోటఁ బొగడవింటి


తే॥ నేమిటికి విస్తరించె నీకింత కీర్తి
ద్రోహినైనను నా కీవు దొరకకున్న?
భూషణ వికాస శ్రీధర్మ పురనివాస!
దుష్టసంహార! నరసింహ! దురితదూర!

భావం: ఓ ప్రభూ! నీవు తెల్లదామరల బోలిన కన్నులు గలవాడవు. నా కళ్లారా నిన్ను చూచే భాగ్యమెప్పుడు కల్గుతుంది? నా కోర్కె బాగా నెరవేరేటట్లు నీ రూపాన్ని నాకు చూపవా? ఈ పాపిష్ఠివాని కంట పడరాదని ఏమైనా ప్రతిజ్ఞ చేశావా? ఈ ప్రపంచంలో బాధితుల్ని కాపాడేవాడవు నీవేయని పుణ్యాత్ములు నిన్ను పొగడగా విన్నాను. నావంటి పాపికి దొరకవు గదా! నీకింత పేరెట్లు వచ్చింది?

ఆమె నవ్వింది



గోరాశాస్త్రి గారి రేడియో నాటిక



వినమరుగైన..

సూర్య: నేనండి, సూర్యారావుని. నిన్న యిద్దరం కలుసుకున్నాం- ఇక్కడే. జ్ఞాపకం లేదూ?

వై: మళ్లీ తయారా? ఇదిగో విను- నువ్వెవడివో నాకు తెలియదు.

సూర్య: చెప్తినిగా- సూర్యారావని! మీ చెల్లెలు వాసంతి నాకు బాగా తెలుసు..

వై: షటప్! ఫో అవతలికి.

సూర్య: వెరీగుడ్, అందమైన ఆడదానికి కోపం వస్తే యింకా అందంగా కనబడుతుంది. చూడండి వైదేహిదేవి! మొగాళ్ళని చూసి ఇంత భయపడితే ఆఫీసులో ఉద్యోగం ఎలా చేస్తున్నారండీ?

వై: నువ్విక్కడ నుంచి పోతావా, పోవా? పోలీసులకి అప్పగిస్తాను జాగ్రత్త!

సూర్య: ఏడీ పోలీసు? కనుచూపు మేర మనిషే లేడు! చూడండి- ఎంతసేపని యిలా బస్సుకోసం పడిగాపులు పడి నించుంటారు! అదిగో అదే నా కారు, ఇంటి దగ్గర ఒదిలేస్తాను రండి

వై: ఏయ్, ఇడియెట్, అడుగు ముందుకు వేశావా, జాగ్రత్త!

సూర్య: ఇదిగో వేశాను, ఏం చేస్తావ్?

వై: ఏం చేస్తానా? *(ఛెళ్ళుమని లెంపకాయ కొట్టిన చప్పుడు)*

సూర్య: అయినా ఫర్వాలేదు రా, అదిగో కారు.

వై: ఏయ్- చెయ్యి వదులు! బాబోయ్! *(గట్టిగా అరుస్తుంది దూరం నుంచి 'ఎవరదీ- ఎవరదీ' అని కేక)*

రామా: ఎవరదీ, ఏయ్ - ఎవరు నువ్వు, వెధవా! *(రెండు దెబ్బలు కొట్టిన చప్పుడు)* ఫో, వెధవా *(దూరంగా కారు వెళ్లిపోయిన చప్పుడు)* ఎవరమ్మా మీరు?.. ఆఁ వైదేహిగారా! నమస్కారం.. వైదేహిగారూ జ్ఞాపకం ఉన్నానా?

వై: మీరా! రామారావుగారు! థ్యాంక్యూ రామారావుగారూ సమయానికి దేవుడిలా వచ్చారు! లేకపోతే ఆ రౌడీ వెధవ..

రా: ఏడిశాడు, బక్క సన్నాసి. పారిపోయాడు గాని, లేకపోతే మెక్కలు విరగదన్ని పోలీసులకు అప్పచెప్పేవాణ్ణి.

వై: ఎందుకులెండి.. అయిందేదో అయిపోయింది. పోనీలెండి.. పదండి.. మా ఇంటికి పోదాం ముందు, కొంచెం ఇంటిదాకా దిగబెడతారా?

రా: సంతోషంతో, ఎలా వెళదాం?

వై: కొంచెం దూరం నడుచుకుంటూ వెళదాం రండి ఆపైన చాలా బస్సులు దొరుకుతాయి.

రా: పదండి.

వై: చాలా చిత్రంగా కలుసుకున్నాం మళ్లీ. అందులోనూ మీరు దేవుడిలా వచ్చి ఆదుకున్నారు.

రా: ఆఁ అందులో ఏవుందిలెండి. నేను కాకపోతే మరొకడు వచ్చి ఆ తుంటరిని చావగొట్టేవాడు. ఊరా అడివా?

వై: ఇంత ధైర్యంగా ప్రవర్తించిన మీరు మరి ఆనాడు రైల్లో. అంత బేలగా మాటాడారేం?

రా: నిజం చెప్పనా? ఇదంతా మీ దయ. నాలో ఇంత మార్పు రావడానికి మీరే కారణం.

వై: నేనా? నేనేం చేశాను మీకు?

రా: ఈ జన్మలో ఎవరూ చెయ్యలేనంత ఉపకారం చేశారు ఎలా అంటే చెప్పలేను కాని ఏమిటో నాకు కొండంత ఆశ, ధైర్యం వచ్చాయి.

వై: పోనీలెండి. ఒక మనిషికి నేనామాత్రం సహాయం చెయ్యగలిగానంటే అదెంతకాదు! కాని అదంతా వివరంగా చెప్పాలి నాకు.

రా: తప్పకుండా.. మీరు ఒద్దన్నా చెపుతాను. మీవల్ల నాకింకా బోలెడంత సహాయం కావాలి. డబ్బు సహాయం అనుకోండి.

వై: అవసరం వచ్చినపుడు మనుషులు ఆ సహాయమూ చేసుకోవాలి రామారావుగారూ! లేకపోతే సరేలెండి, ఇంటికెళ్లి మాటాడుకుందాం.

***

తండ్రి: హమ్మయ్యా! దిగబడ్డావా, ఎక్కడికి వెళ్లావు వైదేహీ?

వై: ఎక్కడికంటారేమిటి నాన్నా- గొప్ప గండం తప్పితేనూ! ఈ రామారావుగారూ లేకపోతే యివాళ ఏమైపోయి ఉండేదాన్నో! రండి రామారావుగారూ!

రా: నమస్కారం బాబూ!

- సశేషం

(ఆకాశవాణి సౌజన్యంతో...)

నిర్వహణ: సుధామ 1570 — మాటాట

1		2		■	■	3
	■		■	4		
5		■	6		■	
■	■	7	■		■	■
8	■	9		■	10	11
12			■	13	■	
	■	■	14			

ఆధారాలు

అడ్డం:
1. గాంధీగారి భార్య
4.సమూహము
5.సూర్యకిరణాలలో కనపడే నలుసు పేనుగ్రుడ్డు
6.వస్త్రపు చెంగు
9.నిద్రాక్షతిలోని పండు
10.సొగసు, విలాసము
12.వేశ్య
14.గల్లంతు, క్రమము తప్పుట

నిలువు:
1.ఇంటిపేరు ఇదేగానీ ఇంట్లో గబ్బిలాల కంపు అని సామెత
2.నక్షత్రము
3.కలకత్తా దేవత
4.కర్టెన్ వేసుకోవడానికి దానికి వుండేది
7.పార్వతి
8.పద్మము
11.రమారమి
13.గ్రామము

మాటాట -1569 సమాధానం

■	1 వ	2 ధ	■	3 రా	గి	ణి
4 వ	■	5 ర	6 మ	ణి	■	■
ర్త	■	■	చ్ఛ	■	■	7 కం
8 కు	మా	రి	■	9 వ	ర	ట
డు	■	■	10 పీ	■	■	క
■	■	11 నా	లు	12 క	■	ము
13 వ	ర	వ	■	14 ల్ల	పి	■



కృపావత్సలుడు కపర్ది

సౌరాష్ట్రదేశే వసుధావకాశే
జ్యోతిర్మయం చంద్రకళావతంసమ్
భక్తి ప్రదానాయ కృతావతారం
తం సోమనాథం శరణం ప్రపద్యే

భావం: భూమిపై సౌరాష్ట్రదేశమునందు జనుల భక్తి పెంపొందించుటకై అవతరించినవాడు. జ్యోతిర్మయుడు, చంద్రకళాధరుడు అగు సోమనాథుని శరణు పొందుచున్నాను.

- జ్యోతిర్లింగస్తోత్రము



యాజ్ఞసేని

44 త్రోవగుంట వేంకట సుబ్రహ్మణ్యము

అడుగడుగునా మాకు అండగా నిలిచి మమ్ములను వేయికళ్ళతో కాపాడుచున్నవాడివి నీవే కదా! ధర్మవేత్తవి. ఇప్పుడు పాండుసుతులు సతీసమేతంగా హస్తినాపురానికి రెండవసారి వచ్చారు. కౌరవులు నా పుత్రుల పట్ల ద్వేషభావంగలవారని నాకు తెలుసు. కానీ మేమందరమూ రాజు ధృతరాష్ట్రునికి విధేయులమై వుండవలసినదే గదా! రాజుకు ధర్మబద్ధమైన హితోపదేశం చేసి నా పుత్రులకు ధర్మబద్ధంగా రావలసిన పాలు వచ్చే విధంగా చేయవలసిన బాధ్యత నీదే. నీ అండతోనే మేము కాలం గడుపుచున్నాము. ఇకముందు ఏమి జరుగనున్నదో నీవూ వూహించి పాండు పుత్రులను కాపాడగలవని ఆశించుచున్నాము'' అని అన్నది.


విదురుడు కుంతీదేవి ఆజ్ఞను తీసుకొని వెళ్ళే ముందు ద్రౌపదిని చూచి-

అమ్మా! పాంచాల రాకుమారీ! నీవు కారణ జన్మురాలవి. పాండు సుతులకు పట్టపురాణివయ్యావు. కౌరవులు బహు దుర్మార్గులు. నీతి బాహ్యులు. జాగ్రత్తగా మసలుట నీ విధి. సుపుత్రులను కని వంశమును ఉద్ధరింపుము. సుఖ శాంతులతో వర్ధిల్లుము'' అని అన్నాడు.

24

పాండవులు ద్రౌపదితో కలిసి హస్తినాపురంలో ఐదు సంవత్సరాలు కాలం గడిపినారు.

ఒకనాడు ధృతరాష్ట్రుడు భీష్మపితామహుని, పాండవులను తనవద్దకు పిలిపించుకున్నాడు. పాండవులు తండ్రి ఆజ్ఞ ప్రకారం వచ్చారు. తాను భీష్మునికి, పెద తండ్రి ధృతరాష్ట్రునికి పాదాభివందనం చేశారు. ఆశీస్సులను పొందారు. ఆసీనులయ్యారు. అప్పుడు ధృతరాష్ట్రుడు-



''యుధిష్ఠిరా! శ్రద్ధగా వినుము. నీతో చెప్పే మాటలను నీ సోదరులు కూడా శ్రద్ధగా వినాలి. పాండురాజు ఈ రాజ్యాన్ని వృద్ధిజేశాడు. నా సోదరుడు పాండురాజు బలవంతుడు. నా చేత అనేక యజ్ఞాలు చేయించాడు. అతడు నా ఆజ్ఞలపై అసాధ్యాన్ని సుసాధ్యం చేశాడు. నీవు కూడా నా ఆజ్ఞలను పాటించాలి. నా పుత్రులు గర్వం, అహంకారంగల చెడ్డవాళ్ళు. దుర్మార్గులు. వారు నా ఆజ్ఞలను ఎప్పుడూ పాలింపరు. స్వార్థపరులై మీతో యుద్ధానికి దిగకుండా వుండాలంటే మీరు వెంటనే 'ఖాండవప్రస్థానికి' వెళ్లాలి. మీరు అక్కడ నివసిస్తే మిమ్ములను ఎవరూ బాధించరు. దేవతల రక్షించునట్లు అర్జునుడు సదా మిమ్ములను రక్షిస్తుంటాడు. నీవు అర్ధరాజ్యంగా ఖాండవప్రస్థాన్ని పొంది అక్కడ సోదరులతో సుఖంగా జీవించుము'' అని తదుపరి విదురుని పిలిపించి-

''విదురా! యుధిష్ఠిరుని రాజ్యాభిషేకానికి అన్నింటినీ సిద్ధంగావింపుము. ఆలస్యం వలదు. నేను ఈ రోజే కురుకుల నందనుడైన యుధిష్ఠిరుడిని అభిషేక్తిను. వేదవేత్తలయిన బ్రాహ్మణులను, బంధువులను, వ్యాపారులను, హితులను విశేషంగా రప్పింపుము. పుణ్యాహవాచనం చేయించి బ్రాహ్మణులకు భూరి దక్షిణలను యిమ్ము. గోవులను, గ్రామములను దానం చేయుము. ముత్యాల హారాలు, కోటిసూత్రం, ఉదరబంధం తెప్పించుము. కావలసిన ఏనుగులను సిద్ధము చేయుము. ఏనుగులు పోయి గంగాజలాన్ని తేవాలి. యుధిష్ఠిరుడిని సర్వాభరణాలతో అలంకరింపుము. అంబారి ఏనుగు, సువర్ణాభరణాలు, శ్వేతఛత్రం, చామురాలను సిద్ధం చేయింపుము. రాజులు జయ జయ శబ్దాలు పలకాలి. ప్రజలు ప్రసన్నులై అజమీఢ వంశజుడైన యుధిష్ఠిరుడిని ప్రశంసించాలి. పాండురాజు చేసిన ఉపకారానికి ఈ రాజ్యాభిషేకం చేయాలి'' అని ఆజ్ఞాపించాడు.

భీష్మద్రోణాదులు విదురుడు బాగు! బాగు! అని ప్రశంసించారు. శ్రీకృష్ణుడు ''మహారాజా! నీ ఆలోచన ఉత్తమం కౌరవులకు అభివృద్ధికరం. వెంటనే నీవన్నమాటను నేడే ఆచరించి చూపించుము'' అని అన్నాడు. తొందరపెట్టాడు.

విదురుడు అన్ని ఏర్పాట్లు చేశాడు. అదే సమయంలో శ్రీకృష్ణద్వైపాయన మహర్షి అక్కడకు వచ్చాడు. కౌరవులందరూ బంధు సమేతంగా వేదవ్యాసుని పూజించారు. శ్రీకృష్ణుని ఆజ్ఞానుసారము వేదపండితుల సహాయంతో మహర్షి పట్టాభిషేకం పూర్తిగావించాడు.

- ఇంకావుంది

ఏకాత్మలు శివకేశవులు



కేశవ చతుర్వింశతి
టంగుటూరి మహాలక్ష్మి

పద్మనాభ
11.పాల కడలిలో పన్నగ తల్పమందు
లీల పవళించి జగములు నేలు తండ్రి
పంకజాసన జనక వో పద్మనాభ
భక్తవత్సల సర్వేశ పరమ పురుష

దామోదర
12.యజ్ఞకర్తవు భోక్తవు యజ్ఞమీవు
ఉదరమందున జగముల పదిల పరచు
కున్న దామోదరా మము గన్న తండ్రి
వందనములయ్య జగదీశ విమల చరిత

సంకర్షణ
13.ఆదిశేషుని యంశతో నందు నింట
పడది రోహిణి నోముల పంట వౌచు
నవతరించిన సంకర్షణాఖ్య నిన్ను
రమణుడవు గాన నిల బలరాముడంద్రు

వాసుదేవ
14.భూమి భారము భోగొట్ట భూతములమున
దేవకీ వసుదేవుల తపఫలమ్ము
గా జనించితి వష్టమ గర్భమందు
వాసుదేవుడవై వైరి వాసి జెడగ

ప్రద్యుమ్న
15.భవుని నేత్రాగ్ని భస్మమై భావజుండు
నంద నందనునకు నందనుండుగా జ
నించె తండ్రికి ప్రతి రూపమంచు జనులు
మోదమొందగ ప్రద్యుమ్న నాముడౌచు

అద్వైత జ్ఞాని



సర్వమత సారాన్నీ గ్రహించి ఆత్మజ్ఞానంతో భగవంతుని సందర్శించవచ్చని నిరూపించిన అద్వైత గురువు శ్రీరామకృష్ణ పరమహంస.

నిజమైన భక్తాన్వేషణతో తాను పూజించే కాళీ మాతనే ప్రశ్నించి నిశ్చల ధ్యానంతోసాక్షాత్కరింపచేసుకొని సత్యశోధన పట్ల అసక్తి కలిగి సంపూర్ణానుభవ సాధనతో తాను తెలుసుకొన్న విషయాలనే తన శిష్యులకు బోధించిన సత్యగురువు రామకృష్ణ పరమహంస

- దేగల అనితాసూరి

అడగగలటమూ ఆధ్యాత్మికమే

భగవంతుడు అనంత కరుణాంతరంగుడు. భక్తులు ఏమడిగినా ఠక్కున నిండుగా దండిగా, మెండుగా ఇచ్చేస్తాడు. దయాసింధువు. భక్తులకు ఎప్పుడూ ఏదో ఒకటి ఇద్దామనే దయతో నిండి ఉంటుంది ఆయన హృదయం. అయితే భక్తుడు భగవంతుడ్ని అడగాలి. అడగగలగాలి. ఏమిటి అడగారో తెలుసుండాలి. భగవంతుడ్ని ''వరం'' అడగటమూ ఒక కళే. ఎందుకంటే ఏమి అడగాలో తెలియాలంటే మనకి ఏమి కావాలో పూర్తిగా తెలిసి ఉండాలి.

''అడిగిని వానికి అడిగినవన్నీ ఇస్తాడు భగవంతుడు. అడగని వానికి అతనికి ఏమి కావాలో అదిస్తాడు భగవంతుడు'' అంటారో మహనీయుడు.

అక్కడే ఉంది ఆధ్యాత్మికమంతా!ఆధ్యాత్మిక తత్త్వమంతా!!.. భగవంతుని తత్త్వమంతా!!

ఓ దంపతులుండేవారు. ఎన్నో విధాలుగా మరెన్నో రకాలుగా జీవితాన్ని నెట్టుకు రావాలని ప్రయత్నాలు చేసేరు. ఏ ఒక్కటీ వాళ్లకి కలిసిరాలేదు. వాళ్లేమి చేసినా కిట్టుబాటు అవడం లేదు. చివరకు బ్రతుకుతెరువు కొరవడి పోయింది. ఎలా తమ బతుకులు నెట్టుకురావాలో తెలీని పరిస్థితిలో ఆ దంపతులు నలిగిపోతున్నారు. రోజురోజుకి బతుకు దుర్భరమైపోతోంది. ఎన్నెన్నో చేసినా కాలం, అదృష్టం కలిసిరాక ప్రతి పనిలోను నష్టాలు, కష్టాల పాలైపోతున్నారు. భవిష్యత్ అంధకారంగా గోచరిస్తోంది.ఆ దంపతులలో భార్యం కొంచెం తెలివైంది. ''లౌకికం'' తెలిసినది. ఆలోచించి ఆలోచించి ఓ నిర్ణయానికి వచ్చింది. ఓ మార్గం దొరికినందుకు బాగా సంతోషించి, తనకొచ్చిన ఆలోచనని భర్తకి చెప్పింది. ఏమి చేసినా మనకి దుఃఖమే మిగుల్తోంది. కాబట్టి మనం ఇంకేమీ చేయొద్దు. భగవంతుడి కోసం ఇద్దరం తపస్సు చేద్దాం. మన తపస్సుకి మెచ్చి ఆ భగవంతుడు తప్పక ప్రసన్నుడవుతాడు. అప్పుడు.. ఆయన్నే అన్నీ అడిగేద్దాం అని భర్తకి చెప్పింది. భార్య ఆలోచన భర్తకి కూడా బాగా నచ్చింది. వెంటనే మంచి ప్రదేశం చూసుకుని ఇద్దరూ భగవంతుని కోసం తపస్సు మొదలుపెట్టేరు. మంచి భక్తిప్రపత్తులతో తపస్సు చేసేరు. భగవంతుడు ఆ తపస్సుకి ఆనందపడ్డాడు. పరవశుడయ్యేడు. ప్రసన్నుడయ్యేడు. వెంటనే ప్రత్యక్షమయ్యాడు.

మీ ఇద్దరి తపస్సుకి మెచ్చేను!! మీకు మీరనుకుంటున్నట్టు ఒక వరం కాదు మూడు వరాలు ఇస్తాను. కోరుకోండి అన్నాడు భగవంతుడు.

అప్పుడొచ్చింది అసలు చిక్కు. భగవంతుడ్ని ఏమి కోరుకోవాలి? ఏమి కోరుకుంటే ఏమి కష్టమో, ఏమి నష్టమో తెలీక దంపతులిద్దరూ ఒకర్ని ఒకరు చూసుకుంటున్నారు. భగవంతుడికి వాళ్ల పరిస్థితి అర్థమయ్యింది. ''ఏం పర్వాలేదు. నేను ఇక్కడే మీ ముందు ఉంటాను. బాగా ఆలోచించుకుని కోరుకోండి'' అని చెప్పేడు భగవంతుడు.

ఒక్కొక్కరుగా, ఇద్దరూ కలిసి ఏమి కోరుకోవాలో ఆలోచిస్తున్నారు. ఇది కాదు, అది కాదు అని ఒక్కొక్కటి ఆలోచిస్తున్నారు. అప్పుడు భర్తతో భార్య అంది ''ఏమండీ! ఐశ్వర్యంలో అందమూ ఒక భాగమే మనకి మూడు వరాలు ఉన్నాయి. నిజానికి మనిద్దరి ముక్కులు చాలా సొట్టగా, లోపలికి చొచ్చుకుపోయి అంద విహీనంగా ఉన్నాయి. కాబట్టి మొదటి వరంగా మనం మంచి ముక్కులు కోరుకుందాం'' అంది భార్య. భర్త సరేనన్నాడు. భగవంతుడు చూస్తున్నాడు భార్యాభర్తలు ఇద్దరూ ఒకరు మరొకరికి కనిపించేలా ఎదురెదురుగా ఉన్నారు. ''స్వామీ! మా ముక్కులు మరీ అసహ్యంగా ఉన్నాయి. అంద విహీనంగా ఉన్నాయి.మాకు మంచి ముక్కులు ప్రసాదించండి స్వామీ!'' అని కోరుకున్నారిద్దరూ. 'ప్రాప్తిరస్తు' అన్నాడు భగవంతుడు. అంతే... ఇద్దరి శరీరాల్లో పాదాల నుంచి శిరస్సు వరకు అందమైన ముక్కులు శరీరమంతా వచ్చేసాయి. ఒకళ్లనొకళ్లు చూసుకుంటున్నారు. ఎంత అందమైనవి అయినా శరీరమంతా ముక్కులు వచ్చేస్తే ఎలా ఉంటుంది? శరీరం యావత్తు ''ముక్కుల''మయం అయిపోతే ఎలా వుంటుంది? శిరస్సు నుంచి పాదాల వరకు ముక్కులతో మనుషులిద్దరూ పరమ అసహ్యంగా,మహా భయంకరంగా ఉన్నారు. చేసిన తప్పు ఇద్దరికీ అర్థమయ్యింది. భగవంతుడు అలా చూస్తూ అక్కడే ఉన్నాడు.

ప్రసాదం

- రమాప్రసాద్ ఆదిభట్ల
9348006669

దంపతులు ఇద్దరూ జరిగిన తప్పు గ్రహించి నివారణోపాయం ఆలోచించేరు.భార్య అంది భర్తతో ''కంగారు పడకండి ఇంకా మనకి రెండు వరాలున్నాయి. మనం ఇలా చేద్దాం అని భర్తకి చెప్పింది. భర్తకి నచ్చింది. ''స్వామీ! పెద్ద తప్పయిపోయింది. పొరపాటు జరిగింది. శరీరమంతా ముక్కులతో మహాభయంకరంగా ఉన్నాం.. ఈ ముక్కుల్ని తొలగించండి స్వామీ!'' అని రెండో వరం కోరుకున్నారిద్దారూ. భగవంతుడు 'శుభం' అన్నాడు. ఒక్కసారిగా ఇద్దరి శరీరాల్లో ఉన్న అన్ని ముక్కులు మాయమైపోయేయి. వచ్చిన అన్ని ముక్కులతోపాటు మొదట్నుంచి ఉన్న 'సొట్టముక్కు' కూడా పోయింది.

అప్పుడు తెలిసొచ్చింది దంపతులిద్దరికీ సొట్టదో, లొత్తదో ఏదో ఒక ముక్కు లేకపోతే ఏమవుతుందో అర్థమయ్యింది. ఇద్దరికీ గాలి తీసుకునే అవకాశం లేక ఇద్దరూ ఉక్కిరిబిక్కిరి అయిపోతున్నారు. గిలగిలలాడుతున్నారు. ఆలోచించటానికి సమయం కాదది. ప్రాణాలు గాల్లో కలిసిపోవడానికి సిద్ధమవుతున్నాయి. మరో ఆలోచన అనేది లేకుండా దంపతులిద్దరూ ''స్వామీ! మా ముక్కు మాకు ప్రసాదించండి'' అని గిజగిజ గించుకుంటూ ఏదో ఒకలా తమ మూడోవరం కోరుకున్నారు దంపతులు. 'ఇచ్చేను పో' అన్నాడు భగవంతుడు. మళ్లీ దంపతులిద్దరికీ ముందు ఉన్న మొద్దు ముక్కు, సొట్టముక్కు, లొత్తలు పడ్డ ముక్కు వచ్చింది. మూడు వరాలు అయిపోయాయి కాబట్టి భగవంతుడు కూడా అదృశ్యమైపోయాడు.

చూసేరా! సాక్షాత్తు భగవంతుడు ప్రత్యక్షమై, ఒక్కటి గాదు మూడు వరాలిస్తాను, కోరుకోండి అని అభయమిస్తే వరాలు కోరుకోవటానికి ముందు, మూడు వరాలు కోరుకున్న తర్వాత, భగవంతుడు మూడు వరాలు ప్రసాదించిన తర్వాత ఒనగూరినదేమిటి? మిగిలింది ఏమిటి?? మిగిలింది ఆ సొట్ట ముక్కే!! అదే ఆశ్చర్యం!! అందుకే భగవంతుడ్ని కోరుకోవటమూ ఒక కళే. అది అర్థమవ్వాలంటే- ఆధ్యాత్మిక లోతులు తెలియాలి. తెలుసుండాలి.

★★★

శ్రీచక్రమే శ్రీమాత

శ్రీ చక్ర ఆవిర్భావం: ఉండేది బ్రహ్మమొక్కటే. ''ఏకమేవాద్వితీయం బ్రహ్మ'' ''ఏకం సత్ విప్రా బహుదా వదంతి'' అని ఆర్ష వాఙ్మయం చెబుతోంది. ఒకే సత్యాన్ని పండితులు అనేక పేర్లతో అనేక రూపాలుగా భావిస్తూ పిలుస్తూ వచ్చారు. ఈ బ్రహ్మము సత్, చిత్, ఆనంద స్వరూపములు కలది. అది చలనము లేనిది, నిశ్చలమైనదైనప్పటికీ, చేతనమను బీజమును తనయందే కలిగి ఉండుట దానిలోని విశేషము. అనగా ఒక సంకల్పము, ఒక స్పందన కలిగినదని అర్థము.

తంత్ర శాస్త్రం ప్రకారం కేవలం కాంతి (ప్రకాశ) రూపముగానున్న బ్రహ్మమునందు ఏర్పడిన మొదటి కదలికను ''విమర్శ'' (ఆలోచన) అన్నారు. తాంత్రికులు కాంతిని పరమశివుడుగాను, విమర్శను పరాశక్తిగాను భావించారు. కాంతి (ప్రకాశ) స్వరూపమైన బ్రహ్మములో ఏర్పడిన మొదటి కదలికలవల్ల నాదము ఏర్పడినది. ఈప్రథమనాదము సూక్ష్మరూపమైన బిందువుగా ఏర్పడినది.

శ్రీవిద్యాపరముగా పరమేశ్వరుడు ప్రకాశ బిందు వనియు, పరమేశ్వరి, విమర్శ బిందువనియును ప్రకాశ బిందువు అద్దము వంటి విమర్శబిందువు (పరమేశ్వరి) యందు ప్రతిబింబమగుటచే మిశ్రమ బిందువేర్పడుచున్నదని భావించాలి. విశ్వ సృష్టియంతయు బిందువు నుండి ఆరంభమై క్రమముగా వ్యాప్తిని పొందింది. బిందువు నుండి మొదట ఆకాశముగ నేర్పడి నాదమును తన్మాత్రగా పొందియున్నది తదుపరి వాయు రూపమును పొంది ధ్వని, స్పర్శలను కలిగియున్నది. ఆ తరువాత జల రూపమును పొందినది.



అప్పుడు, శబ్ద స్పర్శ రూప రసములను పొందినది. తరువాత అందుండి పృథివీ రూపమును పొంది, శబ్ద, స్పర్శ, రస, గంధములను గుణములను పొందినది. ఈ పంచభూతములే సర్వ జీవజాలమునకును మూలకారణమై యున్నవి. ఇట్లు కొన్ని యుగములైన తరువాత కల్పాంతమునందు సంహారక్రియ ఆరంభమై క్రమముగా సృష్టి వినాశనము పొందు బిందు రూపమున నున్న పార్వతీ పరమేశ్వరుల యందు లీనమగును ఆ విధముగా ఈ సృష్టియంతయును శివశక్త్యాత్మకమై యున్నది.

ఈ బిందువునందే కేంద్రీకరించబడిన శివశక్తుల విజృంభణము కలదు. దీనినే ''పరాబిందువు'' అందురు. ఇందులో కామేశ్వర, కామేశ్వరీ స్వరూపములు కలవు. ఈ బిందువే మూల ప్రకృతి. దీనికే సర్వానందమయ చక్రమని పేరు. నిజానికి యిది నిర్గుణమ, తేజోమయము, నామరూపములు లేనిది. దీనిని ఋతము, ఆత్మ, పరబ్రహ్మము, సచ్చిదానందము అను నామములతో వ్యవహరిస్తారు. ఈ బిందువే శ్రీ చక్రమునకు ఆధారము. ఈ పరాబిందువునందే సృష్టికి కావలిసిన శక్తి అంతయూ బీజప్రాయముగానున్నది. సృష్టి జరుగుటకు ఈ పరాబిందువు కొంత క్రిందికి దిగివచ్చి శబ్ద బ్రహ్మముగా మారుతుంది. అనగా విత్తనము (గింజ)లో రెండు పప్పులు (బద్దలు) ఉన్ననూ చుట్టూ ఉన్న పొట్టు (పై పొర) వలన గింజ ఒకటిగా కనబడినట్లు ఈ పరా బిందువునందు మూడు బిందువులేర్పడినవి. ఒకటి- శివ శక్తులొకటిగానున్న 'బిందువు', రెండు- అచేతనంగా ఉన్న 'శివుడు' మూడు- 'చేతన స్వరూపమైన శక్తి'. ఈ మూడు బిందువులే త్రిగుణాత్మకము, త్రిపుటుల సమ్మేళనము, త్రిపురముర యొక్క స్థానమును అగు మొదటి త్రికోణము. పరబ్రహ్మము నుండి ప్రారంభమయ్యే ప్రతి అంశము కూడా అవిభాజ్యమైన, అవినాభావమైన శివశక్తుల సమ్మేళనమే. అందువల్లనే కాళిదాస మహాకవి ''వాగర్థావివ సంపోక్తౌ వాగర్థ ప్రతిప్రత్తయే జగతః పితరౌ వందే పార్వతీ పరమేశ్వరౌ'' అని ప్రార్థించి వుండవచ్చు. ఇది శివపార్వతుల ఏకరూపమైన అర్ధనారీశ్వర తత్వాన్ని సూచిస్తోంది. వాక్కునుండి అర్థము ఎట్లు విడదీయరానిదో ఆ రీతిగా ఉన్నారని భావన.

- డా॥ గుడిపాటి వి.ఆర్.ఆర్.ప్రసాద్
9490947590


(ఇంకా ఉంది)

చిత్తశాంతి కలిగించినవారే అవధూత

ఏ సాధుపురుషుని దగ్గర కు వెళ్లినపుడు మనస్సు శాంతిస్తుందో, ఏ పూర్ణపురుషుని దర్శనంతో చిత్తం నిశ్చలత్వాన్ని పొందుతుందో అతడే పూర్ణయోగిగా మన పెద్దలు చెబుతారు.

చాలామంది యోగులు, సాధుపురుషులు మొదట్లో చాలా సామాన్యంగా ఉంటారు. కాని వారు వయస్సుతోపాటుగా వారి జ్ఞానం పెరుగుతుంది. యుక్తవయస్సులోనే లేక చిరుప్రాయంలోనోవారు జ్ఞానులుగా అందరికీ పరిచయం అవుతుంటారు. అట్లాంటి కోవకు చెందినవారు శ్రీ. బి.వి. నరసింహస్వామి వారు వీరు సాయిదూతగా అందరికీ పరిచయస్థులు.వీరి పుట్టుక కూడా ఒక అసాధారణంగా జరిగింది. వీరి తల్లిదండ్రులకు పుత్రసంతానం కోసం తిరగని ఊరు ఉండేది కాదు. అట్లా పుణ్య క్షేత్రాల దర్శనం చేస్తున్నా వీరికి సంతానం లభ్యమవలేదు. ఒకనాడు వీరింటికి అనుకోని అతిథిగా ఒక సాధువు విచ్చేసారు. ఆయన మీరు షోలింగర్ తీర్థయాత్ర చేసి రండి. మీ కోరిక నెరవేరుతుంది అన్నాడు.

ఆయన చెప్పినట్లుగా నే వారి కోరిక తీరింది. అంగచ్చియమ్మాళ్ గర్భవతి యై గోధూళి వేళ గోశాల వైపు వెళుతుండగా అనాయాసంగా ఎవరి సాయం లేకండా అదే ప్రాంగణంలోనే ప్రసవం జరిగిపోయింది. నరసింహస్వామికి అదేనాందీ వాచకం. ఇక అప్పటినుంచి పూలు వికసిస్తున్నట్టుగానే నరసింహం దినదినాభివృద్ధి చెందుతూ అలౌకిక సంఘటనలు చేస్తుండేవారు. అన్ని పుణ్యక్షేత్రాలు తిరిగేవారు. రమణాశ్రమానికి వెళ్లారు. అక్కడ రమణుల గురించి పూర్తి గా అవగాహన తెచ్చుకున్నారు. శ్రీరమణులతోమాట్లాడేవారు. సెల్ఫ్ రియలైజేషన్ అనే ఆంగ్ల గ్రంథాన్ని నరసింహస్వామి కూర్చారు.



సాయిదూత
శ్రీబి.వి.నరసింహస్వామి
రచన: రావినూతల శ్రీరాములు
10/228, వనస్థలిపురికాలనీ,
మల్కాజిగిరి, హైదరాబాదు -47
సెల్: 8885653924

అయాచితంగా వచ్చిన ఆహారాన్ని స్వీకరిస్తూ పాదయాత్ర చేస్తుండేవారు. ఆయన్ను చూసిన వారు ఎవరైనా తమ వాహనంలో రమ్మంటే వెళ్లేవారు. లేదంటే నడుచుకుంటూ తన దారిన తాను వెళ్లుతూ ఉండేవారు. అనుకొన్న పుణ్యక్షేత్రాలన్నింటినీ దర్శించి వచ్చేవారు. సిద్ధరూఢాశ్రమం కూడా వెళ్లారు. సిద్ధరూఢాస్వామి వారి అనుగ్రహంతో సంస్కృత విద్యపై పట్టు సాధించారు. ఆ పండరిపురం వెళ్లారు. అక్కడ ఒక అవధూతను దర్శనం చేసుకున్నాడు. ఆమె వెనుకనే నరసింహుడు కూడా అడుగులు వేయసాగాడు. అప్పుడు ఆ యోగిని నీవు నాతో ఎక్కడకు వస్తావు అని అడిగితే భగవంతుని దర్శనం చేయించండి అని నరసింహస్వామి అడిగాడు. అలా మాట్లాడుతూ ఉండగానే అక్కడికి ఓ పురుషుడు వచ్చి పళ్లెంలో విందుభోజనం తెచ్చి నరసింహునికి ఇచ్చాడు. అతడిని తినమని ఆ యోగిని చెప్పింది. నరసింహుడు ఆ భోజనం స్వీకరించిన తరువాత కూడా మళ్లీ భగవంతుని దర్శనం కోసం అడిగితే ఇప్పుడు నీకు ఆహారాన్ని పండరీ నాథుడే తెచ్చాడు. కాని నీవు గుర్తించలేకపోయావు. నీకింకా పరిపక్వత రాలేదు అన్నదామె. ఖేదపడుతున్న నరసింహుని యోగినియే ఓదార్చింది. నీవు సదా భగవంతుని నామాన్ని వదలక జపిస్తూ ఉండూ స్వామి త్వరలో నిన్ను కరుణిస్తాడని అభయం చెప్పి మరీ కదిలింది. ఆ యోగిని ఆదేశంతో స్వామి నామాన్ని వదలక నరసింహుడు జపించేవాడు. ఇలా నరసింహస్వామి ని గూర్చి చిన్న చిన్న శీర్షికలతో విషయాన్నంతావివరంగా రావినూతలశ్రీరాములు సేకరించి గ్రంథస్తం చేశారు. సులభంగా చదవడానికి వీలుగా ఉన్నశైలితో ఏకబిగిన చదివించే గుణంతో ఉన్న ఈ చిరుపొత్తం అందరినీ ఆకర్షిస్తుంది చదివిస్తుందీ ''సాయిదూత శ్రీబి.వి. నరసింహస్వామి.

- చరణశ్రీ

చిత్రభూమి

జీవితమొక నటనయనే
వివేకమును ప్రోదిజేసి విందుగ పరచే
నవరసముల సినిమాయై
అవిరళముగ ముదమునిచ్చుటద్భుతమేగా!

12 ఆంధ్రభూమి గురువారం, 22 ఫిబ్రవరి 2018

లండన్‌కు భరత్



సూపర్‌స్టార్ మహేష్‌బాబు హీరోగా నటిస్తున్న తాజా చిత్రం భరత్ అనే నేను. కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం ప్రస్తుతం హైదరాబాద్‌లో శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. ఖైరా అద్వాని హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రాన్ని ఏప్రిల్ 26న విడుదల చేయనుంది. శ్రీమంతుడు తరువాత వీరిద్దరి కాంబినేషన్‌లో వస్తున్న ఈ చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ముఖ్యంగా ట్రేడ్ వర్గాల్లో సంచలనం రేపుతున్న ఈ చిత్రం తదుపరి షెడ్యూల్‌ను లండన్‌లో ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. సినిమాకు సంబంధించిన కొన్ని కీలక సన్నివేశాలు అక్కడ చిత్రీకరిస్తారట. మార్చి మొదటివారంలో యూనిట్ లండన్ బయలుదేరనుంది. ఈ షెడ్యూల్‌తో సినిమా పూర్తవుతుందని, దేవిశ్రీ సంగీతం అందిస్తున్న పాటలను మార్చి చివరి వారంలో విడుదల చేస్తారట. డి.వి.వి. క్రియేషన్స్ పతాకంపై డి.వి.వి.దానయ్య నిర్మిస్తున్న ఈ చిత్రంలో శరత్‌కుమార్, ప్రకాష్‌రాజ్‌లు ముఖ్యపాత్రలు పోషిస్తుండగా, మహేష్ ముఖ్యమంత్రిగా కనిపించనున్నాడు.

మార్చిలో యుద్ధభూమి



1971 భారత్ సరిహద్దుల్లో జరిగిన యధార్థ సంఘటనల ఆధారంగా మలయాళంలో తెరకెక్కిన 1971 బియాండ్ బార్డర్స్ చిత్రాన్ని తెలుగులో 'యుద్ధభూమి' పేరుతో విడుదల చేస్తున్నారు. మలయాళ సూపర్‌స్టార్ మోహన్‌లాల్, అల్లు శిరీష్ హీరోలుగా నటించిన ఈ చిత్రానికి మేజర్ రవి దర్శకత్వం వహించాడు. జస్‌రాజ్ ప్రొడక్షన్స్, శ్రీ లక్ష్మీజ్యోతి క్రియేషన్స్ బ్యానర్లపై ఎ.ఎన్.బాలాజీ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం డబ్బింగ్ కార్యక్రమాలు జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని మార్చిలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్మాత వివరాలు తెలియజేస్తూ- రియల్ లైఫ్‌లో మేజర్ అయిన మేజర్ రవి దర్శకత్వం వహించిన చిత్రమిది. 1971 నేపథ్యంలో ఇండియా బార్డర్‌లో జరిగిన యుద్ధం నేపథ్యంలో ఈ సినిమా వుంటుంది. ఆయన 2002 సంవత్సరంలో మొదటిసారి పునర్జని చిత్రంతో దర్శకుడిగా మారాడు. పలు చిత్రాలకు దర్శకత్వం వహించిన ఆయన యధార్థ సంఘటనల నేపథ్యంలో ఈ చిత్రాన్ని తెరకెక్కించాడు. ఆర్మీ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కిన ఈ చిత్రం దేశభక్తిని చాటుకుంది. మోహన్‌లాల్, అల్లు శిరీష్‌ల పాత్రలు ఆకట్టుకుంటాయి. తప్పకుండా ఈ సినిమా విజయం సాధిస్తుందన్న నమ్మకం ఉంది అన్నారు.

'సత్యాగ్యాంగ్' వస్తోంది



సాత్విక్ ఈశ్వర్, ప్రత్యూష్, హర్షిత ముఖ్యపాత్రల్లో ప్రభాస్ దర్శకత్వంలో సిద్ధయోగి క్రియేషన్స్ బ్యానర్‌పై మహేష్ కన్నా నిర్మిస్తున్న చిత్రం 'సత్యాగ్యాంగ్'. ఈ చిత్రం అన్ని కార్యక్రమాలు పూర్తిచేసుకుని మార్చి 15న విడుదలకు సిద్ధమవుతున్న సందర్భంగా హైదరాబాద్‌లో ఆడియో సక్సెస్ మీట్‌ను ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో నిర్మాత మహేష్ కన్నా మాట్లాడుతూ- ఇటీవలే కర్నూలులో విడుదల చేసిన పాటలకు మంచి రెస్పాన్స్ వస్తోంది. ఆడియో సూపర్‌హిట్‌గా నిలవడంతో సినిమాపై అంచనాలు పెరిగాయి. సమాజంలో అనాథలే ఉండకూడదనే పాయింట్‌తో తెరకెక్కిస్తున్న సందేశాత్మక చిత్రమిది. హీరోగా పరిచయం అవుతున్న సాత్విక్ ఈశ్వర్‌కు మంచి భవిష్యత్తు వుంటుంది. దర్శకుడు అద్భుతంగా తెరకెక్కించాడు. ఈ చిత్రాన్ని మార్చి 15న విడుదల చేస్తామన్నారు. దర్శకుడు ప్రభాస్ మాట్లాడుతూ- పాటలు సక్సెస్ అయినందుకు ఆనందంగా వుంది. ఈ చిత్రం ఇంత బాగా రావడానికి కారణం మా నిర్మాత వినోద్‌ఖన్నా. ప్రతి విషయంలో సపోర్టు అందిస్తూ మమ్మల్ని ముందుకు నడిపిస్తున్నారన్నారు.

నటుడిగా పేరు తెచ్చుకుంటా



రంజిత్

రంజిత్ హీరోగా పరిచయం అవుతూ దిక్కులు చూడకు రామయ్య ఫేం త్రికోటి పేట దర్శకత్వంలో సామ్మి ఫిలింస్ పతాకంపై భరత్ సోమి నిర్మించిన చిత్రం 'జువ్వ'. అన్ని కార్యక్రమాలు పూర్తిచేసుకున్న ఈ చిత్రం శుక్రవారం విడుదలవుతున్న సందర్భంగా హీరో రంజిత్ చెప్పిన విశేషాలు...మాది వైజాగ్. చిన్నప్పటినుంచీ సినిమాలంటే ఇష్టం. ఆ ఆసక్తితోనే ఇండస్ట్రీలోకి వచ్చాను. హైదరాబాద్‌లో ఎంబిఏ చేశాను. హీరోగా చేయాలనే ఉద్దేశ్యంతో చిన్న చిన్న పాత్రలను చేయలేదు. నువ్వు నేను ఒకటవుదాం సినిమా తరువాత నేను నటిస్తున్న చిత్రమిది. దర్శకుడు త్రికోటి అద్భుతమైన కథతో తెరకెక్కించాడు. సాధారణ ప్రేమకథకు డ్రామాను కలిపి తెరకెక్కించాడు. అన్నిరకాల కమర్షియల్ హంగులతో తెరకెక్కిన ఈ చిత్రంలో చాలా ట్విస్టులు ఉంటాయి.

ముఖ్యంగా కీరవాణి అందించిన సంగీతం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. నచ్చిన అమ్మాయి కోసం ఓ యువకుడు ఏం చేశాడనేది ఈ కథ. ఈ సినిమా కోసం మా అన్నయ్య భరత్ నిర్మాతగా మారాడు. ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా తెరకెక్కిన ఈ చిత్రంతో హీరోగా గుర్తింపు తెచ్చుకుంటానన్న నమ్మకం వుంది. ఈ సినిమా తరువాత బయటి బ్యానర్‌లో ఓ చిత్రం చేస్తున్నాను అన్నారు.

బాలీవుడ్ ఆఫర్



రెజీనా

గ్లామర్ హీరోయిన్ రెజీనాకు గత ఏడాది కాలంగా సరైన సక్సెస్ దక్కడంలేదు. వరుసగా సినిమాలు చేస్తున్నాకూడా పరాజయాలు పలకరిస్తూనే వున్నాయి. దాంతో కొత్త అవకాశాలు తగ్గాయి. ఇటీవలే నాని నిర్మించిన అ! సినిమాలో మాయ పాత్రలో నటించి ఆకట్టుకుంది. తాజాగా కోలీవుడ్‌లో కూడా ఒకే సినిమా చేస్తున్న ఈమెకు బాలీవుడ్ నుంచి బంపర్ ఆఫర్ దక్కింది. గతంలో కూడా బాలీవుడ్ అవకాశం వచ్చినట్టే వచ్చి చేజారిపోయింది. తాజాగా ఈమెకు వచ్చిన అవకాశం చూస్తే నిజంగా బంపర్ ఆఫర్ అని చెప్పాలి. ఎందుకంటే 3 ఇడియెట్స్, మున్నాభాయ్ ఎంబిబిఎస్ లాంటి చిత్రాలను నిర్మించిన విదు వినోద్ చోప్రా నిర్మిస్తున్న 'ఏ లడకీకో దేఖాతో ఐసా లగా' టైటిల్‌తో తెరకెక్కనున్న చిత్రంలో రాజ్‌కుమార్ రావు, సోనమ్ కపూర్‌లతో కలిసి రెజీనా నటిస్తుందట.

పంతం పట్టింది!



గ్లామర్ షోకులతో కుర్రకారు హృదయాలను మత్తెక్కించి ఐటెం పాటలతో క్రేజ్ తెచ్చుకున్న హంసా నందిని మళ్లీ తన సత్తా చాటుకునేందుకు సిద్ధమవుతోంది. ఈమధ్యే ఆమె చేసిన కొన్ని పాటలు పెద్దగా ఆకట్టుకోలేదు. దానికితోడు స్టార్ హీరోయిన్స్ ఐటెం సాంగ్స్ చేస్తుండడంతో ఈమెకు అవకాశాలు తగ్గాయి. దాంతో కొంత గ్యాప్ తీసుకున్న హంసా, కేవలం ఐటెం సాంగ్స్‌పైనే దృష్టి పెట్టకుండా సినిమాల్లో కీ రోల్స్ పోషించేందుకు సిద్ధమైంది. తాజాగా గోపీచంద్ హీరోగా నటిస్తున్న పంతం సినిమాలో ఓ ప్రత్యేక పాత్రలో నటిస్తూనే అందులో ఐటెం సాంగ్ చేస్తోందట. గతంలో గోపీచంద్ నటించిన లౌక్యం సినిమాలో నటించి ప్రత్యేక పాట చేసిన హంసాకు మంచి క్రేజ్ దక్కింది. మళ్లీ అదే సెంటిమెంట్‌ను ఫాలో అవుతున్న ఈమె కాస్త గ్లామర్ డోస్ పెంచి మళ్లీ రసిక హృదయాలను పిచ్చెక్కించేందుకు సిద్ధమైంది. పంతం సినిమాలో పాత్ర బాగా నచ్చిందట. అందుకే నటిస్తానని చెప్పిందట. దాంతోపాటు మరో రెండు సినిమాల్లో కూడా ఐటెం సాంగ్ చేసే అవకాశాలున్నాయి.

హంసా నందిని

నారా రోహిత్ సరసన..

నారా రోహిత్ ప్రస్తుతం 'ఆటగాళ్ళు' సినిమా షూటింగ్‌లో ఉన్నారు పరుచూరి మురళీ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా యాక్షన్ థ్రిల్లర్‌గా ఉండనుంది. ఈ చిత్రంలో రోహిత్ సరసన హీరోయిన్‌గా బెంగాలీ నటి దర్శన బానిక్‌ను సెలెక్ట్ చేశారట. ఇప్పటికే ఆమె తన పాత్ర తాలూకు షూటింగ్ కూడా మొదలుపెట్టింది. ఫ్రెండ్స్ మూవీ క్రియేషన్స్ పతాకంపై వాసిరెడ్డి రవీంద్ర, వాసిరెడ్డి శివాజీ, మక్కెన రాము, వడ్లపూడి జితేంద్రలు నిర్మిస్తున్న ఈ చిత్రంలో జగపతిబాబు కూడా ఒక కీలక పాత్రలో కనిపిస్తుండడం విశేషం. సాయి కార్తీక్ సంగీతం అందిస్తున్నాడు.

మార్చి 2న దండుపాళ్యం 3

దండుపాళ్యం బ్యాచ్ అంటే సినిమా జనాల్లో క్రేజ్ వుంది. దండుపాళ్యం-1, దండుపాళ్యం-2 భారీ ఫెనింగ్స్‌తో సూపర్ సక్సెస్ సాధించాయి. ఇప్పుడు చివరి పార్టుగా దండుపాళ్యం-3 మార్చి 2న రానుంది. భిన్నమైన కథాంశంతో, సహజమైన సన్నివేశాలతో, భావోద్వేగమైన నటనతో దండుపాళ్యం చిత్రాలు క్రేజ్ సంపాదించుకున్నాయి. ఇదే ఊపులో దండుపాళ్యం-3 కూడా తెరకెక్కింది. శ్రీనివాసరాజు దర్శకత్వంలో రూపొందిన ఈ సెన్సేషనల్ చిత్రం మరోసారి తెలుగు ప్రేక్షకులనుథ్రిల్ చేయనుంది. సాయికృష్ణ ఫిల్మ్స్ సమర్పణలో, శ్రీ వాడపల్లి వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై శ్రీనివాస్ మీసాల, రజనీ తాళ్లూరి సంయుక్తంగా తెలుగు ప్రేక్షకులకు ఈ చిత్రాన్ని అందిస్తున్నారు. బొమ్మాళి రవిశంకర్, పూజాగాంధీ, మకరంద్ దేశ్‌పాండే, రవికాలే ఇందులో ప్రధాన పాత్రలు పోషించారు. ఈ చిత్రానికి సంబంధించిన ఫిబ్రవరి 25న భారీగా ప్రీ రిలీజ్ వేడుక చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ- దండుపాళ్యం సీరిస్‌లో వచ్చిన చిత్రాలన్నీ ఘనవిజయాలు సాధించాయి. ఈ సీరిస్‌లో భాగంగా ఆఖరి పార్ట్ దండుపాళ్యం-3 రూపొందించాం.